భారతి

మాసపత్రిక

★

సంపాదకుడు :

శివలెంక శంభుప్రసాద్

★

జూన్ 1971

సంపుటము : 48 : సంచిక : 6 :

విడిపత్రిక వెల ఒక రూపాయి

వి ష యా ను క్ర మ ణి క

జూన్ 1971

అలేఖ

శ్రీ భట్టిప్రోలు కృష్ణమూర్తి

ఒక శరన్మధుర చంద్రిక విచ్చుకొనిపోవు
మూల మూలల హేమధూళి జల్లి—
ఒక పుష్పకుంజము వికసించు నిండుగా
గాలి గాలివి మధు గంధ మలమి—
ఒక అలౌకిక విపంచిక మ్రోగిపోవును
తీగ తీగల తీయ తేనె లొలికి—
ఒక గిరి నిర్ఝర మురుకులాడుచు పారు
గట్టు గట్టున గలగలల నింపి—
నీ ముఖేందువు; తను వల్లరీ మతల్లి,
నీ గళమ్ము, సుధాహాస రాగ ఝరిణి,
స్మృతి పథమ్మున కదలెనా ఇంచుకంతె
క్షణము క్షణమున ఒకరీతి అనుభవమ్ము!

ఒకపరి తేలి పోదును మ
హోన్నత పర్వత చుంబి నీర వా
హికగ—మరొక్క మా రమర
హేలగ వ్రేలెదు ఇంద్రచాపపున్
చికుర విచిత్ర వర్ణముల
సీరగు చారల నేను నొక్క రే
ఖికగ రహించి పోదు—పుల
కింతును వేరొకసారి శంపనై!

దూర సుదూరస్థ దుగ్ధసాగర జ్వాల
చ్చారు నిర్నిద్ర నక్షత్ర మగుదు—
ముత్తెంపు పురువులో మెత్త చీకటి మడ
తల హత్తుకొనెదు ముత్యమ్ము నగుదు—

సురధునీ వీచికా స్ఫుటిత సుందర ఫేన
విదళిత రుచిర బుద్బుదము నగుదు—
తొలిసంజ వెలుగులో కులుకు లాడెడు చిన్ని
సొబగు పూవున మంచు చుక్క నగుదు—
అణువు నగుదును, బ్రహ్మాండ మగుదు నేనె—
అగుదు ప్రకృతిగ, పురుషుడ నగుదు నేనె—
భానుబింబము చంద్రబింబమును కూడ
నేనె అగుదును నీ స్మృతి నీడ లోన!

ఆ యనుభూతు లన్నియు ప
దాళిగ మార్చుకొనంగ జత్నముల్
సేయుదు గాని లేఖ విర
చింపగ కేల కలమ్ము తాల్తునా,
మాయమగున్ సమస్తమును—
మాయని తెల్లని కాగితమ్ముపై
హాయిగ కానవచ్చు భవ
దాకృతి అంతర శాంతి కాంతమై!

నీవు మ్రోలనె నిల్చి నెమ్మది నా చెంప
లలవోక చేతుల అదుము నట్లు—
నీ సోగకన్నుల మోసులౌ కోర్కెలీ
ఎడద లోతుల నెల్ల తడవునట్లు—
నీ కెంపువాతెర ఆకటన్ విచ్చుక
వెచ్చగా నామోవి బిగిసినట్లు—
నీ తేనె వలపులే నిట్టూర్పులై లేచి
నా ఊపిరుల బట్టి నలుపునట్లు—
ధరణి గల చరాచరపదార్థమ్ము లెల్ల
నీవు—నే నను ముద్దగా నిర్మితమయి
అవ్యయానంద దివ్యమహాబ్ధి నూగు
లాడి తేలెడు నట్టుల అగును, నిజము!

అందుకే నీకు లేఖ వ్రాయంగ లేను—
పాడు కొందును వెర్రిగా పాట లేవొ,

అ లే ఖ

నింగి నొక అక్షరమ్ముగా లో క్రుంగదీయు*
రస విహీన పదమ్ము కాలంబనముగ !

ఈ వెర్రి గళమ్మెపుడో
ఆవేశము జారి పాట లాపి నిరాశా
భావమున మూగ వడకే
నీ వరుదేరుదువు శాంతి నింపగ వాలో !

ఈ ఆశను మాత్రమె నే
నీ అర్థవిహీనమ్మైన ఇహ జీవిత మీ
లా అలలను తేలెదు కల
లా అనవతరము గడపుదు—రావో త్వరగా !

---

* ఖం = ఆకాశము.



బొబ్బిలి కథ

డా. తంగిరాల వెంకటసుబ్బారావు

తెలుగు వీరగాథ లన్నిటిలోను అత్యంత ప్రసిద్ధమైనది బొబ్బిలికథ. నాటకములలో చిలకమర్తి వారి గయోపాఖ్యానమున కెంత ప్రచారమున్నదో వీరగాథలలో బొబ్బిలికథకంత ప్రచారమున్నది. ఆ నాటక మాడబడని పల్లె ఆంధ్రదేశమున లేనట్లే, ఈ వీరగాథ పాడబడని పల్లెయు లేదనవచ్చును. వానలో తడియనివారు లేరు. ఇది అత్యుక్తి కాదు. గయోపాఖ్యాన నాటకమును చూడని తెలుగువాడు కాని, బొబ్బిలి వీరగాథను వినని తెలుగువాడుకాని లేరు. ఇందును అత్యుక్తి లేదు.

మూడు రకముల ప్రతులు :—

బొబ్బిలి కథకు మూడురకముల ప్రతులున్నవి : 'బొబ్బిలికథ, బొబ్బిలిరాజు కథ, పెద్ద బొబ్బిలి మహారాజు కథ'. వీనిలో 'బొబ్బిలికథ'కు వ్రాతప్రతులు రెండు మద్రాసు ప్రభుత్వ ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారమున గలవు—(డి. నెం. 2550, 2551). వీనిని మల్లంపల్లి సోమశేఖర శర్మగారు తమకు లభించిన మరిరెండు ప్రతులతో (ఒకటి నెల్లూరు మండలమునను, వేరొకటి రోడ్డు ప్రక్కనను లభించినవట) సరిపోల్చి, పరిష్కరించి, ఆ పుస్తక భాండాగార పక్షమున 1956 లో 'బొబ్బిలి యుద్ధకథ' అను పేరుతో ప్రకటించిరి. రెండవ ప్రతియైన 'బొబ్బిలిరాజు కథ'ను 'కొ॥ నృసింహాచారి' రచించినట్లును, అది 1896 లో ప్రకటింపబడినట్లును, పిఠాపురములోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయములోని పుస్తకముల పట్టికనుబట్టి తెలియుచున్నది. (నేడు ఈ కథ ఆ గ్రంథాలయములో లేదు.) ఇట్టి ప్రతియొకటి డాక్టరు బి. రామరాజుగారి కంటబడి నట్లున్నది. వారు దీనిని గూర్చి వ్రాయుచు నీకవి పూర్తిపేరు 'కొంతం నృసింహాచార్యు'లనియు, నితడు పార్లపల్లి గ్రామవాసి యనియు, దీని నాల్గవకూర్పు 1896 లో వచ్చిన దనియు, ఆ కూర్పునకు పరిష్కర్త ప్రభల సీతారామయ్య యనియు, కాపీరైటు గుదిమెళ్ల వరదాచార్యుల దనియు తెలిపియున్నారు. (మా. వారి తెలుగు జానపదగేయ సాహిత్యము, పుట. 235)

ఇక మూడవ ప్రతియైన 'పెద్దబొబ్బిలి మహారాజు కథ'ను 1912 లో మద్రాసు భరద్వాజ ముద్రాక్షరశాల వారు ప్రకటించిరి. దీనిని నేడు 'పెద్ద బొబ్బిలిరాజు కథ' అను పేరుతో అనేక ప్రకాశకులు ముద్రించి ప్రకటించుచున్నారు. ఏ రోడ్డు ప్రక్కనైనను లభించును. ఈ పెద్దబొబ్బిలి రాజు కథను మొదట థేనువకొండవారు ప్రకటించిరనియు, నిది నృసింహాచారి రచనకు సంక్షిప్తీకరణ మనియు శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారును, రామరాజుగారును తెల్పియున్నారు. ఈ గుజిలీ ప్రతిలో కోడిపందెము లున్నవి. మద్రాసు వ్రాతప్రతిలో కోడిపందెములు లేవు. తక్కిన కథయంతయు నించుమించు రెండిటను సమానమే. మొత్తమునకు మద్రాసు వ్రాతప్రతి ప్రాచీనమైనది, ఎక్కువ ప్రామాణికమైనది. కాకినాడలోని ఆంధ్రసాహిత్య పరిషద్గ్రంథాలయములోగూడ బొబ్బిలికథకు సంబంధించిన యొక తాళపత్ర గ్రంథమున్నదని తెలియుచున్నది.

సి. పి. బ్రౌను సేకరణ:

ఈ బొబ్బిలి కథను మొట్టమొదట సేకరించిన మహానుభావుడు సి. పి. బ్రౌనుదొర. క్రీ. శ. 1842 ప్రాంతమున ఆయన మద్రాసులో ఒక జంగమువానిని తన దగ్గఱనే యుంచుకొని, వానిచేత 'బొబ్బిలికథ, కామమ్మకథ, కొమారరామునికథ'— ఈ మూడింటిని పాడించి, అతడు పాడుచుండగా వానిని యథాతథముగా వ్రాయించినారు. ఈ విషయమును దొరగారే స్వహస్తములతో నిట్లు లిఖించి యున్నారు :—

'The following three tales, Viz. Bobbili catha, Comara Ramudi catha, Camamma catha, are popular Ballads or Histories, which are usually prescribed by oral recitation alone. But meeting with one of the wandering minstrels who subsist by these recitations, I employed him for about a month to recite all the Ballads he knew and these were written down to his recitation.'

(—మద్రాసు ప్రభుత్వ ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారములోని బొబ్బిలికథ కాగితపు ప్రతి డి॰ నెం. 2555, Fly-leaf.)

'పెద్దాడ మల్లేశం' కర్త కాదు-జంగము :

ఈ బొబ్బిలికథ చివరలో వచ్చు 'పెద్దాడ నాగేశంకొడుకు మల్లేశం చెప్పిన కథ వినుడీ' అను వాక్యమునుబట్టి పెక్కురు విమర్శకులు 'పెద్దాడ మల్లేశం' బొబ్బిలికథను రచించిన కవియని తలంచినారు. నాకు జూడగా నిది ఈ కథను బ్రౌనుదొరగారికి పాడి వినిపించిన జంగముపేరు మాత్రమేయని తోచుచున్నది. ఏ జానపద కవియును తనపేరు గ్రంథాంతమున చెప్పుకొనలేదు. కాటమరాజు కథలు రచించిన ఆర్గురు నూతన కవులను నేను కనుగొంటిని. వీరిలో నే యొక్కరును తన నామమును గ్రంథాంతమున జెప్పుకొనలేదు. పైగా, ఇది మల్లేశం 'చెప్పిన' కథయేకాని 'వ్రాసిన' కథకాదు. ఇది ముఖ్యముగా గమనింపవలసి యున్నది. నిజముగా నితడే కవియైనచో తల్లిదండ్రులపేర్లు, గోత్రము పేరు, ఊరిపేరు-అన్నియును చెప్పుకొని యుండును. తెలుగు కవి యెవ్వడును తన ప్రవర చెప్పుకొనకుండ, పొడిగా తనపేరును తన తండ్రిపేరును మాత్రమే చెప్పియూరకొనుట యేయితర గ్రంథములోను మనము చూడము. కావున 'పెద్దాడ మల్లేశం' అను నతడు 1842 లో బ్రౌను దొరగారియెదుట బొబ్బిలికథను పాడిన ఒక జంగము మాత్రమే !

పైగా, బ్రౌనుదొరగారు ఈ కథను ఒకరు పాడుచుండగా వ్రాయించిరేకాని, ఒక కవి వ్రాసిన ప్రతిని (పల్నాటి వీరకథలు, కాటమరాజు కథలు మున్నగువానివలె) సంపాదించి యుండలేదు. ఇది అత్యంత ముఖ్యమైన విషయము. పెద్దాడ మల్లేశం గాథాకారుడు మాత్రమే యనుటకు దీనినిమించిన సాక్ష్యములేదు. నోటిపాట పాడు గాథాకారుడు కవి నామమును చెప్పుట అసంభవము. (కామమ్మ కథలో కవి కథాభాగములో నొక ముఖ్యపాత్రకావున అతని నామము వీరగాథలో మిళితమైపోయి గాథాకారులచే పాడబడుచున్నది. ఇట్టిది మఱియొకకథలో నెచ్చటను కానవచ్చుటలేదు.)

నేను సేకరించిన పెక్కు కథలలో జంగములు కథాంతమున తమ పేరు చెప్పుట వినియుంటిని. 'ఫలానావాడికొడుకు ఫలానావాడు చెప్పినకథ ఇక్కడి సంపూర్ణం'అని చెప్పుట గాథాకారులలో కానవచ్చు సాధారణ విషయము. పెద్దాడమల్లేశమును ఇట్లు చేసినవాడే కావచ్చును. అసలు బొబ్బిలికథపై కవి చేయిపడినట్లులేదు. ఇది జానపదుల ఆశువుగానే నేటికిని నిలిచియున్నదని నా నమ్మకము. యతిప్రాసలులేని శిథిలరచనయే నేటికిని ఇందు ప్రత్యక్షమగుచున్నది. దేసింగురాజుకథతో దీనిని పోల్చినచో నీ విషయము స్పష్టమగును. దేసింగురాజుకథలో యతిప్రాసలు చక్కగా కూర్చబడి, రగడరూపమున కవి ప్రత్యేక శిల్పము సాక్షాత్కరించును. బొబ్బిలికథలో నిట్టి శిల్పము కానరాదు. గుజిలీప్రతిని కొంతం నృసింహా

చార్యులు రచించియుండునుగాని, మద్రాసు ప్ర. ప్రా. లి. పు. భాండాగారములోని వ్రాతప్రతిమాత్రము సేకరింపబడిన మౌఖికవీరగాథ మాత్రమే. దీనికి ప్రౌను దొరగారే సాక్ష్యము. ఇట్టి మౌఖికగాథలో కవినామాదు లుండుట యసంభవము.

మూడు విధముల ఇతివృత్తము :

నేను బొబ్బిలి విజయనగర ప్రాంతములలో పర్యటించి, యీ బొబ్బిలికథకు సంబంధించిన కొన్ని నూతనాంశములను కనుగొంటిని. ఆ ప్రాంతములలో నీ కథ మూడు విధములుగా పాడబడుచున్నది. బొబ్బిలిప్రాంతములో దీనిని మాలదాసరులు పాడుదురు. బొబ్బిలి ప్రక్కనేయున్న 'కోమటిపల్లె'యను గ్రామములో నీ దాసరులు నేటికిని గలరు. వీరు తరతరములనుండి యీ కథను పాడుచున్న గాథాకారులు. ఈ శతాబ్ది ప్రారంభములో బొబ్బిలి మహారాజావారు ఈ కోమటిపల్లెదాసరులను మద్రాసు తీసికొనివచ్చి, బొబ్బిలికథను పాడించి, ఆకాశవాణి కేంద్రమునుండి ప్రసారము చేయించిరని తెలియుచున్నది. ఈ బొబ్బిలి ప్రాంతములో నీ కథ, నేడు మనకు లభ్యమగుచున్న ధోరణిలో, అనగా బొబ్బిలివారివైపు పక్షపాతము చూపుచు పాడబడును. ఇందు ప్రధాన నాయకులు రంగారావు, వెంగళరావులు. పాపారాయని ప్రసక్తి యిందు తక్కువ. పాపారాయని స్వస్థలమైన 'రాజాం' ప్రాంతములోని గాథాకారులు తాండ్రపాపారాయని నాయకునిగాజేసి, ఆతని పుట్టుపూర్వోత్తరములను సాహసములను వివరించుచు బొబ్బిలికథను పాడుచున్నారు.

ఇక, విజయనగరప్రాంతములందు బొబ్బిలికథను జంగములు పాడుదురు. విజయనగరము ప్రక్కనేయున్న 'మద్దిపల్లె'లోని జంగము లీ కథను పాడుటలో మిక్కిలి ప్రావీణ్యముగలవారు. ఈ జంగములు విజయరామరాజునకు ప్రాధాన్యమిచ్చి పాడుదురు. ఇప్పటికిని విజయనగర ప్రజలు బొబ్బిలివారి శౌర్యమును మనవలె ప్రశంసింపరు. బొబ్బిలివారిదే తప్పనియు, వారు విజయరామరాజు నవమానించిరనియు, వెంగళరాయని పొగరుబోతుతనమే యుద్ధమునకు గారణమనియు, వెంగళరాయని వివాహసమయములో విజయరామరాజు బొబ్బిలిపై దండెత్తెననుట పచ్చిఅబద్ధమనియు, అది మాఘమాసమగుటచే నప్పుడు వివాహము జరగుటకే ఆస్కారములేదనియు, బొబ్బిలివారు తాము బుస్సీని దర్శింపకపోవుట కొక సాకును చూపనెంచి, వెంగళరాయని పెండ్లియని అబద్ధమాడిరనియు విజయనగరప్రాంత ప్రజలు నేటికిని చెప్పుచున్నారు.

పాపారాయని ప్రసక్తి :

తాండ్ర పాపారాయుడు విజయరామరాజును పొడిచిచంపినట్లుగా వీరగాథలో గలదు. విజయరామరాజు, తన్ను పొడిచిన పాపారాయని తిరిగి కత్తితో పొడిచిచంపినట్లుగా విజయనగర ప్రజలు చెప్పుచున్నారు. ఇట్లు పాపారాయని పొడిచిన కత్తి విజయనగరపుకోటలో నేటికిని భద్రపరుపబడియున్నది. జనవ్యవహారమునను, వీరగాథలలోను నింత ప్రసిద్ధమైన తాండ్రపాపారాయని ప్రసక్తి చరిత్రలో నెచ్చటను గానరాదు. బొబ్బిలియుద్ధకాలమునకు సమకాలికుడైన 'రాబర్ట్ ఆర్మ్' (Robert Orme A. D. 1728–1801) అను చరిత్రకారుడు ఈ యుద్ధమును సంపూర్ణముగా వర్ణించినాడు. కాని అందు తాండ్ర పాపారాయని పేరులేదు. రంగారాయని అనుచరులు నలుగురు కలిసి, విజయరామరాజును చంపుటకు నిశ్చయించుకొని, అందులో ఇద్దరొక దళముగా ముందు వెడలి, విజయనగరభటుల వేషముతో రామరాజు డేరాలో ప్రవేశించి, నిద్రించుచున్నవానిని పొడిచి చంపిరనియు, వెంటనే విజయనగర సైనికులు మేల్కాంచి, విజయరామరాజును చంపిన ఆ యిరువురు సైనికులను తుపాకులతో కాల్చివేసిరనియు నీ చరిత్రకారుని వ్రాతలో గలదు. (చూ. History of Hindoostan by Robert Orme, Vol. II., PP. 255—260).

శ్రీపాదవారి అభూతకల్పన :

తాండ్ర పాపారాయుడు విజయరామరాజును పొడిచిచంపుటయేకాక, ప్రేవులుతీసి మెడలో వేసికొని

నట్లుగా కీ. శే. శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారు తమ 'బొబ్బిలియుద్ధ నాటకము'లో వ్రాసియున్నారు. ఇది అభూతకల్పన. విజయనగరమువారిని వీరగాథా కర్తయే యెక్కువ కించపఱచినాడు. శాస్త్రిగారు వానిని మించినారు. ఇది శాస్త్రిగారి అభూత కల్పనమగుటయేకాక, నాటక లక్షణముల కత్యంత విరుద్ధమైన సన్నివేశముకూడ. మహాపండితులుగా ప్రసిద్ధికెక్కిన శాస్త్రిగారు, రంగస్థలమువ లాక్షణికులు నిషేధించిన యీ సన్నివేశము నేల ప్రవేశపెట్టిరో యర్థము కాకున్నది. ఇదియొకవేళ సత్యమైనచో కొంతవఱకును సర్దుకొనవచ్చును. కాని యిది శుద్ధకల్పన. ఈ విషయమై నేను శ్రీ శాస్త్రిగారిని 1956 లో రాజమహేంద్రవరములో వారి యింటికడ ప్రశ్నించితిని. 'అది తప్పే. నాటక లక్షణాలకి విరుద్ధం. ఏదో రంగస్థలంమీద రక్తి కడుతుందికదాఅని అలా వ్రాసివేశాను'అని వారు సమాధానమిచ్చిరి. కాని, యీ సన్నివేశము మన యాంధ్ర దేశమున నితర ప్రాంతములలో రక్తి కట్టుచున్నది కాని, విజయనగరప్రాంతములవారినిమాత్రము క్రోధ వివశులను జేయుచున్నది. సర్కారుజిల్లాలలో, ముఖ్యముగా విశాఖ శ్రీకాకుళ మండలములలో బొబ్బిలి యుద్ధ నాటకమును విశేషముగా ప్రదర్శించుచున్న శ్రీ కనకదుర్గ నాట్యమండప (మండపాక, పశ్చిమ గోదావరిజిల్లా) వారిని నేను సంప్రతించితిని. విజయనగర ప్రాంతములలో నీ నాటకమును ప్రదర్శించునప్పుడు, ఈ నాట్యమండలివారు, తాండ్ర పాపారాయడు విజయరామరాజును చంపి ప్రేవులుతీసి మెడలో వేసికొనునట్టి రంగమును వదలివేయుదురట! (లేనిచో, విజయనగర ప్రజలు ఆ పాపారాయని పాత్రధారి ప్రేవులనుతీసి తమ మెడలో ధరింపగల ప్రమాదమున్నదట !). విజయనగర ప్రజలకును బొబ్బిలి ప్రజలకును మధ్య నాటి కక్షలు నేటికిని రగులుచునే యున్నవి. బొబ్బిలివారి శౌర్యమును మనము కీర్తించినట్లుగా విజయనగర ప్రజలు ఈనాటికిని కీర్తించుట లేదు. బొబ్బిలియుద్ధముపై వీరగాథలు నాటకములు మిక్కిలి పాక్షికదృష్టితో వ్రాయబడినవని తెల్పు విజయనగర ప్రజల వాదములో సత్యము లేకపోలేదు.

చారిత్రక సంఘటన :

చారిత్రకముగా నీ బొబ్బిలియుద్ధము క్రీ. శ. 1757 వ సంవత్సరము జనవరినెల 24 వ తేది శుక్రవారమునాడు జరిగినది. ఆ దినము తెల్లవారు జామున యుద్ధము ప్రారంభమైనది. కోటలోనున్న రంగారాయుని సైన్యము 250 మంది వీరులు మాత్రమే. స్త్రీలు, పిల్లలు, ఇతరులు కలిసి దాదాపు 500 మంది కలరు. వీరిపై దండెత్తివచ్చిన శత్రు సైన్యములో నొక్క విజయరామరాజుదే 10,000 సైన్యము ! బుస్సీది 250 గుర్రపుదళము, 500 కాల్బలము, నాలుగు ఫిరంగులు ! ఇంత మహాసైన్యమును 250 మంది బొబ్బిలివీరు లెదిరించిరి!! ఇది మిగుల ఆశ్చర్యకరమగు విషయము ! తమకు సంఖ్యాబలము లేకపోయినను వెలమవీరులు మహాశౌర్యముతో పోరాడిరి. తెల్లవారుజామున ప్రారంభమైన యుద్ధము మధ్యాహ్నము రెండుగంటలవఱకును ఉధృతముగా సాగినది. మధ్యాహ్నము రెండుగంటల సమయమునకుగూడ ఒక్కశత్రుసైనికుడైనను బొబ్బిలికోట గోడపైకి ఎక్కలేకపోయెనట ! వెలమవీరుల పౌరుషమునకును, యుద్ధనైపుణ్యమునకును ఇది ప్రబల నిదర్శనము !

ఇక లాభములేదని తలచిన శత్రువులు మధ్యాహ్నము రెండుగంటల తరువాత ఫిరంగులతో విజృంభించిరి. బొబ్బిలి వీరులును ఇమ్మడిగా ముమ్మడిగా రెచ్చిపోయింది కోటను కాపాడుకొనుట అసాధ్యమని గ్రహించిరి. ప్రాణముకన్న మాన మెక్కువయని నిశ్చయించుకొనిన ఆ మహాశూరులు, తమ అంతఃపురస్త్రీలు శత్రువులకు చిక్కకుండనుండుటకై వారిని తెగనఱికి మంటలలో పాఱవైచిరి. పసిబాలురు కూడ ఈ మారణ హోమమున కాహుతియైరి. ఈ దారుణ కృత్యమును జూచి శత్రువులు కూడ కంట తడిపెట్టిరి ! తెగించిన బొబ్బిలివీరులు మాటలతో చెప్పరాని మహావేశముతో శత్రువు నెదుర్కొనిరి.

సాయంకాల మగుసరికి బూడిదబుంగలుగా పడియున్న బొబ్బిలికోట బుస్సీకి వశమైనది !

ఈ యుద్ధము మిక్కిలి హృదయ విదారక మైనది. మానరక్షణార్థమై ప్రాణములను తృణప్రాయముగా త్యజించిన మహాపురుషులు బొబ్బిలి వీరులు ! వెలమవీరుల పౌరుషము, శౌర్యము, ఆత్మాభిమానము ఆచంద్రతారార్కము నిలిచి యుండును !! ఈ వీరగాథలోని నాలుగు పంక్తులు వినిన చాలును, మన యొడలు గగుర్పొడుచును. గొంతు గాద్గదిక మగును, హృదయ ముఱ్ఱూతలూగి పోవును, చెప్పరాని మనోవ్యధకు గురియగుదుము !

రచయిత పక్షపాతము :

ధర్మము, న్యాయము బొబ్బిలివారిపైపే యున్నను, విజయరామరాజు మాత్రము ఈ వీర గాథలో చిత్రింపబడినంత పిఱికిపందయు, పౌరుషహీనుడును, క్రూరుడును గాడు. ఈ గాథారచయిత (లేదా, దీని నాశువుగా నల్లిన గాథాకారుడు) చారిత్రకాంశముల నూతగాగొని, కొంత కల్పనచేసి, వెలమల శౌర్యమును విపరీతముగు భక్తితో వర్ణించినాడు. ఇతడు తప్పక బొబ్బిలి ప్రాంతమువాడై యుండుననుటలో సందేహములేదు. రచయిత పాక్షికదృష్టితో రచన సాగించెనని మల్లంపల్లి సోమశేఖర శర్మగారు కూడ అంగీకరించి యున్నారు :—

'ఈ బొబ్బిలికథ ప్రధానముగా బొబ్బిలి అధిపతుల శౌర్యసాహస పరాక్రమముల నభివర్ణించుటకే రచయింపబడినది. గ్రంథకర్త బొబ్బిలి పక్షపాతి. బొబ్బిలినివాసి కూడ అగునేమో. అందువలననే అతడీ కథలో రంగారావును ఉత్తమనాయకునిగాను, అతని ప్రత్యర్థిని ద్వితీయనాయకునిగాను చేసెను. పెద విజయరామరాజు కథలో చిత్రింపబడినంతటి క్రూరుడును, దుష్టస్వభావుడునుకాడని ఆతని చరిత్రవలన విశదమగును. కథానాయకుడయిన రంగారావు పాత్రకు ఆధిక్యము కల్పించుటకే ప్రతిపక్షనాయకుని పాత్ర నావిధముగ చిత్రించెననుట స్పష్టము.'

—బొబ్బిలియుద్ధకథ, పీఠిక, పుట Li.)

చరిత్ర తాఱుమాఱు :

రసదృష్టితో చూచినప్పుడు వీథులలో దొరకు గుజిలీప్రతులకన్న మద్రాసు ప్ర. ప్రా. లి. పు. భాండాగారములో బ్రౌనుదొర సేకరించిన కథయే అన్నివిధముల నుత్తమమైనది. ఆ కథారచయిత బుస్సీ సైన్యముతోగూడ ప్రయాణముచేసి మజిలీలను వర్ణించినాడా అనిపించును. కాని యీ కవి (దీనికి ప్రత్యేక కవి లేడు, మొదట ఆశువుగాపాడిన గాథాకారుడే దీని కవి. అతని పేరు మనకు తెలియదు.) దీనిని విషాదకావ్యముగా చేయుటకు కాబోలు కొన్నిచారిత్రక విషయములను తాఱుమాఱు చేసినాడు. బొబ్బిలియుద్ధము రాత్రి ప్రారంభమైనదనుట, వెంగళరావు ఆత్మహత్య, హైదర్‌జంగ్ ఆత్మహత్య సరికావు.

చారిత్రకముగా నీ యుద్ధము తెల్లవారుజామున ప్రారంభమై సాయంకాలమువఱకును సాగినది. అట్లే, వెంగళరావు ఆత్మహత్యయు సత్యముకాదు. వెంగళరావు తన అన్నకుమారుడైన వెంకటరంగారావును వెంట బెట్టుకొని, యుద్ధమునుండి తప్పించుకొని, భద్రాచలమునకు పారిపోయి, రెండు సంవత్సరములకు తరువాతవచ్చి రాజాముకోటను పట్టుకొనెను. అప్పుడు విజయనగరము నేలుచున్న ఆనందరాజు వెంగళరావుతో సంధి చేసికొనెను. ఇది చారిత్రకసత్యము.

హైదర్‌జంగ్ ఆత్మహత్య చేసికొనెననుటకూడ నిజముకాదు. యుద్ధానంతరము హైదర్‌జంగ్ బుస్సీతో కలసి ఔరంగాబాదు వెళ్లెను. అక్కడ 'సలాబతు జంగు' సోదరుడగు 'నిజామలీ'చే హైదర్‌జంగ్ చంపబడెను. ఈ వీరగాథలోని యుద్ధకాల సన్నివేశము లన్నియును రసపోషణకై కవి కల్పించినవేకాని చారిత్రక సత్యములుకావు :

"Though the theme is historical, there is less of history and more of tradition.. ....Mallesam borrowed his theme from history and developed it into a classical folk-song Kavya."

(—M. Somasekhara Sarma, Introduction to Bobbili yuddha katha, P. xiii.)

సిసలైన వీరగాథ :

ఇట్లు చారిత్రక సత్యములు కొన్ని లోపించినను, ఈ బొబ్బిలికథ తెలుగు వీరగాథలలో అగ్రగణ్యమగుటయేకాక, ప్రపంచోత్తమ వీరగాథలలో లెక్కింపదగినది. వీరగాథాలక్షణములన్నియును దీనికి పరిపూర్ణముగా వర్తించును. దుస్సాధమైన వీరగాథా నిర్వచనము ఈ యుత్తమ వీరగాథచే సుసాధ్యమగుచున్నది. 'బొబ్బిలికథ వంటివి వీరగాథలు' అని ఒక్కముక్కలో నిర్వచింపవచ్చును. అందుచేతనే డాక్టరు బి. రామరాజుగారు దీనిని సిసలైన జానపద గేయముగా నభివర్ణించిరి :

'తెలుగువారు వీరవిక్రములనియు, ధైర్య సాహసోపేతులనియు, అభిమానధనులనియు, వారి శౌర్య మాఖండమనియు, చేయెత్తి చాటునది బొబ్బిలి కథ. ఈ కథ నెరుగనివారు (జానపదులు) తెలుగు దేశమున నొక్కరైన నుండరన్న అతిశయోక్తి కాదు. వీరగీతము లందింత సార్వజనీనతగల పద మింకొకటి లేదు. సిసలైన జానపదగేయమున కుండవలసిన లక్షణములన్నియు దీనికున్నవి. నుడికారము, భాష, భావములు, పద్ధతి పూర్తిగా జానపదులవి.'

(—తెలుగు జానపదగేయ సాహిత్యము. పుట. 235.)

వీరరసము :

బొబ్బిలికథలోని వీరరస స్ఫోరకమగు కవిత్వమున కొక చిన్న యుదాహరణము నిత్తును. విజయ రామరాజు తన కోటపై దండెత్తిరాగా, రంగారావు తన బావమఱది యగు తాండ్ర పాపయ్య కోటలో నున్నచో నేడేండ్లు పోరాడినను తనకోట స్వాధీనమయ్యేడిదికాదని వాపోవుచుండును. పాపారాయ డప్పుడు రాజాముకోటలో నున్నాడు. అందుచే తనకును బొబ్బిలి కోటకును ఋణము తీరినదని రంగారావు విచారపడుచుండును. అన్నగారి విచారమును చూచి తమ్ముడు వెంగళరావు ఎటువంటి వీరాలాపము లాడుచున్నాడో చూడుడు.

'మహాప్రభో! పిరికిమాటలూ ఆడిపోతిరీ యేలినవారేమి
నాకు సెలవులు యివ్వమంటాడు తమ్ము వెంగళ్రావూ
సెలవులు యిస్తే నవాబుడేరా సెలగని పొడి చొస్తు
దిగుతూ దిగుతూ వున్నడేరా వెనుకకు పట్టిస్తు
గోల్కొండ దరబారులో బూసికి గోరీ కట్టిస్తు
గోరీమీదా సున్నపునీళ్లు చల్లించకమాన
ఏరుదాటి యేలూరిదాకా బైలుగ నరికిస్తు
రాజమహేంద్రము గోదావరిలో ఈతెలు గడిగిస్తు
దనిగడ్డకూ పీనుగులాను వొంతెల తోలిస్తు
రవద్వాళిగా విజేనగరమే తలుపులు కొట్టిస్తు
అన్నయ్యా, విజేనగరం సందున రాజును దహనంచేయిస్తు
....
....
అన్నయ్యా, బూసిగారి బలములు అన్నీ జాతికొంగలేమి
జాతికొంగల మీదికి నేను సాళువ డేగను
రాజుగారివో బలములు అన్ని పరిగె గుంపులేమి
పరిగెగుంపుల మీదికి నేను భైరవ డేగాను !'

(—బొబ్బిలి యుద్ధకథ, మద్రాసు ప్ర. ప్రా. లి. పు. భాం. ప్రచురణ, పుటలు 39, 40.)

ఇట్లు వెంగళరాయని పలుకులు వీరరస స్ఫూర్తికి ప్రతీకలు కాగా, మల్లమదేవి విజయ రామరాజునకు వ్రాసినలేఖ కరుణ రసమునకు పరాకాష్ఠ. (చూ. బొబ్బిలియుద్ధకథ, పుట 57.) వీరగాథలలో వీరకరుణములు రెండే యెక్కువగా పోషింపబడు చుండును.

ఆంగ్లప్రతి :

ఇట్టి అత్యుత్తమ వీరగాథను ఏట్స్‌దొర ఆంగ్లభాషలోనికి పరివర్తించెనని 1965 లో గిడుగు సీతాపతిగారు నాతో చెప్పియున్నారు. కాని ఆ యాంగ్ల ప్రతి నేడు లభించుటలేదు. ఆ యేట్స్‌దొర ఆంగ్లములో 'marginal notes' వ్రాసికొన్న తెలుగు ప్రతి యొకటి సీతాపతిగారికడ నుండెడివి.

గుంటుపల్లి గుంఫ

శ్రీ జి. ఆర్. వర్మ

పశ్చిమగోదావరిజిల్లా, ఏలూరుతాలూకాలో ఉత్తరంగావున్న గుహాలయాన్నే గుంటుపల్లి గుహలు అంటారు.

బాగా మందంగా (లావు, వలం) స్తంభంవలె వుండే స్థాణువునే ధర్మలింగేశ్వరస్వామి అని పూజిస్తున్నారు. భక్తజనంలో స్త్రీల సంఖ్య ఎక్కువ—సంతానార్థులు ప్రదక్షిణంచేసి పూజలు చేస్తుంటారు. కార్తీకసోమవారాల్లో రద్దీ ఎక్కువ. అదో శివక్షేత్రం అయినది.

అయితే పేరులో ధర్మశబ్దం సాధారణంగా బౌద్ధాన్నే సూచిస్తుంది.

ఇది జైనక్షేత్రంగూడానని సందేహించినవారున్నారు. అమరావతి (ధాన్యకటకం), భట్టిప్రోలు మొదలైన పురాతన బౌద్ధక్షేత్రాల్లో లభించిన ధవళ స్తంభం వంటి స్తంభంపై శాసనం ఇది జైనక్షేత్రమనిపించిన కారణం కావచ్చు. బౌద్ధస్తంభంపై తర్వాతి కాలపువారు చెక్కించినదా శాసనం.

ఆ స్తంభంపై ఇట్లావున్నది: 'మహారాజస, కళింగాధిప, మహిషకాధిపస, మహామేఖవాహనస, సిరిసదవన, లేఖకస చులగోమస మణ్డపో దానమ్—'

ఒరిస్సా హాథిగుంఫా (హస్తిగుహ) శాసనంలో కళింగరాజు ఖారవేలుని సైన్యాలు పశ్చిమంగా కన్నబేన్నా (కృష్ణానది)వైపువెళ్లి ఆవ మూసి(షి)కులతో (తెలుగునాటివారే) పోరినట్లున్న విషయం వాస్తవమే. మూసికులు కృష్ణా, గుంటూరు, నల్లగొండజిల్లాలవారై యుందురనీ, మూసీనదీతీరస్థులనీ పరిశోధకాభిప్రాయం.

కొందరీ మూసికరాజ్యం మెదక్ (మెతుకుసీమ) జిల్లాగావున్న ప్రాంతంలోని కొండాపురం అంటున్నారు. అక్కడ సాతవాహన చరిత్రావశేషాలు లభించాయి.

కళింగ—ఆంధ్రసామ్రాట్టుల విరోధం ఉన్నదే. గౌతమీపుత్రశాతకర్ణి కళింగాన్ని జయించడం వాస్తవమే. అయితే కళింగరాజ్యం—ఇతరప్రాంతాల్లోవలెనే—ఎల్లలు ఎప్పుడూ ఒకటిగాలేవు.

మూసికులు నెల్లూరు ప్రాంతీయులనే అభిప్రాయమూ ఉంది.


గుంటుపల్లి శాసనం—ఖారవేలుడు మహిషకాధిపతిగూడా అని అన్నది. మహిషకరాజ్యం మైసూరు ప్రాంతమని కొందరి విశ్వాసం. మహిషకం మధ్యప్రదేశ్‌లో మహిష్మతి, హోశింగాబాదు ప్రాంతం కాకూడదా?

బిరుదులబట్టి ఖారవేలుడనీ, హాథిగుంఫశాసనం బట్టి కళింగసైన్యాలిటురావడం వాస్తవమని ధ్రువపడునేగాని, గుంటుపల్లి జైనక్షేత్రమని స్తంభశాసనం—నిర్ధారణ చేయదు.

ఈ స్తంభశాసనంగాక, జైనమని సందేహించే మరో ఆధారం 'సుయజ్ఞనాథ' అనేపేరు. లిపిబట్టి క్రీ. పూ. 2 వ శతాబ్దంగా నిర్ధారణమైన శాసనం ఇది.

గుంటుపల్లి స్తూపాల్లో వొకదానికి ఇటికి ఆవకవేదిక ఊడి ఉండలిట. దానిపైకి వెళ్లేందుకు వున్న రాతిమెట్లపై శిథిలాక్షరాలు 'సునద అనే యామె సుయజ్ఞనాథుని యానతిని ఆ మెట్లు కట్టించెను' అని ఉన్నవి.

కళింగరాజు సైన్యాలు వేంగిమీదుగా ప్రయాణమైనంతలో, ఒక్క సుయజ్ఞనాథ శబ్దంతో



గుంటుపల్లి గుంఫ : విహారం

గుంటుపల్లి జైనక్షేత్రం అంటే నమ్మలేము. అది జైనక్షేత్రం అనేందుకు మరే ఇతర ఆధారం లభించలేదు.

అమరావతి ఆదిలో జైనక్షేత్రం, బౌద్ధమై, నేడు శైవక్షేత్రం అయిందంటారు (అమరేశ్వర). కాగా క్రీ. శ. 12 వ శతాబ్దపు కన్నడకావ్యంలో క్రీ. పూ. ఆంధ్రేక్ష్వాకులు జైనులుగా చెప్పబడినారు. ఆ కావ్యంలో విషయాలు కొన్ని విజయపురి రాజు వీరపురుషదత్తుని నాటి సంఘటనలుగా వున్నవంటారు.

ఎనభైయేళ్ళకు పూర్వం అలెగ్జాండర్ రియా అనే పురావస్తుశాఖాధికారి ప్రప్రథమంగా గుంటుపల్లి గుహాలయాలను గుర్తించారు. ఇటీవల త్రవ్వకాలు (పరిశోధన) పూర్తిచేసారు.

రియా, స్తూపాలనేగాక విశాలమైన ఇటికల పునాదిదిమ్మనుగూడా కనుగొన్నారు. చైత్యాలయంతో పాటు పెద్ద శిలాస్తూపంగూడా కనుగొనబడింది. కొండతొలచి నిర్మించిన ఈ శిలాస్తూపంచుట్టూ ప్రదక్షిణమార్గం ఉన్నది. ఎనిమిది అడుగుల పైయెత్తు స్థూలంగావున్న ఈ శిలాస్తూపాన్నే ధర్మలింగేశ్వరస్వామిగా పూజిస్తున్నారు.

గుంటుపల్లి గుంఫ ముఖద్వారం పురాతన బౌద్ధనిర్మాణాల్లో వలెనే గుర్రపునాడ (అర్ధచంద్ర) ఆకారం కలిగిఉండటం ఛాయాచిత్రాలలో చూడనగును.

పరిశోధకు లిచ్చట ఒక ప్రత్యేకతగూడా గుర్తించారు. బీహారురాష్ట్రంలో బారాబర్ లోమశ ఋషి గుహాలయ ముఖద్వారం పోలికలోనే గుంటుపల్లి గుహాలయ ముఖద్వారం వున్నదంటున్నారు. అయితే ఒకటే భేదం,

గుంటుపల్లిలో దారి ముందుంటే, బారాబర్‌లో పార్శ్వాన వున్నదట. అక్కడ అలంకార శిల్పంఉంది —ఇక్కడలేదు. సుదామాలయంగూడా—గుంటుపల్లి పోలికలోనే వున్న దంటారు. మహారాష్ట్రంలో భాజ గుహాలయ ముఖద్వారం ఇలాగే ఉంది.

గుంటుపల్లి ఆలయనిర్మాణం బారాబర్ ఆలయ నిర్మాణానికి కొంత అవతలి కాలానిదని కన్నింగ్‌హామ్ అభిప్రాయం. అలంకారాదిశిల్పలోపం వలన బారాబర్ గుహాలయ నిర్మాణానికన్న గుంటుపల్లి పూర్వపుది ఎందు కనుకోరాదు! కాకుంటే గుంటుపల్లి నిర్మాతల్లో శిల్పనైపుణ్యం లోపించిఉండాలి. భాజ గుహాలయంలో గుంటుపల్లి పోలికలున్నా ఇచ్చటలేని అలంకరణ శిల్పం అచట ఉంది.

క్రీ. పూ. 250 తర్వాతనే అశోక చక్రవర్తి గుహాలయ నిర్మాణ కార్యక్రమాలు చేపట్టినాడు.

పోలికలబట్టి గుంటుపల్లి, బారాబర్ గుంఫలు రెండూ అశోకుని నాటివేనేమో! అయితే గుంటుపల్లి ఆలయం క్రీ. పూ. 200 నాటిదిగా పరిశోధక నిర్ణయం. భాజ, గుంటుపల్లి గుంఫల్లో పోలికలున్నాయి.

అశోకుడు బౌద్ధ మవలంబించక (క్రీ. పూ. 250) పూర్వమే ఆంధ్రంలో బౌద్ధం ఉన్నది. కాని నాటివారినిగూర్చిన చరిత్ర లభ్యంగాదు. పోతే భట్టిప్రోలు (ప్రతీపాలపురం) క్రీ. పూ. 3 వ శతాబ్దపు నాటిదనే పరిశోధకాభిప్రాయంగూడా ఉంది.

అతి పురాతనమైన స్తూపాలు ఎత్తు తక్కువగా వుండి ఎక్కువ స్థూలంగాఉండే వంటారు. ఆ లెఖ్ఖను ఆ పోలికను గుంటుపల్లి శిలాస్తూపం బహు పురాతన కాలాని దనాలి.

చైత్యగృహ సమీపాన్నే కొండలు తొలచిన గదుల (అరల) విహారము గుంటుపల్లిలో వున్నది. అచటనే మరోవరుస విహారమున్నది. కాని ఇందులో కొన్ని గదులు అసంపూర్ణంగా వున్నాయి.

గజపృష్టాకారావున్న ఇటికల చైత్యాలయం లోపలి ఏర్పాట్లు, ప్రత్యేకత గుర్తించి, ఆ పోలిక మరోచోట కాన్పించదంటారు పరిశోధకులు. ప్రదక్షిణం చేసినట్లుగా చుట్టూ రాతిమెట్లు ఉండడం విశేషం. సాధారణంగా బౌద్ధక్షేత్రాల్లో ఆరాధనీయం స్తూపం. గుంటుపల్లిలో ఆ స్థానంలో ఎత్తయిన ఇటికలవేదిక (సింహాసనం) ఉండిన సూచనల్లో ఆరాధ్యమూర్తిని వేదికపైనవుంచే వారని అనిపిస్తుంది. ఈవేదిక ముందుభాగాన మూడు గూళ్లలో పూజనీయులైన ఆచార్యులరూపాలో, సాంకేతిక రూపాలో ఉండేవేమో! ఈ ఇటికలచైత్యం అమరావతి జగ్గయ్యపేట మొదలగు క్షేత్రాల్లోని చైత్యాలయాలను పోలివున్నందున క్రీ. శ. 2 వ శతాబ్ది కాలానిదిగా నిర్ణయించారు. సాతవాహనుల ఆచార్యుడు నాగార్జునుని నాటిది.

ఖారవేలునికి సంబంధించిన శాసనంలో మండపం ఇదో మరొకటో తెలియకపోయినా పురావస్తుశాఖవారు కనుగొన్నది శిథిలమైపోయిన మహావిశాలమైన మహా మండపం.

శిలాస్తూపంవద్ద లభించిన శిలాపేటికలో చిన్న తామ్రపాత్ర, స్ఫటికం, చిన్నస్వర్ణభిక్షాపాత్ర మొదలగునవి లభించాయి. ఈ స్తూపం భిల్యాస్తూపాన్ని పోలివున్నందున క్రీ. పూ. 2 వ శతాబ్దానిది అని నిర్ణయించారు.

ఆ మధ్య వొక శిల్పంగూర్చిన గ్రంథసమీక్షలో పల్లవులు, చాళుక్యులునాడు శిల్పులు చిన్నసైజులో ఆలయం 'మోడెల్' మొదట ఏర్పరిచేవారని పెద్ద వార్తగా వ్రాశారు ఒక సమీక్షకుడు. మరి ద్రాక్షారామ భీమేశ్వరాలయంగూర్చిన విషయం?

భీమేశ్వరాలయ నిర్మాణానికి పూర్వం సుమారు వెయ్యేండ్లనాడే 'మోడల్' ఏర్పాటుండేది. శిల్పులు దాన్నే 'వర్ణక'మనేవాళ్లు. గుంటుపల్లిక్షేత్ర నిర్మాణంలో శిలను తొలచి సిద్ధంచేసిన వర్ణకం గుంటుపల్లిలో వుంది.

గుంటుపల్లిక్షేత్రం మౌర్య, సాతవాహన, ఆంధ్రేక్ష్వాకుల కాలాన కనీసం ఎనిమిది శతాబ్దాలు బౌద్ధుల పుణ్యస్థలిగా నుండెననవచ్చు.

సాతవాహనులు మౌర్యసామ్రాజ్య పతనానంతరపువారని అనేకుల నమ్మకాలను మహామహోపాధ్యాయ మిరాశిగారు వమ్ముచేస్తూ అశోకునినాటికే ఆంధ్ర చక్రవర్తుల పాలన ఉన్నదన్నారు.

మోటుగా, అసంపూర్ణంగావున్న విహారపుగదులు బహుశా ఆంధ్రేక్ష్వాకులనాటివైయుండాలి. వారి

పాలన హఠాత్తుగా ఆగిపోయిన చరిత్ర—పల్లవ విజృంభణ ఉన్నది.


మన ఇక్ష్వాకుల అనంతరం వేంగి నేలినది శాలంకాయనులు. రాజధాని విజయవేంగీపురం. నేటి ఏలూరుతాలూకా వేగిదిబ్బలు. వారు బౌద్ధులుగారు. సూర్యోపాసకులు. కాని బౌద్ధవిరోధులుకారనే విషయం వారి పాలన కాలంలో గుంటుపల్లి క్షేత్రాలకు—తూర్పున బర్మాప్రాంతాలకూ యాత్రికులు సముద్రయానంచేసిన వైనమున్నది. ఆ రేవు బంగాళాఖాతంలో కలిసిపోయిన ప్రెలూరని పరిశోధకుల విశ్వాసం. అది నేటి కాళీపట్నప్రాంతం.

మహాకవి కాళిదాసు సమకాలికుడు, మహాపండితుడైన దిన్నాగాచార్యుడు కొంతకాలం అజంతా క్షేత్రంలోఉండి చరమకాలాన వేంగీ రాజధానికి ఉత్తరంగావున్న క్షేత్రంలో సిద్ధిపొందిన వైనమున్నది. క్రీ. శ. 7 వ శతాబ్దపు చీనాయాత్రికుడు యువాన్ ఛాంగ్ ఈ ఆచార్యుణ్ణే 'పునచెన్నా' అన్నాడు. దిన్నాగాచార్యుడు సిద్ధిచెందిన సమయంలో కొన్ని ప్రకృతి వైపరీత్యాలు సంభవించినట్లు ఛాంగ్ వ్రాసుకొన్నాడు.

తర్వాత వేంగి నేలిన విష్ణుకుండినులలో ఒకరిద్దరు బౌద్ధాన్ని పోషించినారు కాని వారి నాట ప్రారంభమైన జీర్ణావస్థ వేంగిచాళుక్యుల నాటికి పూర్తిగా శిథిలమై, వేగి నిర్మానుష్యమై పోయింది.

గుంటుపల్లిలోనే కాదు వేంగిలో ఎక్కడా తాంత్రికబౌద్ధం కాలూనినట్లు కన్పించదు.

గుంటుపల్లిబౌద్ధక్షేత్రంయొక్క పూర్వనామం వేంగిళ (వింగిల) అయ్యుండునా ?



గుంటుపల్లి గుంఫ : లోపల కన్పించే స్తూపం

మొదలిటి పద్యము

శ్రీ తుమ్మల సీతారామమూర్తి

ఓనమాలు రావు గాని నాతండ్రికి
సాహితీబలమ్ము చాలఁ గలదు
రేల నిరుగుపొరుగు పోరికులకుఁ బురా
ణమ్ము వినుచు నితఁడు నాల్గుగడెలు.

పోతన భాగవతమ్మున
కీతఁడు కడు మురియు; దాని నేఁ జదువంగా
నోతప్రోతమ్ముగఁ దా
శ్రోతలకున్ వక్కణించు సుస్పష్టగతిన్.

చదువుకైతఁ గఠినశబ్దంబు తగిలెనా
యపుడ దానియర్థ మడుగువాఁడ
నయ్యనుడువునర్థ మది చెఱుగనిముద్ర
కరణి నస్మదాత్మఁ గాఁపురించు.

మధుపం బనఁ దుమ్మెద యని
వధు వనఁగాఁ బెండ్లము నని జవం బన వేగం
బధరం బనఁ బెదవి కరా
నిధి యనఁ జంద్రుఁ డని కంటి నే నవ్వేళన్.

ఆంధ్రనామ సంగ్రహము, శేష, మమర మా
నాఁడ లోఁగియుండె నాకు; నల చ
రిత్ర వచ్చు దివిజరిపుబిడ్డకథ వచ్చు
వామనావతార వార్త వచ్చు.

అప్పటికి నావయస్సునం దష్టసమలు
నిండె; శ్రీరామ మంత్రిసన్నిధిని జదువు

మొదలిటి పద్యము

బుడుత నేను; మాతరగతి బొమ్మలందు
నేర్మి గలవాఁడ నేను బండితుఁడ నేను.

కలదు మాయూరు కావూరికిం దూర్పుగాఁ జిన్న వీటి
పొలుపునం దనరుచుఁ జెఱకుపల్లి యన్ ప్రోలు; సాహిత్య
మెఱిఁగినవా రందుఁ గలరు కొంద; ఱించించుక వ్రాయు
వెరవు నేర్చినవారుఁ గలరు; కల రట విత్తవంతులును.

తిరుపతి వేంకటకవు ల
బ్బురముగ నానావధానములు సల్పుచు నాం
ధ్రరసజ్ఞులకుం దను పిడు
తఱి యది మేధాకవిత్వధారాప్రౌఢిన్. (1910)

చెఱకుపల్లివారు సేయించి రవ్వ డవ
ధాన మఖిల రాజధానులందు
మంతుగన్న రాజమన్నారుచేత వి
ద్యత్కవీంద్రుచేతఁ దమ పురాన.

కవితారహస్యవిదుఁ డా
యవధానము చూడఁ గదలె నస్మద్గురుఁ; డె
ట్టివినోదమొ యిది యనుచుఁ ద
దవలోకన వాంఛ వెఱుఁగ నరిగితి నేనున్.

తగినవారు పదురు తెగఁబడి యవధాని
నొత్తఁజూచి రెల్లయెత్తు లూని
వెన్ను దున్న యనుచుఁ గొన్నిమాటల నిచ్చి
చెప్పుఁ డనిరి నలువచెలువ పెండ్లి.

ఆవర్ణము రారా దని
యీ వర్ణము వర్జ్య మనియు నెంతయు బెడఁదం
గావించి; రెదిరి యెదియో
భావించుట చూచిచూచి పఱపిరి గంటల్.

వనజలోచనుండు శునకమ్ముగా మారె
ననుదురర్థ మొదవునట్టి నుడుల
నొకసమస్య నిచ్చి; రకట! వధాని యె
ట్లిందు నెగ్గ ననుచు నేను గుంద.

పూరించె రాజమన్నారు దానిం ద్రిపురదైత్యకథకుం
గూరిచి సభ నున్నకవులు కోవిదుల్ కొనియాడునట్లు
నూటాఱులిడి నూత్నవస్త్రము లొసఁగి నుతిసొంపు వెలయ
శ్రీ రాజమన్నారు చదురు మెచ్చిరి శిష్టు లాప్రొద్దు.

పదపడి కవితావేశము
పొదలు కొనన్ నెలవు సేరి పూరించితిఁ ద
త్కథ నాసమస్య; నిది నా
మొదలిటి పద్యమ్ము; దీన మురియుదు నేఁడున్.

— మొదలిటి పద్యము —

మునుపున్ రాత్రిచరుల్ విమానములపై మోదమ్ముగా నెక్కి మా
ఘనమున్ జూడు మటంచు నాఘనముపైఁ గాసేపు పర్గెత్తి యా
వెనుకన్ నేలకు వ్రాలి యూళ్ల నణఁపన్ విల్లందుకొన్నట్టి యా
శున కమ్మయ్యెను విష్ణుదేవుఁ డహహా! చోద్యంబుగా నత్తరిన్.

(ఇందలి నాల్గవపాదమే సమస్య)

ఇట్లు వ్రాయవలయు నీపద్య; మిది సాధు;
విది యసాధు; వన్నయెఱుక లేని
నాఁడు దీని వ్రాసినాఁడ; నిం దెన్నేని
కొదవ లున్న నాకు నిది ప్రియమ్ము.

'శ్రీ భగవానువాచ'

శ్రీ పి. కేశవరెడ్డి

(గత సంచిక తరువాయి)

4

తాను కాబిన్‌లో కూర్చో గలిగినందుకు రామదాసు ఒక విధంగా సంతోషించాడు. మరోవిధంగా విచారించసాగాడు. చలిబాధను పోగొట్టే వెచ్చదనాన్ని తను పొందగలుగుతున్నాడేగాని ఇంజనులోనుండి వచ్చే పెట్రోలు వాసన అతని ప్రాణాలను తోడేస్తూంది. ఒక్కరోజుకే తానిలా బాధపడుతుండగా రోజూ ఈ వాసన భరిస్తూ డ్రైవరు ఎలా జీవిస్తున్నాడోనని అతనికి ఆశ్చర్యమయింది. ఇక పెట్రోలుతో దాదాపు స్నానం చేసినట్లున్న క్లీనరుయొక్క ఘ్రాణేంద్రియాల స్వస్థతపై పెద్ద అనుమానం కలిగింది.

ఒక గ్రామానికి చేరువగా లారీ పరుగిడుతూంది. గ్రామానికి విద్యుచ్ఛక్తి సరఫరా ఉన్నట్లు లేదు. ప్రమిదదీపాలు, కిరోసిన్ దీపాలు మినుకు మినుకుమంటూ కనిపిస్తున్నాయి. గ్రామంలోని ఇళ్లన్నీ పూరిగుడిసెలు లాగ ఉన్నాయి. ఇండ్ల పైకప్పుల అంచులు చీకటిలో అస్పష్టంగా కనిపిస్తున్నాయి. గ్రామాన్ని మెయిన్ రోడ్డుకు కలుపుతూ చేలమధ్య మట్టి రోడ్డు ఉంది. రోడ్డుమీదున్న గుంటలలో నీళ్లు నిలిచి ఉన్నాయి. 'ఈ ప్రాంతంలో ఉదయ మెప్పుడో వర్షం కురిసినట్లుంది' అనుకున్నాడు రామదాసు.

పెట్రోలు వాసనను రామదాసు మొదట ఖాతరు చేయలేదు గాని రాను రాను ఆ వాసన అతని పరిస్థితిని ఇరుకున పడేస్తూంది. అతని కడుపులో ఏదో తిప్పసాగింది. ప్రేవులన్నీ వలయాకారంగా తిరుగుతున్నాయి. మెదడు మొద్దుబారిపోతూంది. ఉండి ఉండి కళ్లు బైర్లు క్రమ్ముతున్నాయి. తనను తాను సంబాళించుకుంటూ సీటుమీద సర్ది కూర్చున్నాడు రామదాసు. కాని పరిస్థితి మెరుగుపడలేదు.

ఇంకాసేపు అక్కడేకూర్చుంటే తను కళ్లుతిరిగి పడిపోవడం తథ్య మనిపించిం దతనికి. అలా తను పడిపోతే జేబులోని రూపాయనోట్లు ఎగిరి డ్రైవరు కాళ్ళపైన పడతాయి. డ్రైవరు ఆ డబ్బునుతీసి జేబులో వేసుకుంటాడు. డ్రైవరు క్లీనరు కలిసి స్పృహగోల్పోయిఉన్న తనను కాబిన్‌నుండి రోడు మీదికి గెంటుతారు.

లారీని కొంతసేపు ఆపమని డ్రైవరుకు చెబుదామనుకుని గొంతు సవరించుకున్నాడు. ఇంతలో ఏదో తుఫాను అతనిలో సుడులు తిరిగి నట్టయింది. భళ్లున వమనం చేసుకున్నా డతడు. మిగిలిన ఇద్దరు ఉలికిపడి తలలుతిప్పి చూశారు. రామదాసు కళ్ళు తేలవేస్తున్నాడు. అతడు ముందుకు వాలిపోతున్నాడు. అతని కాళ్లకిందనున్న కార్పెట్ అసహ్యంగా తయారయింది.

లారీ ఎడమప్రక్కగావచ్చి ఆగింది. క్లీనరు క్రిందికిదిగి తలుపుతెరచి పట్టుకున్నాడు. డ్రైవరు రామదాసు భుజాలకింద చేతులువేసి అతనిని క్రిందికి దించాడు. అతని కణతలమీద చేతులువేసి అదిమి పట్టుకున్నాడు. మరోసారి డోక్కున్నాడు రామదాసు. డోక్కుంటున్నప్పుడు అతని కడుపు వెన్నెముకను తాకింది. కణతలవద్ద రక్తనాళాలు పొంగాయి. రెండవసారి డోక్కున్న తరవాత అతడు విపరీతమైన నీరసానికి లోనయ్యాడు. డ్రైవరు ఇస్తున్న ఆసరా లేకుంటే కుప్పగ కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నా

డతడు. అతనిని మెల్లగా నడిపించుకువెళ్లి మైలు రాయి నానుకుని కూర్చుండజేశాడు డ్రైవరు.

క్లీనరు కాబిన్ తలుపు ఒక చేతితో పట్టుకుని ఏదో చోద్యం చూస్తున్న వాడిలాగ నిల్చుని ఉన్నాడు.

'అలా చూస్తూ నిల్చున్నావేంరా సైతాన్. ఆ బకెట్ తీసుకెళ్లి నీళ్లుపట్రా' అన్నాడు డ్రైవరు.

క్లీనరు నిచ్చెనమీదెక్కి టాపుమీదనున్న తాడు లేని బొక్కెన తీసుకుని రోడ్డు నానుకుని ఉన్న చెరువులోకి దిగాడు.

రామదాసు మైలురాయికి చేరగిలబడి ఉన్నాడు. ఆయాసంవల్ల అతని డొక్కలు ఎగిరెగిరి పడుతున్నాయి. అతని కళ్లు లోపలికి పీక్కుపోయి అలసట కొట్టవచ్చినట్లు కనిపిస్తూంది.

చలి గడగడ లాడిస్తూంది. ఒకఅడవిప్రాంతంలో లారీ నిలిచిఉంది. కుడివైపునవున్న మైదానం ముళ్ల తిప్పలతో, రాళ్లగుట్టలతో నిండి ఉంది. మైదానాని కవతల పర్వతశ్రేణి ఉంది. పర్వతపు అంచులు మేఘాలలోకి చొచ్చుకుని పోతున్నట్లు చీకటిలో కనిపిస్తూంది. ఎడమవైపున విశాలమైన తటాకం ఉంది. తటాకపు అంచులలో రెల్లు విపరీతంగా పెరిగి ఉంది. రెల్లు పొదలలో మిణుగురలు విపరీతంగా ఎగురుతున్నాయి. తటాకంలో నీళ్లు నిర్మలంగా చలనరహితంగా ఉన్నాయి. ఆకాశంలోని నక్షత్రాలు ఆ నీటిలో తళతళలాడుతున్నాయి.

క్లీనరు బొక్కెన ముంచగానే బుడబుడ శబ్దమయింది. శబ్దం విని రెల్లుదుబ్బులలో దాగిఉండిన నీటిపకులు రెక్కలు టపటపలాడిస్తూ లేచి చీకటిలో మాయమైపోయాయి. బొక్కెన కలగజేసిన అలలు తటాకమంతా వ్యాపించసాగాయి.

బొక్కెనలో నీళ్లుముంచుకుని క్లీనరు వెనుదిరిగాడు. బొక్కెన అడుగున రెండు లావాటి రంధ్రాలున్నాయి. వాటిద్వారా నీళ్లు ధారగా క్లీనరు నడిచిన దారివెంబడి కారుతున్నాయి.

బొక్కెనలోని నీటితో రామదాసు వోర్గా, ముఖం కడుక్కున్నాడు. కడుపులో ఉన్నదంతా వమనం చేసుకోవడంవల్ల అతనికి విపరీతమైన దాహమయింది. రెండు చేతులతో బొక్కెనను పైకెత్తి గడగడ త్రాగనారంభించాడు. అతడు త్రాగ గలిగింది చారెడు నీళ్లు మాత్రమే. మిగిలిన నీళ్లన్నీ అతని గడ్డంమీదుగా క్రిందికి జారిపోయాయి. ఆ నీటితో జేబుతోపాటు చొక్కాముందు భాగమంతా చప్పగా తడిసిపోయింది. అదేమీ రామదాసు గమనించలేదు. తనకు లభించిన చెరువు నీళ్లే అమృతమనుకుని గటగట త్రాగడంలో లీనమైపోయాడతడు.

డ్రైవరు క్యాబిన్‌లోనికి వెళ్లి తన సీటుక్రింద ఉన్న సొరుగులాగి ఓ మూలఉన్న నిమ్మకాయను తెచ్చాడు. దానిని చాకుతో బద్దలుగాకోసి రామదాసు చేతిలోపెడుతూ, 'వీటిని చప్పరించు. కుదుటబడుతుంది' అన్నాడు. రామదాసు ఒక బద్దను తీసి నోట్లో వేసుకున్నాడు. అది పుల్లగా వుండడంవల్ల అతని ముఖంమీది కండరాలన్నీ క్షణకాలం ముడుచుకు పోయాయి. అది గమనించి డ్రైవరు 'ఉప్పుకూడ ఉండిఉంటే బాగుండేది. నిమ్మ బద్దలను ఉప్పుతో అద్దుకుని చప్పరిస్తే పైత్యానికి మంచిదని మా అవ్వ చెబుతూఉండేది' అన్నాడు

'ఐతే నేను వాంతులు చేసుకున్నది పైత్యంవల్లనే నంటావా?' అనడిగాడు రామదాసు బలహీనమైన స్వరంతో.

'కాకపోతే టౌనులో ఏదైనా కసమాలం తిని ఉంటావు.'

రామదాసు చప్పరించిన నిమ్మబద్దను ఉమ్మివేస్తూ 'తినడమంటూ ఏమీలేదు బాబూ, చిన్నప్పటి నుంచి నాకీ పెట్రోలువాసన గిట్టేదికాదు. అలాంటిది ఇవాళ గంటసేపు ఆ వాసనలో కూర్చునేసరికి ఇలా అయింది' అన్నాడు.

డ్రైవరు చాకును మడిచి టాపుమీదికి గిరాటు పెట్టి, 'బలేవాడివి జతచేరావు. నాకు పెట్రోలు వాసన అంటే ఆడవాళ్లతలల్లో మల్లెల వాసనలాగా

ష్టారం. కాని అగరొత్తుల వాసన నాకు ఉప్పుకు నిప్పుకులాగ పడదు. ఎప్పైనా గదిలోనుండి అగరొత్తుల వాసన వేసిందంటే మరిక జన్మలో ఆ గదిలో అడుగు పెట్టను' అన్నాడు.

రామదాసు బలహీనంగా నవ్వి, 'లోకో భిన్న రుచిః' అన్నారు. అదలా ఉండనీ. నేను మీ కాబిన్‌ను ఖరాబు చేసేశాను. ఏమీ అనుకోకండి' అన్నాడు.

'దాని దేముందిలే. ఇలాంటి ఇక్కట్లు మనుషులకు కాక మానులకు వస్తాయా? మస్తాన్, ఇంకో బకెట్టు నీళ్లుతెచ్చి కాబిన్ సుబ్బరంగా కడుగు' అన్నాడు డ్రైవరు.

క్లీనరు కాబిన్‌లో నీళ్ళుపోసి కడిగాడు. టాపు మీదున్న గుడ్డను తెచ్చి తుడిచాడు. కార్పెట్టునుతీసి 'బాడీ'లోకి విసిరేశాడు. సీటు కిందున్న సొరుగులో నుండి ఫినాయిలుతీసి కాబిన్‌లో చల్లాడు. ఫినాయిలు వాసన గుప్పున బయటకు వ్యాపించింది.

'పెద్దాయనా, ఇప్పటికే చాలా రాత్రయింది. ఇక బయలుదేరుదామా' అనడిగాడు డ్రైవరు.

రామదాసు మైలురాయి నాధారంగా జేసుకుని పైకిలేచి, 'తప్పకుండా బయలుదేరుదాము. నువ్విచ్చిన నిమ్మబద్ద దివ్యౌషధంలాగ పనిచేసింది. నాకిప్పుడేమీ బలహీనతలేదు. కాని నాకో అనుమానం. ఆ వాసనలో కూర్చుంటే మళ్లీ కడుపులో తిప్పటం ప్రారంభమవుతుందేమోనని భయంగా ఉంది' అన్నాడు.

'నీకా భయమేమీ అక్కరలేదు. కాబిన్‌లో ఫినాయిలు చల్లబడి ఉంది. దాని వాసనలో నీకు పెట్రోలు వాసన తెలియదు.' అంటూ కాబిన్‌లోకి ఎక్కి, రామదాసులోనికి రావడానికి చేయి ఆసరా ఇచ్చాడు. క్లీనరు బొక్కెనను టాపుమీదపడేసి వచ్చి కూర్చున్నాడు.

'మీకూ నాకూ మధ్య ఏదో ఋణానుబంధం ఉండి తీరాలి. లేకపోతే ముక్కూ మొగమూ తెలియని నాకు మీరిలా సేవలుచేసిఉండేవారుకారు. ఈ రోజులలో కడుపున బుట్టినవారే ముసలి తల్లిదండ్రులను వారి అలవాట్లను అసహ్యించుకుంటారు. అలాంటిది నేను వమనం చేసుకోగా నువ్వు అసహ్యమనుకోకుండా స్వహస్తాలతో శుభ్రం చేశావు. నీ ఋణం ఎన్ని జన్మలకైనా తీర్చుకోలేను' అన్నాడు రామదాసు క్లీనరు చేతులను పట్టుకుంటూ.

ఇంతసూటిగా తనను మొగమాట పరచడం క్లీనరుకు ఇష్టం లేనట్టుంది. అతడు రామదాసు చేతులను వెనక్కుతోసేస్తూ, 'అలా ఎందుకను కోవాలి? పోయిన జన్మలో నేను నీకు ఋణపడి ఉండి ఇప్పుడు తీర్చుకుంటున్నానను కోరాదా?' అన్నాడు.

'డ్రైవరుమాట ఎలా ఉన్నాగాని క్లీనరుకు మాత్రం కర్మకాండలపై నమ్మిక ఉంది' అనుకున్నాడు రామదాసు.

డ్రైవరు ఇంజన్‌ను స్టార్టుచేస్తూ, 'పెద్దాయనా. నీకు మళ్లీ తలతిరిగే సూచనలేవైనా కనిపిస్తే వెంటనే నాకు చెప్పెయ్. నేను బండిని ఆపుచేస్తాను' అన్నాడు.

'ఇంకేమీ ఫరవాలేదు బాబూ. ఎలాగూ రెండు సార్లు వమనమై పోయింది గనుక ఇంకేమీ జరగదు. ఐనా ఇంకెంత సేపు. ఓ రెండు గంటలలో మావూరు వచ్చేస్తుంది' అన్నాడు రామదాసు.

లారీని బయలుదేరదీస్తూ ముంజేతికి ఉన్న గడియారాన్ని చూసుకున్నాడు డ్రైవరు. 'చాలఆలస్యమై పోయింది. సమయానికి గమ్యస్థానం చేరుకోవడం చాలా కష్టం.' అనుకున్నాడతడు. అలా అనుకుంటూ వేగాన్ని హెచ్చించాడు. అతని చూపులు రోడ్డుమీద కేంద్రీకరించబడి ఉన్నాయి. క్లీనరు నిద్రలోకి జారుకొనడం లేదు. అతడు త్రాగిన టీ బాగా పని చేస్తున్నట్లుంది. దారి పొడవునా రోడ్డు పక్కన ఎగురుతున్న మిణుగురలను చూస్తూ కూర్చున్నాడతడు.

ఫినాయిలు వాసన రామదాసు ప్రాణాలకు కొంతసేపటిదాకా హాయినిచ్చింది. కాని అతనితో బల

హీనత క్షణక్షణానికి అధికమవుతూంది. కొద్ది క్షణాలలోనే అతనిలో వికారం ప్రారంభమయింది. డుపులోనుండి ఏదో ఎగదన్నుకొని వస్తున్నట్లని పించింది. గొంతులో ఏదో అడ్డుతగిలినట్లు ఉక్కిరి బిక్కిరి అయ్యా డతడు.

డ్రైవరు తలతిప్పి చూశాడు. రామదాసు ప్రదర్శిస్తున్న ముఖకవళికలను బట్టి పరిస్థితి అర్థం చేసుకున్నాడు.

'ఏం పెద్దాయనా, మళ్లీ మొదలవుతూందా?' అనడిగాడు స్పీడు తగ్గిస్తూ.

అవునన్నట్లు తలూపాడు రామదాసు.

'ఐతే ఆ సీటుమీద అలాగేపడుకో—అదే కుదిరి పోతుంది. మస్తాన్, నువ్వెళ్లి బాడీలో కూర్చో' అన్నాడు డ్రైవరు.

డ్రైవరు చెప్పినమాట క్లీనరుపాలిట సుగ్రీవాజ్ఞగా ఉండడం రామదాసు మొదటినుండి గమనిస్తున్నాడు. క్లీనరు కిక్కురుమనకుండా లేచి తలుపు తెరచుకుని నిచ్చెనమీదొక కాలుంచి కాబిన్‌లోకి గెంతాడు. ఆమూల పడిఉన్న టైరుమీద కూర్చుని మఫ్లరును చెవులమీదుగా చుట్టుకున్నా డతడు. ఇక్కడ చలి విపరీతంగా బాధించ సాగిం దతనిని. మోకాళ్ల మధ్య మోచేతు లుంచుకుని, గడ్డంకింద పిడికిళ్లను పెట్టుకుని గువ్వలాగ కూర్చున్నాడు.

క్లీనరు వెళ్లిపోవడంతో కాబిన్‌లో కావలసి నంత ఖాళీ ఏర్పడింది. డ్రైవరువైపున తలపెట్టి వెల్లకిలా పడుకున్నాడు రామదాసు. పడుకున్నాక అతనిలో పొంగుతూ ఉండిన వికారాలన్నీ చల్లారిపోయి ప్రాణానికి నెమ్మది చిక్కింది.

రామదాసుపై జాలి కలిగింది డ్రైవరుకు. 'ఈదెబ్బతో అతని ఆరోగ్యం చెడిపోవచ్చు. రేపు కూతురి పెళ్లి కార్యాలనుకూడా అతడు సరిగా నిర్వర్తించలేడేమో' అనుకున్నాడు డ్రైవరు. జాలిగా రామదాసువైపు చూశాడు డ్రైవరు. కళ్లు మూసుకుని పడుకుని వున్నాడు రామదాసు. అతని కడుపు వెన్నెముకనంటి ఉంది. 'పాపం, తిన్నదంతా వమనం చేసుకున్నాడు. ఆకలవుతూందేమో! ఇక తిరుపతి చేరేంతవరకు ఈరోడ్లో ఎక్కడా అంగళ్లుకూడా లేవు' అనుకున్నాడు డ్రైవరు.

ఉచ్ఛ్వాస నిశ్వాసాలకు అనుగుణంగా వృద్ధుని రొమ్ము కదులుతూంది. చొక్కా సీటిలోతడిసి ఉండడం వల్ల జేబులోని రూపాయనోట్లు బయటికి కని పిస్తూండడం డ్రైవరు గమనించాడు. కాబిన్‌లో మెరుపు మెరిసినట్లయింది. కనురెప్పలు టపటప లాడించి మళ్లీ చూశా డతడు. వందరూపాయల నోట్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

నోట్లు!

నోట్లు!

వందరూపాయల నోట్లు!!

డ్రైవరు మెదడు అల్లకల్లోలమై పోతూంది. అతని మానసంలో ఒక రాక్షసుడు వొళ్లు విరుచుకుంటూ నిద్రలేచాడు.

5

అల్లంత దూరాన రోడ్డుమీద పాతికమంది జనం నిల్చుని ఉన్నారు. వాళ్లు చేతులుచాచి లారీని ఆపడానికి ప్రయత్నిస్తున్నారు. డ్రైవరుకు చాలాకోపం వచ్చింది. బండిని ఆపడానికి అతనికి సుతరామూ ఇష్టంలేదు. ఏకధాటిగా హారన్ మ్రోగిస్తూ లారీని ముందుకు దూకిస్తున్నా డతడు. లారీ వస్తున్న వేగాన్నిబట్టి అది ఆగదని తెలుసుకున్నారు రోడ్డుమీదున్న జనం. వాళ్లంతా రోడ్డు కడ్డంగా దడిగట్టుకుని నిల్చున్నారు. డ్రైవరు పళ్లు పటపట కొరికాడు. లారీని ఆపడంకన్న గత్యంతరం లేకపోయిం దతనికి.

లారీ ఆగగానే డ్రైవరు తల బయటపెట్టి 'చద్దిమొహాల్లారా, మీకంతా లారీ కిందబడి చావాల నుందా ఏమిటి?' అనడిగాడు కోపంగా.

ఆ గుంపులో ఆడామగా పిల్లాజెల్లా ఉన్నారు. వాళ్లందరి ముఖాలు కళకళ లాడుతున్నాయి. అందరూ రంగురంగులబట్టలు కట్టుకున్నారు. ప్రతి ఆడదీ తలలో చామంతిపూలు పెట్టుకుంది. మగ వాళ్లు తలలకు సరిగంచు తువ్వాళ్లు చుట్టు కున్నారు. గుంపువెనక నిల్చుని ఉన్నవాడు తలలో నెమలి ఈకను చెక్కుకుని పిల్లనగ్రోవిని ఊదు తున్నాడు. వాళ్లందరికీ నాయకుడులాగున్న వాడొకడు ముందుకొచ్చి, 'డ్రైవోరూ' మేమంతా రాజన్నసత్రం ఎల్లాల. అంత ఖరవై మడిసి ఉన్నాం. తలకు పావలా ఇచ్చుకుంటాం. తీసికెల్లు' అన్నాడు.

డ్రైవరుకు చిరాకు అధికమయింది. 'బుద్ధి లేకుంటే సరి. మిమ్మల్నంతా తీసుకెళ్ళడానికి ఇదే మన్నా బస్సనుకున్నారా? నోరు మూసుకుని నడచి రండి. తొలగండి దారి' అన్నాడతడు.

'మేం తొలగం. మేం తొలగం' అంటూ మళ్లీ రోడ్డుకడ్డంగా నిల్చున్నారు వాళ్లు. నాయకుడు మాత్రం వినయంగా 'డ్రైవోరూ! నువ్వు ఎట్టాగైనా మమ్మల్ని తీసకెల్లాలిసిందే. ఈపూట రాజన్నసత్రం కాడ ఉట్లతిరణాల బలే వేడికగా ఉంటాది. నువ్వు గూడ సూద్దువ్గాని' అన్నాడు.

డ్రైవరు బాగా వివశుడైపోయాడు. వాళ్ళ కోరికను మన్నించడకన్న గత్యంతరం లేకపోయింది. 'సరె, ఎక్కండి సత్రందగ్గర దిగిపోవాలి. లేకపోతే నేవచ్చి మెడవట్టి గెంటుతాను' అన్నా డతడు.

అతడా మాట అనగానే అందరూ పోలోమని వెనక్కువెళ్లి తలుపుమీదుగాఎక్కి బాడీలోకి గెంత సాగారు. మగవాళ్లు ఆడవాళ్లకు, పసివాళ్లకు చేయి ఆసరా ఇచ్చి పైకి లాక్కున్నారు.

పిల్లనగ్రోవి పట్టుకున్నవాడు అందరికన్న వెనకాల వెళుతూ ఆగి, 'డ్రైవోరూ. నేను నీపక్కన కూర్చోనా?' అనడిగాడు.

'నా నెత్తిమీద కూర్చో. ఆడవెధవా' అంటూ కసురుకున్నాడు డ్రైవరు.

వాడు నాలిక బయటపెట్టి డ్రైవరును వెక్కిరిస్తూ వెనక్కు వెళ్లాడు.

డ్రైవరు వెనక్కు తిరిగి చతురస్రాకారపు రంధ్రంగుండా చూస్తూ, 'మస్తాన్, వాళ్లంతా రాజన్నసత్రం దాకా వస్తారు. తలకొక పావలా చొప్పున వసూలు చెయ్. ఎవర్నీ వదలకు.' అన్నాడు.

లారీ మళ్లీ బయలుదేరింది.

రామదాసు సేదదీర్చుకుంటూ పడుకుని ఉన్నాడు. ఇప్పుడతని పరిస్థితి ఎంతో మెరుగుగా ఉంది. డ్రైవరూ, క్లీనరు తనపట్ల ప్రదర్శించిన సేవానిరతి అతని మానసంలో అవిరామంగా మెదులుతూ ఉంది. వాళ్ల స్థానంలో వేరే ఎవరైనా ఉండిఉంటే కాబిన్‌లో డొక్కున్నందుకు తనను తూలనాడి ఉందురు. అడవిలో తటాకంవద్దనే తనను దిగబెట్టి ఉందురు. వాళ్ల బాహ్యస్వరూపాలు ఎంత క్రూరంగా ఉన్నాయో—అంతరంగాలు అంతమృదువైనవి' అనుకున్నాడు రామదాసు.

వెనకనుండి పిల్లనగ్రోవి మృదువుగా విని పిస్తోంది. పిల్లనగ్రోవితోబాటు కలసి కొంద రాడ వాళ్ళు పాడుతున్నారు. పాటకు అనుగుణంగా కొందరు నృత్యం చేస్తున్నట్లుంది. నృత్యం తాలూకు అడుగుల సవ్వడి లయబద్ధంగా వినిపిస్తోంది. ఈ పాటలన్నీ రాజన్నసత్రంవద్ద జరిగే తిరణాలలో పాడేవి. ఉట్ల తిరణాల కడువైభవంగా జరిగే ఉత్సవం. ఆ వేడు కలను చూడడానికి దూరప్రాంతాలనుండికూడ జనం తండోపతండాలుగ వస్తారు. చిన్నవాడుగా ఉన్నప్పుడు రామదాసు క్రమం దప్పక ఆ ఉత్సవాలను సంద ర్శించేవాడు. ఆ ఉత్సవాలు ఎంత ఆసక్తిదాయకంగా ఉండేవి! ఎన్ని వింతలు! ఎన్ని వినోదాలు! నాటకా లుండేవి. ఎద్దుపందాలుండేవి. ఆటల పోటీ లుండేవి. ఆ పోటీలలో రామదాసు పాల్గొనేవాడు. ఆ ఉత్సవా లను తలచుకోగానే అతనికి తన యవ్వనమంతా జ్ఞాప కాని కొస్తుంది. రక్తనాళాలలో రక్తం ఉరకలెత్తు తుంది. శరీరంలో నూతనోత్సాహం పెల్లుబుకుతుంది.

'బాడీ'లో నృత్యగానాలస్థాయి పెరుగుతూంది. నృత్యం చేస్తున్నవారు ధనాధన్‌మంటూ శబ్దం చేస్తున్నారు. మురళీనాదం తారస్థాయినందుకుంటూ ఉంది.

చైరుమీద కూర్చునిఉన్న క్లీనరు పైకి లేస్తూ 'ఏమిటి ముండాసంత ఆపుతారా లేదా?' అంటూ అరిచాడు.

తలపాగా ధరించిఉన్న వాడొకడు క్లీనరును వెనక్కులాగేస్తూ, 'నువ్విలా గమ్మున కూర్చోబే. ఇది ఉట్లతిరణాల సంప్రదాయం. అడ్డు జెప్పావంటే కళ్ళుపోతాయి' అన్నాడు

'ఆ, మీ పిండాకూడు తిరణాల. అసలే చలికి చస్తూఉంటే మీదొక వెధవరచ్చ' అన్నాడు క్లీనరు.

'మరీ అంత చలిగాఉంటే మాతో కలిసి ఆడవయ్యా. చలీగిలీ వొదిలిపోతాది' అన్నదో ఆడకంఠం. 'అవదెవతోగాని బలేజాణఅయి ఉండాలి' అనుకున్నాడు డ్రైవరు.

క్లీనరు అసహ్యంగా ముఖంపెట్టి: 'నీతోకలిసి ఆడడమే, వెధవకంపూ నువ్వూ.'

దాంతో ఆ జాణ చీరఎగగట్టుకుంటూ, 'వోరినీ సోగుసుకు నన్నరాస్తివా? బొగ్గులబస్తాకు నీకూ బేదవేవన్నా వుందా! నీతో మాట్లాడొచ్చినట్టు తెలిస్తే తిరణాలలో మాకెవరన్నా నల్లముంతతో నీళ్లిస్తారా?' అంది.

బాడీలో ఉన్నవాళ్లంతా గొల్లున నవ్వడం ప్రారంభించారు. ఆ సందడిలో క్లీనరు ఉక్రోషంకొద్దీ ఏదో అరుస్తుండడం డ్రైవరుకు వినిపిస్తోంది. 'ఈ మస్తాన్‌గాడు కండలుపెంచాడేగాని ఏ మాత్రం ఇంగితం లేనివాడు. ఆ గుంపులో కాస్త ఎర్రగ బుర్రగ ఉన్నదాన్ని మెల్లగ మాటలలోకి దించకుండా వాళ్లతోనే తగవులు పెట్టుకుంటున్నాడు.' అనుకున్నాడు డ్రైవరు.

'బాడీ'లో జరుగుతున్న సందడికి రామదాసు మేల్కొననందుకు డ్రైవరు సంతోషించాడు. అతని జేబుకేసి నిమిషానికోసారి చూస్తున్నాడు డ్రైవరు. అలా చూస్తున్నప్పుడు డాకళ్ళు వేటకోసం పొదలలో నక్కిఉన్న పులికళ్లను తలపిస్తున్నాయి. ఆ జేబు ఉబ్బెత్తుగా కనిపిస్తూ ఉంది. అందులో వందరూపాయలనోట్లు చాలా ఉన్నట్లున్నాయి. టీ కొట్టు నడిపే చిన్నదాన్ని తనతో రమ్మని చాలసార్లు బతిమాలాడడు. కాని అది ఒకే షరతుమీద ఉంది. 'నువ్వొక వెయ్యిరూపాయలను వెనకెయ్యగలిగిననాడు నీతో రావడానికి నాకేమీ అభ్యంతరం లేద'న్నది. ఆ మాటకొస్తే ఏ తలమాసిన వాడైనాసరే వెయ్యి రూపాయలను చూపిస్తే వాడితో పోవడానికి అది సిద్ధంగా ఉంది. అనకీ అవకాశం అపురూపంగా లభించింది. ఇలాంటి అవకాశం మరోసారి లభించడం కల్ల.

ఆలోచనలతో డ్రైవరు మెదడు నిండిపోయింది. అది మొసళ్లతో నిండిన సరస్సులాగ ఉంది.

'డ్రైగోరూ. ఆ కనిపించేదే రాజన్నసత్రం. అక్కడే బండిని ఆపు.' అన్నదో కంఠం వెనకనుంచి.

'సరె, మీరంతా మీ సామాన్లంతా ఎత్తుకుని దిగటానికి సిద్ధంగా ఉండండి' అన్నాడు డ్రైవరు.

దూరాన పెట్రోమాక్సు దీపాలు చాలా కనిపిస్తున్నాయి. ఆకాశానికెగసిన తారాజువ్వలు రంగు రంగుల పువ్వులను రాలుస్తూ మాయమైపోతున్నాయి. జనసందోహం అస్పష్టంగా వినిపిస్తోంది.

లారీ సత్రం వద్ద ఆగింది. 'దిగండి దిగండి. తొందరగా దిగండి' అంటూ తొందర చేశాడు డ్రైవరు.

ఆ ప్రాంతమంతా పెట్రోమాక్సు దీపాలతో పట్టపగలుగా ఉంది. రోడ్డుకిరువైపులా పందలకొద్దీ జనం గిజగిజలాడుతున్నారు. సత్రంపక్కనున్న వేదిక మీద వీధినాటకం జరుగుతూంది. భారీకిరీటంతో, చేటల్లాంటి భుజకీర్తులతోనూ ఉన్న దుశ్శాసనుడు పాంచాలిని తరుముతున్నాడు. వేదికమీదున్న నటుల పాదములతాకిడికి పైకి లేచిన దుమ్ము ముందువరసతో కూర్చుని ఉన్న ప్రేక్షకుల ముఖాలమీద వాలుతూ ఉంది.

ఊడలు దిగిఉన్న మర్రిచెట్టుక్రింద కోడిపందాలు జరుగుతున్నాయి. పుంజుల స్వంతదారులు మీసాలను మెలివేస్తూ మాటిమాటికి తొడమీద చరుచుకుంటున్నారు. అవతలవైపువారి కోడి వెనక్కు తగ్గినప్పుడు ఇవతలి వైపువారు చెవులు చిల్లులు పడేలాగ ఈలలు వేస్తున్నారు.

ఒక పెద్ద ఊరేగింపు రోడ్డును దాటుతూంది. ఊరేగింపు ముందు భాగాన దేవుని రథాన్ని లాగుతున్నారు. రథానికి రెండు లావాటి మోకులుకట్టి ఒక్కొక్కమోకును యాభైమందికిపైగాపట్టి లాగుతున్నారు. రథంమీద ఊరేగుతున్న దేవుడెవరో తెలియడం లేదు. కుక్కితట్టలాంటి బొజ్జ కలిగిన పూజారి రథం మీదెక్కి దేవునివద్ద ఏదో సర్దుతున్నాడు. రథం వెనక మంగళవాద్యాలు తరలి వస్తున్నాయి.

తారాజువ్వలు ఆకాశానికెగిసినపుడు జనమంతా లిచ్చపడి తలఎత్తి చూస్తున్నారు.

లారీలోనుండి ముందు పిల్లలను, ఆడవాళ్ళను దింపి, తరవాత మగవాళ్ళు దిగారు. అందరూ దిగాక క్లీనరు తన సహజధోరణిలో 'ఆ—రయిట్' అన్నాడు.

లారీ బయలుదేరింది. రోడ్డుమీద జనం గుంపులు గుంపులుగా మూగి ఉండడంవల్ల అది తాబేటి నడకతో నడవవలసి వచ్చింది. డ్రైవరు అవిరామంగా హారన్ మ్రోగిస్తున్నాడుగాని, అతనిని వినిపించుకున్నవారు అరుదు. కొన్నిచోట్ల తాత్కాలికంగా సంబరంకోసం ఏర్పరచిన అంగళ్లు రోడ్డుమీదకు చొచ్చుకునివచ్చేశాయి. 'వీళ్ల సంబరంలో అగ్గిబడ. అనవసరంగా ట్రాఫిక్కును ఇబ్బంది పెట్టేస్తున్నారు' అనుకున్నాడు డ్రైవరు.

ఉత్సవాన్ని దాటుకున్నాక లారీ వేగం పుంజుకుంది.

డ్రైవరు తనదృష్టిని రోడ్డుమీద కేంద్రీకరించ లేకపోతున్నాడు. అతని చూపులు రామదాసు జేబును వదిలి రామంటున్నాయి.

ప్రారంభంలో అతనికి రామదాసుపైన అనురాగం ఉండేది. కార్యార్థమై పట్టణంవచ్చి కొన్ని కారణాంతరాలవలన అక్కడే చిక్కుబడిపోయిన వృద్ధునిపై అతనికి జాలికలిగింది. తత్ఫలితంగా, అతనికి తన లారీలో చోటిచ్చాడు. అతడు ఐదు రూపాయలివ్వబోతే తానే వద్దన్నాడు. చిన్ననాడే తల్లిని కోల్పోయిన ఒక ఆడపిల్లకు పెళ్లిచేయనున్న ముసలాయనపై అతనికి అనుకంప కలిగింది. కొన్ని ఏండ్లుగా కష్టించి ఆర్జించిన సొమ్ము యావత్తును కూతురి పెళ్లిలో ధారబోసి శేషజీవితాన్ని అతడెలా గడుపుతాడోనని ఆలోచిస్తూ అతని మనసు ఆర్ద్రమయింది. బలహీనతవల్ల అతడు కాబిన్‌లో డోక్కున్నప్పుడు అసహ్యించుకోలేదు. అతనిని తన కన్నతండ్రిగా భావించి సపర్యలు చేశాడు. వంగిపోయిన అతని నడుమునుచూసి, 'అయ్యో, పాపం, ఈ వయసులో కూడ ఇతనికి అగచాట్లు తప్పలేదు' అనుకున్నాడు. అతని ముఖంమీద ముడతలుపడిన చర్మాన్ని చూసి 'జీవితంలో ఎన్ని కష్టాలు చూశాడో—ఎన్ని ఎదురు దెబ్బలు తిన్నాడో' అని జాలిపడ్డాడు

కాని ఈ జాలి, ఈ కరుణ—ఇవన్నీ డబ్బు కనబడేంతవరకే. డబ్బు కనబడగానే ఆ దయాగుణాలన్నీ డ్రైవరు మానసంలో నుండి మాయమైపోయాయి.

నోట్లు!
నోట్లు!
వందరూపాయల నోట్లు!!

డ్రైవరు మానసంలో నిద్రలేచినరాక్షసుడు రక్తనేత్రాలతో దీర్ఘదంతాలతో చెలరేగుతున్నాడు.

రామదాసు చలనరహితంగా పడుకుని ఉన్నాడు. అది నిద్రకాదు. అలసటచే జనించిన జడత్వం.

డ్రైవరు వెనక్కు తిరిగి, 'మస్తాన్!' అని పిలిచాడు. క్లీనరు పరుగున రంధ్రంవద్దకు వచ్చాడు.

'లోపలకు రా' అంటూ డ్రైవరు ఆజ్ఞాపించాడు. క్లీనరు విచ్చైన మీదొక కాలుంచి తలుపు తెరచుకుని కాబిన్‌లోకి ప్రవేశించాడు. చలిలో గడగడలాడుతూ ఉండిన తాను వెచ్చటి కాబిన్‌లోనికి రాగలిగినందుకు సంతోషిస్తూ డ్రైవరు వైపు చూశాడతడు. అదేదో సినిమాలో మాంత్రికుడు తన రోమాన్ని నేలకేసి కొట్టగా ఉద్భవించిన రాక్షసుడు చేతులు కట్టుకుని, 'మహాప్రభూ. ఎందునిమిత్తం నన్ను పిలిపించావూ?' అన్నట్లుంది క్లీనరు వాలకం. రూపాయినోట్లతో ఉన్న జేబును చూడమని డ్రైవరు కళ్లతో సైగ చేశాడు. క్లీనరు దృష్టి తడిసిఉన్న రామదాసు జేబుపైన పడింది. అతని కళ్లు జిగేలుమన్నాయి. క్షణ కాలం అతని కళ్లు చీకట్లు క్రమ్మాయి. చేరువగా రమ్మని డ్రైవరు సైగచేశాడు. సద్దుచేయకుండా అతనిని సమీపించాడు క్లీనరు. వాళ్లిద్దరికీ ముఖాలు చేరువయ్యాయి. క్లీనరు వదులుతున్న శ్వాస డ్రైవరు చెంపలకు తగులుతూ ఉంది.

'ఇప్పుడేం చెయ్యాలో తెలుసా? చప్పుడు కాకుండా జేబు కాజెయ్యాలి.' అన్నాడు డ్రైవరు అతని చెవిలో.

'అమ్మో, ముసలాడు లేచి గోల చెయ్యడూ.' అన్నాడు క్లీనరు.

'ఇక వాడు లేచేదేమిటి. ఇక్కడికిక్కడే వాడిని సఫా చేసెయ్యాలి.'

క్లీనరు వదులుతున్న శ్వాస ఆగింది. అది గమనించిన డ్రైవరు 'పీడిందుకు సుముఖుడు కాడేమో' అనుకున్నాడు. 'ఏమిటి ఆలోచిస్తున్నావు?' అనడిగాడతడు అనుమానంగా.

'ఏమీ లేదు. కత్తి టాపుమీద ఉందా, సొరుగులో ఉందా అని ఆలోచిస్తున్నాను.' అన్నాడు క్లీనరు.

'హమ్మయ్య' అనుకున్నాడు డ్రైవరు. 'టాపు మీదే వేశాను. కాని కత్తి ఉపయోగిస్తే మనకే ముప్పు.' అన్నాడతడు.

క్రిందపడి ఉన్న ఇనుపకడ్డీని తీసుకుని, 'దీంతో తల చితకబొడవనా?' అన్నాడు క్లీనరు.

'అదికూడ మనకు ఉపకరించదు. నెత్తురు వచ్చేపని ఏది చేసినా కొంపమునుగుతుంది' అన్నాడు డ్రైవరు.

'మరి.'

'చేతులతో పీక నొక్కెయ్యాలి.'

'తరవాత.'

'ఇంకో పదిమైళ్లలో పనసపాకం అడవి వస్తుంది. శవాన్ని అడవిలో పారెయ్యాలి' అన్నాడు డ్రైవరు.

డ్రైవరువేసిన పథకాన్ని అర్థంచేసుకున్నట్లుగా తలపంకించి, 'సరె. ఈ లోగా ఎవరైనా బండిని ఆపటానికి ప్రయత్నిస్తే చచ్చినా ఆపకు' అన్నాడు క్లీనరు.

'అదంతా నేను చూసుకుంటాను. నువ్వు పని ప్రారంభించు' అన్నాడు డ్రైవరు. క్లీనరు రామదాసు నడుమువద్ద కూర్చున్నాడు.

అల్లంత దూరాన రోడ్డుకడ్డంగా రాళ్లు పెట్టబడి ఉన్నాయి. డ్రైవరు అవుడుగరచుకుని లారీని శరవేగంతో ఆ రాళ్లమీదుగా దూకించాడు. రాళ్లమీద పరుగెత్తినపుడు లారీ పెద్ద కుదుపుకు లోనయింది. రామదాసు ఒక్కసారి ప్రక్కకు వొత్తిగిలి మళ్లీ వెల్లకిలా పడుకున్నాడు. అతడు కళ్లు తెరవలేదు. ఆ రాళ్లను ఎవరు ఎందునిమిత్తం పెట్టారో అతనికి బాగా తెలుసు. ఉపాధ్యాయుడుగా ఉండిన రోజులలో ఇలాంటివి చాలా చూశాడతడు. అతని విద్యార్థులు ఇలాంటి అల్లరి పనులలో ఆరితేరినవారు. వారు రోడ్డుకడ్డంగా పెద్ద పెద్ద రాళ్లను దొర్లించిపెట్టి చింతచెట్ల వెనక నక్కి కూర్చునేవారు. ఆ దారిన వచ్చిన బస్సు గత్యంతరంలేక ఆ రాళ్లవద్ద ఆగిపోయేది. ప్రయాణీకులందరూ కిందికిదిగి రాళ్లను పక్కకు దొర్లించేవారు.

అలా దొర్లిస్తున్నప్పుడు వాళ్ల శరీరంమీద చమటలు ధారలుకట్టేవి. కొందరు అలసిపోయి 'ఇస్సు'రంటూ చింతచెట్ల నీడన చతికిలబడేవారు. అలసట తీరేందుకు వారు మరచెంబులోని నీళ్ళు తాగేవారు. వాళ్ల అవస్థలనుచూసి చింతచెట్ల వెనక నక్కిఉన్న పిల్లలు కడుపుబ్బ నవ్వుకునేవారు. కండక్టరు పెట్టే శాపానార్థాలను మాత్రం వారు గాలికి వదిలేసేవారు.

అలాంటి దుండగాలుచేసే కుర్రాళ్ళు ఒక్కోసారి కండక్టరుచేతికి దొరికిపోయేవారు. కండక్టరు వారినందరను బడిలోకిలాక్కొచ్చి రామదాసుతో ఫిర్యాదుచేసేవాడు. అతనిని సమాధానపరచి పంపేసరికి రామదాసుకు తలప్రాణంతోకకు వచ్చేది. ఒకరోజు సాయంత్రం వాహ్యాళి వెళ్లినప్పుడు రామదాసు తన విద్యార్థుల పోకిరిచేష్టలను గురించి కరణంగారికి చెప్పాడు. కరణంగారు, 'నేను నాడే చెప్పానుగదా—నీ బడిలో చదువుకున్నవాళ్లు గూండాలుగా తయారవుతారని' అన్నాడు. అప్పుడు రామదాసు ఎత్తిపొడుపుగా 'నా శిష్యవర్గంతో నీ కుమారరత్నం గూడ ఉన్నాడని మరచిపోకు' అన్నాడు. 'పుట్టి బుద్ధి తెలిసాక నేను చేసిన తెలివిమాలినపని మావాడిని నీ బడికి పంపడం.' అన్నాడు కరణం ఎదురుదెబ్బ తీస్తూ.

లారీ చీకటిని చీల్చుకుంటూ పరుగిడుతూంది.

ఉచ్ఛ్వాస నిశ్వాసాల కనుగుణంగా పైకి కిందికి చలిస్తున్న రామదాసు వక్షాన్ని కొంతసేపు పరిశీలనగా చూశాడు క్లీనరు. తరవాత సింహంలాగ లంఘించి అతని ఎదపై కూర్చున్నాడు. తన కబంధ హస్తాలను వృద్ధుని కంఠంపై వేశాడు. రామదాసుకు ఎదపైన ఏదో బరువుగా తోచింది. కంఠంమీద చల్లగా అనిపించింది. అతడు దిగ్గున కళ్లుతెరిచాడు. కళ్లుతెరచిన తొలిక్షణాలలో అతనికి తానెక్కడున్నాడో ఏమైపోతున్నాడో స్ఫురించలేదు. అయోమయంగా అతడు, 'డ్రైవర్, మస్తాన్' అంటూ అరిచాడు. కాని ఉత్తరక్షణంలోనే అతనికి అర్థమయి పోయింది—ఎవరిసహాయంకోసమై తాను ఆక్రోశిస్తున్నాడో వారే తనను కబళిస్తున్నారు. ఎదమీద కూర్చునిఉన్న క్లీనరు కళ్లు ఎర్రగా నెత్తురు కక్కుతున్నట్లు ఉన్నాయి. తలవద్దఉన్న డ్రైవరు గుడ్డికన్ను కత్తిమొనలాగ క్రూరంగ చూస్తూ ఉంది.

రామదాసు ఏదో అరవదలచుకున్నాడు. విపరీతమైన భయంచేత అతని కంఠంనుండి శబ్దం వెలువడటంలేదు. అతను అవాక్కయి పోయాడు.

అయిపోయింది. అంతా అయిపోయింది. జేబులోని డబ్బు వారికళ్లబడింది. ఏది జరగరాదని తను తప్పించాడో అది జరిగిపోయింది.

క్లీనరు తన ఉక్కుపిడికిలిని బిగించాడు. అది సింహపు పంజాలాగ పైకిలేచింది. అది కులిశమై రామదాసు ముఖాన్ని తాకింది. రామదాసు కళ్లకు చీకటి తప్ప మరేమీ కనిపించలేదు. నోరుతెరచి అతడు ఆర్తనాదం చేశాడు. తలకు చుట్టుకునిఉన్న మప్లరును తీసి అతనినోట్లో కుక్కాడు క్లీనరు. ఆర్తనాదం మధ్యలోనే ఆగిపోయింది.

రోడ్డు ప్రక్కనఉన్న పొదలలోనుండి కుందేలొకటి చెంగుచెంగున రోడ్డును దాటింది. ఒక తోడేలు దానిని తరుముతూ వెళ్లింది. కుందేలు ప్రాణభయంతోను, తోడేలు రక్తదాహంతోనూ పరుగిడుతున్నాయి. 'ఆ తోడేలు కుందేలును ఇక కొద్ది ఘడియలలో కబళిస్తుంది. దానికంఠం కొరికి నులివెచ్చటి నెత్తురును గటగట త్రాగుతుంది. తృప్తితో పరవశించి నెత్తురుచిందిఉన్న నేలమీద నాట్యం చేస్తుంది' అనుకున్నాడు డ్రైవరు.

రామదాసు గింజుకోసాగాడు. క్లీనరు అతని దేహాన్ని ఆపాదమస్తకం పెనవేసుకుని అరఅంగుళమైనా కదలనివ్వడంలేదు. అతని దృఢమైన చేతివ్రేళ్లు వృద్ధుని కంఠంచుట్టూ బిగుసుకుంటున్నాయి. ఆ చేతులను విడదీయడానికి రామదాసు తన శక్తినంతా కూడదీసుకుని ప్రయత్నించాడు. అతని చేతులలో సత్తువలేదు. అవి వెనకకు వాలిపోతున్నాయి.

6

తాను ముసలివాడై పోయినందుకు మొదటి సారిగా బాధపడ్డాడు రామదాసు. వయసులో ఉన్నప్పుడు అతనిదేహం కండలుతిరిగి నిగనిగ లాడుతూ ఉండేది. ఉట్ల తిరణాలలో మదించి చెలరేగిఉన్న ఆబోతును నిరాయుధుడై ఎదిరించి వశపరచుకో గలిగే వాడు. ఎద్దుపందాలు ఉట్లతిరణాలలోని ప్రధానాంశాలలో ఒకటి. పద్దెనిమిదేండ్ల ప్రాయంలో అతడు మొదటిసారిగా ఎద్దుపందాలలో పాల్గొన్నాడు.

ఆ రోజు ఉదయం పదిగంటలకు ఉట్లతిరణాల వద్ద జనం ఇసుకవేస్తే నేల రాలనంతగా చేరారు. ఆ పూట పందానికి వదలబడనున్న ఆబోతునుగురించి అందరూ అబ్బురంగా చెప్పుకుంటున్నారు. కళ్లు పెద్దవిచేస్తూ, బుగ్గలు పూరిస్తూ, చేతులు తిప్పుకుంటూ చెప్పుకుంటున్నారు. దాని జాతియొక్క ఔన్నత్యాన్ని, గోపురంయొక్క ఠీవిని, గంగడోలు వైశాల్యాన్ని, నడుము పుష్టిని వేనోళ్ల పొగడుతున్నారు. కొందరు ఆబోతుకు జన్మనిచ్చిన ఆవును కోడెను గురించికూడ మాట్లాడుకుంటున్నారు. తిరణాలలో ఉన్న ప్రతిఒక్కడూ ఆబోతునుగురించి తనకూ కొంత తెలుసునని చెప్పుకోవడంలో గొప్పదనం పొందుతున్నారు.

మిత్రులతోబాటు తిరణాళ్ల కొచ్చిన రామదాసుకు ఆబోతును చూడాలన్న ఉబలాటం ఎక్కువయింది.

వలయాకారంగా ఉన్న మైదానం చుట్టూ జనం గుమికూడారు. కొందరు దాపునఉన్న మర్రిచెట్టు నెక్కి కొమ్మలమీద కూర్చున్నారు. కొందరు కుర్రకుంకలు పోలేరమ్మ గుడిమీది కెక్కడానికి ప్రయత్నించారు గాని, పెద్దలు వారిని వారించి, 'అమ్మోరి గుడిమీది కెక్కుతార్రటా. యదవల్లారా. కళ్లూ, కాళ్లూ ఉంటవా ?' అంటూ మందలించి వెనక్కు లాక్కొచ్చారు.

ఆబోతు మైదానంవద్దకు కొనిరాబడింది. ఉత్సవాల అధ్యక్షుడు పందానికి ప్రారంభోత్సవం చేశాడు. ఒక బంగారు పతకాన్ని పసుపుపచ్చని పట్టు బట్టలో మూటగట్టి ఎద్దుకొమ్ముకు వ్రేలాడదీశారు. 'చేవగలవా రెవరైనాసరే ఆబోతు మైదానాన్ని మూడుసార్లు ప్రదక్షిణంచేసేలోపల ఎదిరించి కొమ్ములకు వ్రేలాడుతున్న బహుమతిని తీసుకోవచ్చు' అని ప్రకటించబడింది. ఎద్దుకు ఉన్న దారాలన్నింటినీ కోసివేసి మైదానంలోకి వదిలారు. ఇరువైపుల డప్పులు, బాకాలు మ్రోగుతుండగా ఆబోతు మైదానంలోకి దుమికింది.

జనంలో సంచలనం బయలుదేరింది. ఒకరి భుజాలపై మరొకరు నిక్కి చూడసాగారు. ఆబోతుయొక్క సన్ననినడుమును, భారీరొమ్మును చూసి ఈ యేడాది బంగారుపతకం ఎవ్వరికీ లభ్యం కాదనుకున్నారు.

ఆబోతుకాళ్లకు గజ్జెలు కట్టబడి ఉన్నాయి. గజ్జెలు ఘల్లుఘల్లుమంటూ ఉండగా అది ఠీవిగా మైదానం చుట్టూ నడవసాగింది. నడుస్తున్నపుడు దాని ఎత్తయిన గోపురం అటుఇటు కదలాడసాగింది. ఆబోతు తమను సమీపించినప్పుడు జనం తమకు తెలియకుండానే అలలవలె వెనక్కుతగ్గసాగారు.

ఆబోతు మైదానాన్ని రెండుసార్లు ప్రదక్షిణం చేసింది. దాని నాపడానికి ఎవరూ ముందుకు రాలేదు. ఈ చివరనున్నవారు ఆ చివరనున్నవారిని, ఆ చివరనున్నవారు ఈచివరనున్నవారిని ఆశాదృక్కులతో చూడసాగారు. ఇక ఒక్కప్రదక్షిణ మిగిలి ఉన్నదని సూచిస్తూ డప్పులు మ్రోగించారు. ఆ శబ్దం ఈజనసముదాయంలో మగధీరుడెవ్వరూలేరని చాటుతున్నట్లనిపించింది. ఆ ఛాలెంజిని ఎదుర్కోవాలనిపించింది రామదాసుకు. చొక్కా బనీను తీసి ప్రక్కనున్నవాడి చేతిలో పెట్టాడతడు. పంచెను గొచిపోసి కట్టాడు. ఆబోతు మూడవ ప్రదక్షణానికి బయలుదేరడానికి సిద్ధంగా ఉంది. రామదాసు కుప్పిం

ఎగిసి దుమికాడు మైదానంలోకి. జనమంతా తలలు తిప్పి చూశారు. నూనూగు మీసాలవాడొకడు తొడలు చరుస్తూ ఉన్నాడు. రంగంలోకి ప్రవేశించిన ఎదిరిని క్షణకాలం కళ్ళు పెద్దవిచేసి చూసింది ఆబోతు. తరువాత మోరవాల్చి విపరీతంగా బుసలుకొడుతూ ముందు కురికింది. అది బుసలుకొడుతూ ఉండగా నేలమీది ధూళి పైకిలేస్తోంది. శరవేగంతో అది రామదాసును సమీపించింది. అతడు ప్రక్కకు తప్పుకుని దాని మెడను కరచుకున్నాడు. దానిమెడ సువిశాలమైంది. అది రామదాసు చేతులకు అబ్బలేదు. అతడు పట్టు చిక్కించుకోడానికి ప్రయత్నిస్తున్నాడు. ఇంతలో ఆబోతు పెద్దగా ఛీత్కారంచేసి మెడ విసిరింది. రామదాసు పట్టుదప్పి నాలుగుబారల కవతల జనం కాళ్ళ వద్ద పడ్డాడు. అక్కడున్న జనం భయంతో వెనక్కు తగ్గారు. రామదాసు రొమ్ముమీద చీరుకుపోయింది. అతడు తలెత్తి చూశాడు. పట్టుబట్ట ఎండలో తళ తళ మెరుస్తూ ఉంది. ఆబోతు గర్వంతో మెడపైకెత్తి కాలితో నేలపై గీరుతూంది. రామదాసు పళ్ళు పటపట కొరికాడు. అతడు లేచి నిల్చున్నాడు. నడుమువద్ద కీలు బెణికినట్లయింది. అతడు లేచి నిలుచోవడంతో ఆబోతు మళ్ళీ బుసలుకొడుతూ, కొమ్ములను అతని రొమ్ముకేసి గురిచూసి, ముందుకు దూకింది. రామదాసు వొడుపుగా ప్రక్కకు వాలాడు. కొమ్ములు గాలిలో ముందుకు దూసుకుపోయాయి. రామదాసు దాని గోపురాన్ని కౌగలించుకున్నాడు. గోపురం కొండకొమ్ములాగ ఉంది. అతనికి పట్టుబాగా చిక్కింది. ఆబోతు రామదాసును క్రింద పడద్రోయడానికి పలువిధాల ప్రయత్నిస్తోంది. ఆబోతుకు గంగవెర్రు లెత్తించడానికి యానాదులు నలువైపుల చేరి డప్పులు మ్రోగిస్తున్నారు. ఆబోతు పిచ్చిపట్టినట్లు మైదానమంతా పరుగిడసాగింది. గోపురం వద్దనుండి మెడమీదికి జరగడానికి రామదాసుకు భయం వేసింది. అతడు గోపురంవద్దనుండే ఒకచేతిని కొమ్ములవైపు చాచాడు. పట్టుబట్ట అందలేదు. ఆబోతు కొమ్ములను వెనక్కు విసిరింది. కొమ్ము తగిలి అతని మణికట్టు విరిగినట్లయింది. చేయి వెనక్కు తీసుకున్నాడతడు.

అతని వొంటిపై చెమట ధారగా ప్రవహిస్తోంది. యానాదులు డప్పులను, బాకాలను తారస్థాయిని మ్రోగిస్తూ, ఆబోతుకు రోషాన్ని కలిగిస్తున్నారు. చుట్టూచేరిఉన్న జనం రక రకాలుగా వ్యాఖ్యలు చేస్తున్నారు.

రామదాసు గోపురంనుండి వ్రేలాడుతూ ఆట్టే సేపు ఉండలేకపోయాడు. అతడు ఒకచేతిని ఆబోతు మూతిచుట్టూ రానిచ్చి మరొకచేతో కొమ్మును పట్టుకొని దానిమెడను విరచసాగాడు. మెడను విరచడం ప్రారంభించగానే అది ప్రక్కకు వాలడం ప్రారంభించింది. చూస్తూండగనే అది దభేల్మని నేల గూలింది. మూరెడు నాలుకను బయటకుచాపి అరచింది. రామదాసు పట్టుబట్టను లాగి పతకాన్ని గాలిలోకి ఎగురవేసి పట్టుకున్నాడు.

ఆ విధంగా అతడు మరి రెండేళ్ళు వరుసగా ఎద్దు పందేలలో విజేత అయ్యాడు. తరవాత అతనికి పెళ్ళయింది. ఆమె చలాకీ అయినది. ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ ఉండేది. ఆమె సమక్షంలో అతనికి రోజులెలా గడుస్తున్నాయో తెలిసేదికాదు. అతడు ఎద్దుతో పోరాడడానికి ఆమె ససేమిరా అనుమతిచ్చేదికాదు. 'మీ పరాక్రమం అక్కడ చూపడం దేనికి ? నావద్ద చూపుతున్నారు చాలదా' అనేదామె నవ్వుతూ.

లారీ పగబట్టిన త్రాచులాగ పరుగిడుతూ ఉంది. తరులను గిరులను దాటుకుంటూ ముందుకు దూసుకు పోతూఉంది.

రామదాసులో అహం చల్లారలేదు. వెనక్కు వాలిపోతూఉన్న తనచేతుల నొకసారి చూసుకొన్నాడతడు. 'ఈ చర్మం ముసలిదై ముడతలు పడి నేమి! ఈ చేతులు కట్టెలైతేనేమి? ఇవే ఒకనాడు మదించిన ఆబోతుమెడను విరిచి కూలద్రోశాయి. ఆనాటి రక్తం పిటిలో ఇంకా ప్రవహిస్తూనే ఉంది.

ఆనాటి చేవ ఎన్నటికీ చావదు' అనుకున్నాడతడు. అతడు రెండు పిడికిళ్లను ఒకటిగా చేర్చి శక్తినంతా కూడదీసుకుని క్లీనరు రొమ్ముమీద పొడిచాడు. 'అమ్మో' అంటూ మూలిగాడు క్లీనరు. వృద్ధుని మెడచుట్టూ ఉన్న అతనిచేతులు పట్టు సడలి పోయాయి. చకితుడై తలతిప్పి చూడసాగాడు డ్రైవరు. రామదాసు మోకాలు మడిచి క్లీనరు నడుముక్రింద పొడిచాడు. క్లీనరు మరోసారి బాధతో మూలిగి క్రిందపడిపోయాడు. రామదాసు పైకి లేవబోయ్యాడు. డ్రైవరు తన కాళ్లవద్దనున్న ఇనుప కడ్డీనితీసి రామదాసు నుదుటికేసి విసిరాడు. అతడు మళ్లీ వెనక్కు పడిపోయాడు. కణతవద్ద రక్తస్రావం ప్రారంభమయింది. ఈలోగా క్లీనరు పైకి లేచాడు. అతడు రెట్టించిన క్రౌర్యంతో రామదాసు మీద విరుచుకు పడ్డాడు. మోకాలితో అతని డొక్కలో పొడిచాడు. వృద్ధుని ప్రాణం ఆర్చుకు పోయింది. అతని రొమ్ముమీద పిడిగుద్దులు వర్షిస్తున్నాయి. రొమ్ము ఎముకలు విరిగిపోతున్నట్లు విపరీతంగా బాధపుడుతూఉంది. అతడేమాత్రం ప్రతిఘటించలేక పోతున్నాడు.

ఆబోతుతో పోరాడి గెలిచిన తనదేహం పేడపురుగులాంటి క్లీనరుక్రింద పిప్పి అయిపోతున్న వైనం తలచుకుని రామదాసు సిగ్గుపడ్డాడు.ఆనాటి తన శరీర పటుత్వాన్ని వయసు హరించివేసిందంటే అతడు నమ్మలేక పోతున్నాడు. తన శరీరమే తనకు ద్రోహం చేస్తున్నట్లనిపిస్తూం దతనికి. తనెంతటి వీరుడైనా కావచ్చు. ఎంతటి బలాఢ్యుడైనా కావచ్చు. కాని వయసు ఉడిగినప్పుడు పసిపాపకంటె బలహీనుడే. ఇది సృష్టిధర్మం. విశ్వంతో సృష్టి నియమాలకు లొంగని దేది?

రామదాసు కన్నులలో దైన్యం కదలాడింది. అదిచూసి క్లీనరు మరింతగా విజృంభించాడు.

రోడ్డుకడ్డంగా ఏరొకటి పారుతూ ఉంది. నీటి అంచువద్దకువచ్చి లారీ ఆగిపోయింది. ఈ ఏరు ఇంత నిండుగా ప్రవహించడం డ్రైవరు కనీ విని యెరుగడు. 'ఎగువన ఎక్కడో భారీవర్షాలు పడినట్లున్నాయి. నాలుగైదు చెరువులకు గండ్లుపడి ఉండవచ్చు' అనుకున్నా డతడు. లారీని నీటిలోనికి దించటానికి అతనికి ధైర్యం చాలలేదు. ధైర్యం చేసి దించితే సగం ఏట్లోకి వెళ్లాక లారీ కదలనని మొరాయిస్తుంది. ఏరు తగ్గేంతవరకు గట్టుమీదే ఉండడం అతనికి ఇష్టంలేదు. పైగా ఏరు తగ్గడానికి కొన్నిరోజులు పట్టవచ్చు. ఇంజన్‌ను ఆపుచేసి తలబయటపెట్టి చూశాడతడు.

చిమ్మచీకటి. నక్షత్రాలకాంతిలో ఏరు నురగలు కక్కుతూ ప్రవహిస్తూఉండడం కనిపిస్తూఉంది. ఏరు హోరుమని శబ్దం చేస్తూఉంది. ప్రక్కన రెండు మామిడితోటలు ఉన్నాయి ఆ తోటలమధ్య సన్నని కాలిబాట ఉంది. కాలిబాట గుండా ఎవరో లాంతరు పట్టుకుని వస్తూండడం కనిపించింది. అతన్ననుసరించి మరో పదిమంది వస్తున్నారు. వాళ్లంతా దృఢదీర్ఘశరీరుల్లాగా ఉన్నారు. వారిచేతులలో బాణా కర్రలున్నాయి.

డ్రైవరు భయపడిపోయాడు. 'వీళ్లెవరో ఘరానా దొంగల్లాగ ఉన్నారు. లారీని దోచుకోవడానికై వస్తున్నారు.' అనుకున్నా డతడు.

ఇంతలో వాళ్లు లారీని సమీపించారు. డ్రైవరు కాబిన్‌లో వెలుగుతుండిన లైటును తీసివేశాడు. లోపల జరుగుతున్న హత్య కనిపించకుండా ఉండేందుకు తలుపుపైనఉన్న మైనపుపట్టాను క్రిందకు దించేశాడు.

లాంతరు పట్టుకుని ఉన్నతడు 'ఏందయ్యా డ్రైగోరా. బండిని తొయ్యాలా ?' అనడిగాడు.

'హమ్మయ్య. వీళ్లు హంతకులుకారు' అనుకుని తలబయటపెట్టాడు డ్రైవరు.

వాళ్లంతా దృఢకాయులు. వాళ్ల శరీరాలరంగు చీకటిలో కలిసిపోతూఉంది. వాళ్లలో కొందరు పిల్లలు కూడ ఉన్నారు.

'ఏరు చాల లోతుగా ఉందా?' అనడిగాడు డ్రైవరు.

'నిన్న ఆడుండే మైళ్రాయి కనిపిస్తాండె. ఇప్పుడది పూర్త మునిగిపోనాది.' అన్నాడొకడు కర్రతో ఏటిలో ఎక్కడో చూపుతూ.

'ఐతే ఇప్పుడు నీటిలోకి దిగడం ప్రమాద మన్నమాట.' అన్నాడు డ్రైవరు.

'పరవాలేదు. మేవంతా యెనకుండి తోస్తా మంటే లారీ తేలిగ్గా అవతలగట్టు సేరుకుంటది.' అన్నాడు మరొకడు.

'సరైతే నేను ఇంజన్ స్టార్టు చేస్తాను. మీరంతా వెనకనుండి తొయ్యండి.'

'ఊరికే నంటావా? ఇరవై రూపాయ లియ్యాల.'

'ఇరవై రూపాయలా?'

'ఆఁ—ఇరవై. లారీకి ఇరవై, కారుకైతే ముప్పై. ఇదే ఈడ నికార్సుబేరం.' అన్నాడొకడు బాణాకర్రను నేలమీద పొడుస్తూ.

బేరమాడుతూ కూర్చోవడం డ్రైవరుకు ఇష్టంలేదు. అలా బేరమాడుతూ ఉంటే వాళ్లలోని ఒక కుర్రాడు గబుక్కున ఫుట్‌బోర్డుమీదెక్కి లోపల జరుగుతున్న హత్యను చూసెయ్యవచ్చు. డ్రైవరు జేబులో చేయివేసి రెండు పదిరూపాయల నోట్లను తీసి లాంతరుపట్టుకునిఉన్నవాడి చేతిలో పెట్టాడు. వెంటనే వాళ్లందరూ గట్టిగా కేకలువేస్తూ వెనక్కు వెళ్లి లారీని నీటిలోకి తొయ్యడం ప్రారంభించారు. డ్రైవరు ఇంజన్‌ను స్టార్టుచేసి లారీని బయలుదేర దీశాడు. వాళ్లు ఏదోలొల్లాయి పదాలు పాడుకుంటూ లారీని తొయ్యసాగారు. లారీ మెల్లగ నీటిని కోసుకుంటూ అవతలిగట్టు చేరుకుంది.

ఏరు దాటుకున్నాక లారీ మళ్లీ వేగం పుంజు కుంది.

'ఎంతసేపురా మస్తాన్. ? పసపాకం అడవి వచ్చేసింది.' అన్నాడు డ్రైవరు ముఖంమీద అసహ నాన్ని ప్రదర్శిస్తూ.

'ఏం చెయ్యమంటావు భాయ్. మొండిప్రాణం. ఒకపట్టాన చావడంలేదు.' అన్నాడు క్లీనరు.

క్లీనరు తన బొటనవ్రేళ్లను వృద్ధుని పీక మీద పెట్టి నొక్కసాగాడు. రామదాసు మెడమీద రక్తనాళాలు పొంగుతున్నాయి. అతని కనుగ్రుడ్లు పైకి ఉబికి వస్తున్నాయి. ముఖం పాలిపోతూఉంది. ప్రాణవాయువులు తనదేహాన్ని ఇక కొద్దిక్షణాలలో వీడిపోనున్నాయని అతనికి అవగాహనమయింది. అతడు మును పెప్పుడూ చూడని కొన్నిరంగులు అతని కళ్లకు గోచరిస్తున్నాయి. మును పెప్పుడూ వినిపించని శబ్దాలు వినిపిస్తున్నాయి.

ఈ ఆఖరిక్షణాలలో ఇహలోక సంబంధమైన ఆశ ఒకటి అతని తలలో మెదిలింది. పూలు తురిమిన సిగతో, కాటుకదిద్దిన కళ్లతో, పారాణి నలదిన పాదాలతో—పెళ్లికూతురు రూపంలో తన కూతురును చూడగలగడం ఎన్నిజన్మలకో.

అమ్మముఖం చూడనోచుకోని ఆమెకు తల్లీ తండ్రితానే అయి పెంచి పెద్దజేశాడు. ఏ లోటూ రాకుండా పెంచి పెద్దజేశాడు. తీరా పెళ్లిరోజునవే ఆమెను దుఃఖసాగరంలో ముంచి పోతున్నాడు. 'పుడుతూ తల్లిని మింగింది. పెళ్లిచేసుకుంటూ తండ్రిని మింగింది' అంటూ బంధు మిత్రులామెను కాకుల్లాగ పొడుస్తారు. ఆమె తన మృతదేహంపైన బడి వెక్కివెక్కి ఏడుస్తుంది. డొక్కలెగిరెగిరి పడేలాగ ఏడుస్తుంది. గుండెపగిలేలాగ ఏడుస్తుంది.

తన జేబులోని నాలుగువేలు ఆమెకై నిర్దేశింప బడినవి. అందులోని ప్రతిపైసా తన కష్టార్జితమే. తాను తన ముప్పైయ్యవయేట ఉపాధ్యాయ వృత్తిని చేపట్టాడు. ఉదయం లేచింది మొదలు సాయంత్రం వరకు బడిలో పిల్లలకు విద్యాదానం చేసేవాడు. అర్థంకాని పాఠాలను వినుగనుకోకుండా మరీమరీ చెప్పేవాడు. ఎప్పుడుగాని పై అధికారులు అతనిబడిలో లోపాలనెత్తి చూపడం జరగలేదు. తాను రిటైరయి నప్పుడు జిల్లాపరిషత్తులో పలుకుబడి కలిగిన కొందరు

న ఉద్యోగకాలాన్ని పొడగించుకొమ్మని, అందుకు తాము పూర్తిగ సహకారాన్నిస్తామని ముందుకు వచ్చారు. కాని తానే నిరాకరించాడు. సమర్థులైన యువకులు నిరుద్యోగులై అలమటిస్తుండగా, వయో భారంతో అసమర్థుడైన తను పదవిని దుర్వి వియోగం చేయడం న్యాయం కాదనిపించింది.

ముప్పైయేళ్ళుగ నీతినియమాలను అంటి పెట్టుకుని శ్రమించి సంపాదించిన సొమ్మిది. అది ఒక్కసారిగా ఈ దుండగుల కైవసం కావలసిందేనా? ఈ దౌర్జన్యం ఇలా కొనసాగ వలసిందేనా? దీనిని ఆపగల దక్షులే లేరా? కళ్ళముందు జరుగుతున్న ఒక దుర్వ్యవస్థను నివారించలేని నిస్సహాయస్థితిలో పడి ఉండడంకన్న ఘోరమైన శాపమేమిటి? దౌర్జ న్యానికి తలవొగ్గుతూ వచ్చినవాడికి ప్రాప్తించేది ఘోరమైన నరకం కాక మరేమిటి? అయ్యో భగవంతుడా? ఈ శాపాన్ని నాకెందుకిచ్చావు? ఆ నర కంలో నన్నెందుకు పడవేస్తావు?—ఈ ఆక్రందనలు అతని హృదయకుహరంలోనే సుళ్ళు తిరుగుతూ ఇంకిపోతున్నాయి.

రామదాసుకు శ్వాస ఆగిపోతున్నట్లు, గుండె నిలిచిపోతున్నట్లు అనిపించింది. తను ఈ లోకాన్ని వీడిపోయే తిప్త సమీపించింది.

అతని కళ్ళలో నీళ్ళు నిలిచాయి. కాబిన్ పైభాగాన వెలుగుతున్న నీలిరంగు నియాన్ బల్బు కన్నీటి పొరగుండా గజిబిజిగా కనిపించింది. బల్బు క్రిందనున్నపటం అస్పష్టంగా కనిపిస్తోంది.ఆ పటంలో కృష్ణభగవానుడు చిరునవ్వుతో, చిన్ముద్రతో నిలిచి ఉన్నాడు. అర్జునుడు కృపణుడై కింకర్తవ్యతా మూఢుడై మోకరిల్లి ఉన్నాడు. అక్కడ భగవద్గీత అవతరిస్తూ ఉంది.

రామదాసు భగవద్గీతను కొన్నేళ్లబట్టి పారా యణం చేస్తున్నాడు. అనునిత్యం కొన్ని శ్లోకాలను భక్తితో పఠించిడం అతని నిత్యకృత్యాలలో ఒకటి. ఆ పవిత్ర శ్లోకాలను పఠించేటప్పుడు అతని మనసు అనిర్వచనీయమయిన అనుభూతులను పొందుతుంది.

భగవద్గీతలోని పుటలు రెపరెపలాడుతూ అతని కళ్లముందు కదులుతున్నాయి. ధర్మక్షేత్రమగు కురుక్షేత్రములోని వీరుల కలకలనాదం అతనికి విని పిస్తోంది. దివ్యస్వరమొకటి దిక్కులు నిండుతూ అతని కర్ణరంధ్రాలను సోకింది'—'నేనే పౌరుషాన్ని. బొందిలో ప్రాణమున్నంతవరకు పౌరుషాన్ని విడనాడని వీరుడే నా సాన్నిధ్యాన్ని పొందగలడు. వీరుడు అప కీర్తికన్న మరణాన్నే కోరుకుంటాడు. ప్రాణంకోసం శత్రువును అర్థించడానికిగాని, కీర్తిపోయిన పిదప జీవించడానికిగాని వీరుడు వొల్లడు. వీరుడులేని సీమ లోనే అవినీతి ప్రబలుతుంది. పిరికివారే అవినీతికి రాజపోషకులు. శిష్టరక్షణ దుష్టశిక్షణలే నా నిత్య వ్యాపారాలు. నేనే కర్తను. నీవు నిమిత్తమాత్రుడవై వర్తించు.'

అదిగో—శ్రీకృష్ణుడు పాంచజన్యం పూరిస్తు న్నాడు. ఆ చప్పుడు సంకులమై భూమ్యంతరిక్ష ములు నిండునట్లు ప్రతిధ్వనిస్తూ పాపుల హృద యాలను బద్దలు చేస్తోంది. ఆ శంఖనాదం తనకై నిర్దేశింపబడినది.

రామదాసు తటాలున చేయిచాచి స్టీరింగును దొరకబుచ్చుకున్నాడు కళ్ళుమూసుకుని ఆ చక్రాన్ని గిరగిరతిప్పివేశాడు.

లారీ తారురోడ్డును వదిలి ప్రక్కనున్న అగాధమైన లోయలో లీనమైపోయింది.

ఆకాశాన్ని పాయలు పాయలుగా చీలుస్తూ ఉరిమింది. భూనభోంతరాళాలను బద్దలు చేస్తూ ఉరిమింది.

అడవిలో మహావృక్షాల కొమ్మలమీద సుఖనిద్ర చెందిఉన్న పికసంతానం నిద్రలేచి భీతిల్లి కకావికలై ఎగురసాగింది. వేటకోసం సంచరిస్తున్న వన్యమృగాలు ఎక్కడివక్కడ ఆగి క్షణకాలం చెవులు రిక్కించి విని పరుగు ప్రారంభించాయి.

* * *

అరుణోదయమయింది. బాలభానుని అరుణ కిరణాలు కిటికీగుండా ప్రసరించి బెడ్‌మీదమున్న

రామదాసును స్పృశించాయి. అతడు కళ్లుతెరచి లేచి కూర్చున్నాడు. అతని రొమ్ముమీద, తలమీద కట్లు కట్టిఉన్నాయి. మంచంప్రక్కన నిలుచుని నర్సు ఏదో రాస్తూంది. అతడు లేవగానే ఆమె తలెత్తిచూసి చిరునవ్వు నవ్వింది.

'ఎలాఉంది తాతా?' అంటూ ఆమె దగ్గర కొచ్చింది.

'నాకేం ఫరవాలేదమ్మా. మరి నేను రాత్రి ప్రమాదంలో చిక్కుకున్నానుగదా—' అన్నాడతడు, గతరాత్రి జరిగిన దానిని గుర్తుకు తెచ్చుకుంటూ.

ఆమె నవ్వుతూ, 'అవును. ఆ ప్రమాదంలో లారీ పూర్తిగ కాలిపోయింది. లారీ దాపున నువ్వు స్పృహతప్పి పడి ఉండగా తీసుకొచ్చి ఆసుపత్రిలో చేర్చారు. నీ జేబులో నాలుగువేల రూపాయల రొక్కం కూడ ఉన్నదిట. దాన్ని పోలీసులు స్వాధీన పరచుకున్నారు' అంది.

'మరి నాతోబాటు ఇద్దరు వ్యక్తులున్నారే—వారేమయ్యారు?'

'పాపం వారిద్దరూ ఆ మంటలలో కాలిపోయారు. ముఖాలు గుర్తించలేనంతగా మాడిపోయాయి' అందామె సానుభూతిగా. తరవాత ఆమె కాగితాలను మంచానికి తగిలించి, 'నీకోసం పోలీసులు ఇప్పటికే రెండుసార్లు వచ్చివెళ్లారు. వాళ్లు సూపరింటెండెంటుగారి గదిలో ఉన్నారు. నేను వెళ్లి వారిని పంపుతాను. వాళ్ళు రాత్రి జరిగిన లారీప్రమాదాన్ని గురించి నిన్ను అడుగుతారు. నీకు తెలిసిన వివరాలు చెప్పు' అని వెళ్లిపోయింది.

మరి కొంతసేపటికి సబిన్స్పెక్టరు మరి కొందరు పోలీసు అధికారులు వచ్చారు. వస్తూనే వారు ప్రశ్న లడగడం మొదలుపెట్టారు.

'నీపేరేమిటి తాతా?'.

'రామదాసండి.'

'ఏవూరు?'.

'వొంటిల్లు.'

'రాత్రి ఈ ప్రమాదం ఎలా జరిగిందో చెప్పగలవా?'.

'మరేనండి, బయలుదేరేటప్పుడే డ్రైవరు ఒక సీసా పట్టిచ్చాడండీ. నేనడిగితే తనకది అలవాటేనని, ఎంతతాగినా నిషా ఎక్కదని—అన్నాడండి. తీరా వనపాకం అడవిలో కొచ్చేసరికి కైపు తలకెక్కి చేతులొదిలేశాడండీ—'

రామదాసు చెప్తూకు పోతున్నాడు. ఇన్స్పెక్టరు టపటప రాసుకుంటున్నాడు. మిగిలినవారంతా నోర్లు తెరచుకుని ఆసక్తిగా వింటున్నారు. ఇందరిని మభ్యపెడుతూ తను అబద్ధం చెబుతున్నందుకు రామదాసు కించపడలేదు. పాపపరిహార మేమిటో భగవంతుడే నిర్ణయించి విధించాడు. మధ్య కలుగజేసుకోవడానికి తానెవడు—అనుకున్నా డతడు.

(అయిపోయింది)

తిలక్ కవిత్వ తత్త్వం

శ్రీ కాళూరి హనుమంతరావు

తిలక్ కవిత్వం గురించి ఇటీవల కొన్ని వ్యాసాలు వచ్చాయి. కాని నేను చూసినంతవరకూ ఎవరూ అతని ఛందోబద్ధ కవిత గురించి వ్రాయలేదు. బహుశః 'అమృతం కురిసిన రాత్రి'లోని కవిత్వంతో విమర్శకులు సమ్మోహితులై అతని ఛందోబద్ధ కవిత్వం గురించి ఆలోచించ లేదనుకొంటాను.

'అమృతం కురిసిన రాత్రి'లో తిలక్ కవిత్వం సర్వతోముఖంగా ప్రకాశించింది. శృంగార ప్రణయాలూ, మానవుని దైన్య విషాదాలూ, సాంఘిక రాజకీయ పరిస్థితులూ సమస్తం దానిలో శైలీ వైవిధ్యంతో వర్ణితమయింది. వీటికి తోడు చమత్కారం, హాస్యంకూడా. వీటన్నిటి కలయికతో 'అమృతం కురిసిన రాత్రి' పఠితకు షడ్రసోపేత భోజనంవలె సంతృప్తి నిస్తుంది. పోతన కవిత్వం భావనాశక్తిచేత కవిత్వ మర్మజ్ఞులనూ, శబ్దాడంబరం చేత సామాన్య పఠితలనూ ఆకట్టుకొన్నట్లు 'అమృతం కురిసిన రాత్రి'లో తిలక్ కవిత్వం భావనతోనూ, రాజకీయాల చెళుకుల తోనూ చమత్కారోక్తులతోనూ అందరినీ అలరిస్తున్నది.

భావ కవిత్వం, ప్రజాకవిత్వం, ప్రాచీనకవిత్వం వీటన్నిటిలోనూ తిలక్ ప్రభావితుడయాడు. వీటన్నిటి సమ్మేళనమే అతని కవిత్వం. ఈ సమ్మేళనం వలన అతని కవిత్వానికి చేకూరిన గొప్పమేలు—వీటి మంచి గుణాలేతప్ప చెడ్డగుణాలు దానికి పట్టకపోవడం. తిలక్ సామాన్య ప్రజల సమస్యలను చిత్రిస్తాడు, కాని ఇతర అభ్యుదయ కవులవలె కవిత్వాన్ని రాజకీయాలకి ప్రసారయంత్రం చెయ్యడు. భావకవిత్వ ప్రభావంచేత లలిత సుందరమైన భావననీ ఊహనీ శైలినీ అలవరచుకొన్నాడు. కాని సిసలైన భావకవి వలె తలాతోకాలేని ప్రణయాన్ని ఊహించడం, 'ప్రేమకంటే ఎక్కువేముందిరా?' 'ప్రేమించు ప్రేమకై' అంటూ ప్రేమగురించి తత్త్వాలబాణీలో అమాయికంగా పాడడం ఇతడు చెయ్యడు. ఇతని కావ్యనాయికలు 'పృథు వక్షోజనితంబ భారలై యౌవన ధనుస్సుల్లా వంగిపోతారు. ఇటువంటి చోట్ల ఇతనిలో సాంప్రదాయిక కవిత్వ ప్రభావం గోచరిస్తుంది. సాంప్రదాయిక కవిత్వం, భావకవిత్వం, ప్రజాకవిత్వం అన్న మూడిటిలోనూ ఏ ఒక్కదానిలోనూ ఊబిలో కూరుకు పోయినట్లు కూరుకుపోకుండా తక్కిన రెండిటి ప్రభావాలూ అతణ్ణి రక్షించాయి. ఈ మూడిటి సత్ప్రభావంచేతా మంచి భావనాశక్తిసంపన్నుడైన తిలక్ ఉత్తమశ్రేణి కవి కాగలిగాడు.

తిలక్ కవిత్వంగురించి విమర్శకులలో ఒక ముఖ్యమైన అభిప్రాయభేదం కనిపిస్తుంది. 'Palpable design వల్ల కళ ఎప్పుడూ పరిమితమూ సంకుచితమూ అయిపోతుంది' అని తిలక్ సోమసుందర్‌గారికి వ్రాసినలేఖలో తన అభిప్రాయం వ్రాశాడు. 'నా కవిత్వం అన్న ఖండికలో—నా కవిత్వం కాదొక తత్త్వం—అని మొట్టమొదటి పంక్తిలోనే స్పష్టం చేశాడు. 'తిలక్‌మీద ఏ ఆధునిక రాజకీయ సిద్ధాంతమూ ప్రబలమైన ముద్ర వెయ్యలేదు. అతని సునిశితమేధ దానికి కారణం కావచ్చును.' అని పిలకా గణపతిశాస్త్రిగారన్నారు.*

తిలక్ తనకు వ్రాసిన లేఖలో వ్యక్తం చేసిన కళను గురించిన అభిప్రాయాన్ని సోమసుందర్ గారిట్లా విమర్శించారు— 'కథలలో ఒకసిద్ధాంతాన్ని ప్రతిపాదించడానికో బలపరచడానికో చేసిన

* తిలక్ స్మారక సంచిక. ఆనందవాణి.

ప్రయత్నం కథాశిల్పంలో ముఖ్యదోష మంటాడతను; కథల శక్తిని అనుభవించకుండా చేస్తుందంటాడతను. Paipable design వల్ల కళ ఎప్పుడూ పరిమితమూ సంకుచితమూ అయిపోతుంది, అంటాడు అతను—కాని యిది ఎట్లా? ప్రపంచ సాహిత్యమంతా ఏదో ఒక సిద్ధాంతానికి ఏదోవిధంగా కట్టుబడి ఉన్నదేతప్ప అన్యం కానరాదు. ఈ సత్యం అతనికి మాత్రం తెలీదా! కాని ప్రచారం కేవలం పేలవంగా సాక్షాత్కరించడం కళ పుష్టికి భంగం కలిగిస్తుందని అతని అభిప్రాయమయితే పేచీ లేదు. కాని కళ బొత్తిగా నిరంజనంగా ఏ సిద్ధాంతాల జోలికీ పోకుండా మడికట్టుకు కూర్చోవాలీ అంటే అది ప్రేతకళ అవుతుంది' అని. ఈ అభిప్రాయ విభేదం చర్చనీయం.

సాహిత్యమంతా భావమయమైనదే తప్ప సిద్ధాంత చర్చాత్మకమైనదికాదు. అంటే, ఏదో ఒక రాజకీయమో, సంఘసంస్కరణపరమో, తాత్త్వికమో అయిన సిద్ధాంతాన్ని ప్రచారం చెయ్యడానికి రచించే సాహిత్యం పఠితల మేధను తృప్తిపరచవచ్చును గాని హృదయాన్ని కదపలేదు. ఆయాసిద్ధాంతాలను ఆమోదించేవారు ఒక్కొక్కప్పుడు వాటిని ఉత్తమ సాహిత్యమని భ్రమించగా, ఆమోదించనివారు దాన్నంతాతుక్కు కింద జమకడుతూ ఉంటారు. ఏ విమర్శకులైనా సరే సాహిత్యం కేవల ప్రచారసాధనం కాదనీ, దానిలో 'కళాపుష్టి' ఉండాలనీ ద్వితీయాలోచన లేకుండా అంగీకరిస్తారు.

కాని, 'ప్రపంచ సాహిత్యమంతా ఏదో ఒక సిద్ధాంతానికి ఏదోవిధంగా కట్టుబడి ఉన్నదేతప్ప అన్యం కానరాదు' అన్న సోమసుందర్‌గారి అభిప్రాయం వాస్తవమే. మన ప్రాచీనులు కూడా సంఘ శ్రేయస్సుకొరకే సాహిత్యమని ఘోషించారు. ఏదో ఒక సిద్ధాంతానికి కట్టుబడి సంఘశ్రేయస్సే ప్రయోజనంగా ఉత్పన్నమవుతున్న సాహిత్యంలో కళాపుష్టి ఎలా కలుగుతున్నది అన్నదొక చిక్కుప్రశ్న వంటిది.

కేవలం ప్రపంచంలో జరిగినవి జరిగినట్లుగా వివరించడం సాహిత్యంకాదు. సమర్థుడైన ప్రతి రచయితకీ జీవితంమీద ఒక అవగాహన ఉంటుంది· ప్రపంచ సంఘటనలను పరిశీలించి వాటిని రచయిత ఈ అవగాహన దృష్టితో సాహిత్యంలో చిత్రిస్తాడు. అందుచేతనే ఒక్కొక్క రచయిత రచనలను చదివితే సర్వత్ర అతడు జీవితంపై ఏర్పరచుకొన్న అవగాహన ప్రత్యక్షమవుతూ ఉంటుంది; మనిషిని ఎక్కడ సూదితో పొడిచినా ఒకేవిధమైన రక్తం ఉబికినట్లు. సమర్థుడైన ప్రతిరచయితా సాధారణంగా ఒకజీవితావగాహనను కలిగి ఉంటాడనేది విశ్వసాహిత్య మంతటా మనం చూడవచ్చును.

మనదేశంలో, రచయితలకు ఇటీవలి వరకూ ఈ జీవితావగాహన అనేది సులభంగా జన్మతః వచ్చేది. పునర్జన్మ, స్వర్గనరకమోక్షాలు, స్వధర్మపాలనం మొదలైన జీవితపు విలువలని వాళ్ళు నిస్సందేహంగా నమ్మి తమతమ సాహిత్యంలో ఆ విలువలని ప్రతిఫలింప జేశారు. ఉదాహరణకు కాళిదాసు జీవిత మరణాలను గురించి—

'మరణం ప్రకృతి శ్శరీరిణాం
వికృతి ర్జీవిత ముచ్యతే బుధైః
క్షణమప్యవతిష్ఠతే శ్వసన్
యది జంతు ర్నను లాభవా నసౌ.'

(రఘువంశం—8—87)

(శరీరధారులకు మరణమే ప్రకృతి; జీవితం తద్వికృతి మాత్రమేఅని బుధులు చెబుతారు. అందుచేత క్షణకాలమైనా ఎవరైనా ప్రాణి జీవించిఉంటే అదే లాభమనుకోవాలి) అంటాడు. ఎంతో విషాదాన్నీ భయాన్నీ కలిగిస్తున్న ఈ తత్త్వాన్ని ఇంత ప్రశాంతంగా కవి చెప్పడం మనకి ఆశ్చర్యం కలిగిస్తుంది· ఇంత నిర్లిప్తంగా కవి చెప్పడానికి అతనికి జన్మతః ఏర్పడిన జీవితావగాహనే కారణం. ఈ జీవిత మరణాలను గురించే షేక్స్పియర్

"..............It is a tale
Told by an idiot, full of sound and fury,
Signifying nothing." (Macbeth. 5, 5.)

అంటూ మహోద్రేకంతో చెప్పిస్తాడు. షేక్స్పియర్‌కి, లేదా ఆ నాటకపాత్రకి జీవితంపై ఏర్పడిన అవగాహన అది. ఇంతటి ఉద్రేకానికి కారణం ఇతడు కాళిదాసువలె జీవిత మరణాలను గురించిన తాత్త్విక ఆలోచనల సంప్రదాయానికి వారసుడు కాకపోవడమే

మనదేశంలోకూడా ఇప్పుడు రచయితలకు జీవితంపై నిర్దిష్టావగాహన ఉండడం దుర్లభమవుతున్నది. ప్రాతనమ్మకాలుపోయి క్రొత్తనమ్మకాలు ఏర్పడని ఈ సంధికాలంలో, సాంఘిక రాజకీయాల కలగాపులగంలో, హఠాత్తుగా పిచ్చెత్తిన పైలట్ అధీనంలోఉన్న విమానంవంటి ప్రపంచంలో నిశిత మేధావంతులకికూడా జీవితంపై విస్పష్టావగాహన ఏర్పడడంలేదు. అది కాలదోషమేతప్ప వారి దోషం కాదు.

తాము ఏర్పరచుకొన్న జీవితావగాహనను రచయిత తన సాహిత్యంలో పాత్రలద్వారా సహజంగా నిరూపించగలిగి ఉండాలి. అలా నిరూపించజాలక, రచయిత రచనద్వారా ప్రతిపాదించదలచిన జీవిత సిద్ధాంతానికీ పాత్రలకీ అంతరం ఏర్పడినప్పుడు ఆ పాత్రలపై రచయిత తన సిద్ధాంతాలను బలవంతంగా ఆరోపిస్తున్నట్లు పఠితకు తెలిసిపోయి, కళాపుష్టి లేక ఆ రచన కృత్రిమమైందనిపిస్తుంది.

ప్రతి రచయితా సాధారణంగా తన కాలంనాటి మత సాంఘికాది విశ్వాసాలనుబట్టే తన జీవితావగాహనను ఏర్పరచుకొంటాడు. మరి, మారేకాలంలో ఈ విశ్వాసాలు మారినప్పుడు అతని సాహిత్యం ఎట్లా సమాదరణీయు మవుతున్నదంటే; సాహిత్యంలో మనం చూసేది కవియొక్క లేదా అతని సాహిత్య పాత్రలయొక్క జీవిత విశ్వాసాలను కాదు; వారి విశ్వాసాలు, వారి మనస్సులలో పుట్టించిన ఉద్విగ్నత, వారి జీవితాలను నడిపించిన తీరు—వారిలో వ్యక్తంచేసిన మానవత్వం—ఇవీ సాహిత్యంలో మనం చూసేవి. అందుచేతనే సాహిత్యం మతసాంఘికవ్యవస్థలకు అతీతమై సార్వజనిక మైనదీ, దేశకాలావధులకు అతీతమై శాశ్వత మైనదీని. శ్రీ శ్రీ గారు ప్రతిపాదించిన రాజకీయోద్యమాన్ని వ్యతిరేకించే పఠితకూడా అతని కవిత్వాన్ని మెచ్చుకోవచ్చును. కారణం అక్కడ రాజకీయ సిద్ధాంతం ముఖ్యంకాదు; ఆ సిద్ధాంతం ఆ కవిలో కలిగిస్తున్న ఉద్వేగం ప్రధానం. మాలవాని జీవితస్థితిని కవి ఆముక్తమాల్యదలో చిత్రించిన విశ్వాసాలూ, జాషువాగారు 'గబ్బిలము'లో చిత్రించిన విశ్వాసాలూ, పరస్పర వ్యతిరిక్తమైనవి. కాని పఠిత రెండిటిలోనూ కవిత్వం అనుభవిస్తున్నాడు. అసలు సాహిత్య పఠనోన్ముఖుడైనప్పుడే పఠిత సాధ్యమైనంతవరకూ మతసాంఘిక రాజకీయాది విశ్వాసాలను దూరం చేసుకొని, అందలి మానవత్వంపై దృష్టిసారించడానికి ప్రయత్నిస్తాడు. అందుచేతనే రాముణ్ణి తప్ప ఇతరుణ్ణి స్పృశింపనైనా ఒల్లని సీతాపాత్ర చిత్రణనూ, ఐదుగురు భర్తలుకల ద్రౌపదీపాత్ర చిత్రణనూ ఒకే భారతీయ పఠిత ఉత్తమ సాహిత్యంగా తలదాల్చ గలుగుతున్నాడు. మతసాంఘిక రాజకీయా ద్యభిప్రాయాలచేత పరిచ్ఛిన్నంకాని మానవత్వం ఎట్లా సాహిత్యంలో విభాసిస్తుందో దీనినిబట్టి మనం గ్రహించగలం. మానవత్వ చిత్రణం కొరవడి, విశ్వాసాలు మాత్రం వివరింపబడిన సాహిత్యంలో కళాపుష్టి లేక సిద్ధాంత ప్రచారంగా పఠితకు తోస్తుంది.

తిలక్ కవిత్వంలో ఒక నిర్దిష్ట జీవితావగాహన కనిపించదు. 'రక్షించు నా దేశాన్ని పవిత్రుల నుండి పతివ్రతలనుండి...శ్రీమన్మద్గురు పరంపరల నుండి' అంటా డొకచోట. ఈ తిలకే సీతాదేవిని గురించి నాలుగు ఖండికలూ, ఊర్మిళనుగురించి ఒక ఖండకావ్యం, వివేకానందస్వామిని గురించి ఒక ఖండికా రచించాడు!

'బరువుగా బెదురుగా
బతుకుతూన్న పీళ్ళ మధ్య
డైనమైట్ పేలాలి
డైనమోలు తిరగాలి'

అంటాడు 'పీడలు' అన్న ఖండికలో చాలా గంభీరంగా. కాని ఎవరు పేలుస్తారు, ఎలా పేలుతుంది ఇత్యాది ప్రశ్నలకు అతడేమీ చెప్పడు. ప్రజల కష్టాలకు తానూ బాధపడి, వాళ్ల దైన్యాన్ని వర్ణించి, సాను భూతి ప్రకటించి, మనలో సానుభూతి కలిగించి తన దారిన తాను వెళిపోతూ ఉంటాడు తిలక్.

'చావు పుట్టుకల మధ్య సందేహం లాంటి
జీవితంలో నలువైపులా అంధకారం
మంచిగంధంలాగ పరిమళించే మానవత్వం
మాకున్న ఒకే ఒక అలంకారం
మజిలీ మజిలీకీ అలసి పోతున్నాం
మలుపు మలుపుకీ రాలిపోతున్నాం
ఆశలవెచ్చనిపాన్పుమీద స్వప్నాలపుష్పాలు జల్లుకొని
ఆదమరచి కాసేపు విశ్రమించడాని కనుమతించు
తండ్రీ.'

అన్న 'ప్రార్థన' అన్న ఖండికలో చివరి పంక్తులలో తిలక్ జీవిత దృక్పథం దొరుకుతుంది. తిలక్ కవి త్వాన్ని మనం ఈ మేరలోనే చూడాలి.

ఒక విస్పష్టజీవితావగాహనకల కవికంఠం ఖంగున మ్రోగుతూఉంటుంది. ఐనా రచయితకి జీవి తావగాహన ఎంతముఖ్యమో సన్నివేశకల్పనం, పాత్ర చిత్రణం, భావనాశక్తీకూడా అంత ముఖ్యాలు. ఒక రచయిత జీవితంపై నిర్దిష్ట సిద్ధాంతాలను ఏర్ప రచుకొన్నా, ఇవి కొరవడితే మంచిరచనలు చెయ్యలేడు. ఇవి పుష్కలంగాఉన్న రచయిత నిర్దిష్టజీవిత సిద్ధాం తాలు లేకపోయినా కొన్నిమంచిరచనలు చెయ్యవచ్చును.

సౌందర్యం, ప్రణయం, కారుణ్యం—ఇవి తిలక్ కవితకు ప్రాతిపదికలు.

'నా అక్షరాలు కన్నీటిజడులలో
తడిసే దయాపారావతాలు
నా అక్షరాలు ప్రజాశక్తుల
నావహించే విజయ ఐరావతాలు
నా అక్షరాలు వెన్నెలలో ఆడుకొనే
అందమైన ఆడపిల్లలు.'

అంటాడు తిలక్. కాని తిలక్ కవిత్వమంతా 1, 3 చరణాలకే ఉదాహరణీయంగా ఉంటున్నదితప్ప మధ్య చరణంలో సూచితమైన లక్షణానికికాదు.

'గోరువంకలు'లో, 'శర్వరీప్రియ'అన్న ఖండికలో తన కవిత్వతత్త్వాన్ని ఇలా ప్రతిపాదించాడు—

'రాసులు రాసులై పొదలు
రక్కొన చీకటిలోన నే నవి
శ్వాసిని సంశయాళువును
సంతతసత్యగవేషణామనః
కౌశికు నట్లు నిర్భితిని
కారుణికమ్ము కవిత్వ మంతరో
ల్లాస విలాసమై వెలుగు
లాజలు జల్లునటన్న ఆశతో.'

అని ఈ మనస్థితిలో నిలిచి నిశితభావనాశక్తితోనూ సుందరశైలితోనూ తిలక్ రచించిన 'అమృతం కురి సినరాత్రి', 'గోరువంకలు'అన్న ఖండకావ్యసంపుటు లలో అనేకఖండికలు అత్యుత్తమకవిత్వంగా పరిగణ నార్హములై ఉన్నాయి.

'గోరువంకలు' తిలక్ రచించిన ఛందోబద్ధ ఖండికల సంపుటి. 1942 నుండి 1966 వరకు 'భారతి', 'ప్రతిభ' పత్రికలలో ఈ సంపుటిలోని చాలాఖండికలు ప్రచురితమయాయి. వచనకవితారచ ననూ ఛందోబద్ధకవితారచననూ తిలక్ సమంగా అభ్యసించి రెండింటిలోనూ గొప్పనైపుణ్యం సంపా దించుకొన్నాడు. వేదుల సత్యనారాయణశాస్త్రిగారి తర్వాత ఇంత మనోజ్ఞంగా వృత్తాలు నడిపినవా రింకెవరూ లేరని చెప్పవచ్చును.

ఈ సంపుటిలో కొన్ని 1942—48 మధ్యలో వ్రాసినవి, తక్కినవి 1958—66 మధ్యలో వ్రాసినవి. 1942—48 మధ్యలో వ్రాసిన పద్యాలలో శైలి రమణీయంగా ఉంటూ, అక్క డక్కడ చక్కనిభావన, మంచి ఊహ తళుక్కున మెరు స్తున్నా మొత్తంమీద ఇవి ప్రగాఢమైన అనుభూతిని కలిగించవు. ఈ పద్యాలలో భావకవిత్వ ప్రభావం

బాగా కనిపిస్తుంది. సుకుమారమైన శైలిలో పద్యాలు సాఫీగా నడిచిపోతూఉంటే పద్యాలలో విశేషార్థ మేమీ కనిపించదు. కొన్ని కొన్ని పద్యాలలో అర్థం చాలా అస్పష్టంగా ఉంది. 'మంచురేకులు', 'గాలిగొంతు', 'పూల కౌగిళులు' మొదలైన భావ కవిత్వ పదబంధాలు చాలా ఉన్నాయి.

'ఓరగ చూచినావు
కలలొత్తిన ఎత్తుల గోరువంకలై
చారుతరోహలాడ
విలసన్నవయౌవనరాజ్యలక్ష్మి ! నీ
ఊరుపు గాలికే
జగము లోసరిలెన్ మరి పాట పాటగా
తీరిచి కొందు నా యెడద
తీయని కోర్కెల తేనె వాకలన్.'

అంటాడు మొదటి ఖండికలో మొదటి పద్యంలో. ప్రణయాన్నీ సౌందర్యాన్నీ తప్ప ఈ ఖండికలలో కవి ఇంకేమీ ఆలోచించడంలేదు.

'ప్రతి తెలివేకువన్ తొలగి రాలెను
తారలు గాజుపూసలై
అతివ కదల్చ కే వయసు
టద్దపు మేడ పునాది గోడలన్'

అన్న పద్య చరణాలు ఈ దశలో ఇతని మనస్థితిని పట్టి చూపుతున్నాయి. కాని అప్పుడుకూడా ఈయన పూర్తిగా భావకవిత్వానికి దాస్యం చెయ్యడంలేదు.

'...........సుగంధ చర్చిత
శ్రీ సురభీ కృతస్తని! సుశీలవతీ!
భవదీయు లేశవత్
భాసిత ఘర్మ శీతలిత
భాసురగాత్ర నిషణ్ణ బుద్ధుడన్.'

అంటాడు.

'స్వయంవర'లో ధనుర్భంగానికి ఉద్యుక్తుడవుతున్న రాముణ్ణి చూసినప్పుడు సీత మనస్సులో మెదిలిన భావ పరంపర బాగా చిత్రితమైంది.

'తొలి తొలి జన్మలందు దయతో
కలలో కనుపించి కన్నులన్
వెలుగులునింపి చేత చెయివాలిచి
ప్రేముడిమీరు బాసటల్
పలికినవాడు నేడిటుల వచ్చెనుగాక
యథార్థమై మరీ
పులకలు ఏమె నా తనువు ముంచును
స్వర్గముదాక సాగుచున్.'

'ఇతడటే పుత్రకామేష్టి యాగఫలమ్మ
దశరథానందనందనవనమ్మ
....
....
ఇతడటే తండ్రి నన్ను నాగేటిచాలు
కదిపి వెలికిదీయకముందె కానుపించె
నేమొగాక లేక జనసమేల నాకు
స్వామికోసముగాక నేనేమికొరకు.'

అని సీత తలపోస్తుంది. వీటిలో మొదటిపద్యం ముగింపులో చటుక్కున మెరస్తున్న భావకవిత్వ ప్రభావం గమనించదగినది.

'సీత—1', 'సీత—2', 'అద్వైతమాన్మథము'అన్న మూడు ఖండికలూ చాలును తిలక్‌ను ఆధునికకవులలో అగ్రస్థానంలో నిలుచోబెట్టడానికి. భావం, శైలి పరిపాకం పొందాయి వీటిలో. ఒక్కొక్క పద్యం చదువుతూఉంటే మన మనస్సు గాఢానుభూతితో పర్యాకుల మవుతుంది.

'రామశబ్దము చాలు రచ్చలో గట్టులో
పులకించనట్టిది పూవులేదు
సీతశబ్దము చాలు సీతువో గ్రీష్మమో
వరదలై పారని వాగులేదు
రామసీతానామ రమ్యనాదము చాలు
కోవెల కానట్టి గుండెలేదు
రామాభిరామ కీర్తనముతో మడియని
స్మయభావమదనిశాచరుడు లేడు...'

అంటాడు కవి.

'ఒక ఉదాత్తగంభీరతా వ్యూహమౌను
రామగాథా సముద్రమ్ము ప్రబల తత్త
రంగతాడితమ్మై గవ్యరహితదిశల
కీడ్వబడిన సరోరుహమ్మేమి సీత !'

అని ఒక్కపద్యంలో సీతారాముల కథా సారాంశాన్ని మనస్సు కోసేటట్లు చెప్పడం ఈ కవికే తగింది.

'సీత—2'లో

'నీ కథ నన్ను నవ్యనవనీతమువోలె గరంచె
భారతాస్తోకచరిత్రలో
విషమ సుందరమున్ కరుణాప్రఫుల్లమున్
ప్రేకదనమ్ము దుస్సహపు వేదనయున్
మిళితమ్ము నొంది ఏ
కైక విషాద నాయికవుగా
జగదీడితవైతి వమ్మరో.'

అని సీతను విషాద నాయికగా చిత్రిస్తాడు.

'అద్వైత మాన్మథము'లో సీతారాముల ఆత్మానుబంధం సీత వాక్కులలో చెప్పిస్తాడు. ఈ సంపుటి కంతటికీ ఈ ఖండిక మకుటాయమానం. ఇందలి ప్రతిపద్యం సానపట్టిన రత్నం.

'నా మదిలోని దీపమవు
నాదు ముదర్ణవ శేషతల్ప
లీలా మధుకైటభారివి.........'

'గగనమువంటి నా బ్రతుకు
గాథల రూపక మందు
చంద్రమస్స్వగతమ వీవు...'

'నా యానందపు మేడలో
మొదటి వీణానాదమై మ్రోగి...'

అంటూ సీత తమ పరస్పరానుబంధాన్ని వర్ణిస్తుంది.

'కనుల కన్నులు నిల్పి కాంచితినేని నీ
దేమి ద్వాదశ సూర్యదీప్తి ముంచు
ననువీడి యడుగిడ నాలోన నిదియేమి
భవమెల్ల కదిలించు బాధ పొంగు
బిగ్గకౌగిలి చేర్చువేళ బ్రతుకు చివ
రల నిదియేమి క్రొన్నలుపు మంట
ప్రేమార నను పేర బిల్వగా నిదియేమి
గగనాన మ్రోగె నక్షత్ర ఘంట
నేను నీలోన నన్ను సృజించు కొనగ
నీవు నాలో లయింతు వెంతేని వింత,
ఇది యపూర్వ క్రమము,సృష్టి మొదలు తుదలు
కలసి కొన్నవి మనలోన కాలమాగి!'

అంటూ తన అనుభూతికి తానే విస్మయ నిమగ్న అవుతుంది సీత. కవిత్వం మనలను పారవశ్య నిమగ్నులను చేస్తుంది.

చివరివరకూ తిలక్ పద్యరచనలో నిరంతర ప్రయోగుడుగా కనిపిస్తాడు. కొన్నియతిప్రాసలులేని పద్యాలు వ్రాశాడు. కొన్నిటిలో యతులేఉంచి ప్రాసలు లేకుండా వ్రాశాడు. కాని చాలావరకూ గణయతిప్రాస సుబద్ధవృత్తాలనే వ్రాశాడు. వీటిలోకూడా అక్కడక్కడ యతిస్ఖాలిత్యాలున్నాయి. తిలక్ బహుశః వీటిని గమనించినా వాటిని రక్షించడంకోసం రస భంగం చెయ్యడం ఇష్టంలేక అలాగేఉంచి ఉండ వచ్చును.

1948 దాకా వ్రాసిన పద్యాలలో ఎక్కువగా తెనుగుమాటల కూర్పు, 1958 తర్వాత వ్రాసిన వాటిలో కొంత అధికంగా సాంస్కృతికశైలీ కని పిస్తాయి. తిలక్‌కి భాషపైకల ప్రభుత్వం గణనీయ మైనది. చిత్రకారుడు రంగులు ఉపయోగించి చిత్రించిన చిత్రంవలె, పూవులతోకట్టిన మాలవలె ఉంటుంది, భాషని చక్కగా ప్రయోగించి అతను రచించిన ప్రతిపద్యం.

ఈ పద్యసంపుటి ఇంకా పుస్తకరూపంలో *ముద్రితం కాలేదు. కవిగా తిలక్ సుప్రథితుడు. ఈ పద్యసంపుటి త్వరలో ప్రకటితమవుతుందని ఆశించుదాం.

---

*శ్రీ మిరియాల రామకృష్ణగారివద్ద ఉన్న తిలక్ 'గోరువంకలు' అముద్రిత ప్రతి ఈ వ్యాసరచనకు ఆధారం. ఈ సంపుటిలో 'గోరువంకలు', 'శిశిరము', 'స్వయంవర', 'ఆవాహన', 'స్నైన్య సుందరి', 'వర్షా', 'దీక్ష', 'మధువిరహము', 'భ్రాంతి', 'శర్వరీప్రియ', 'ఆటవెలది', 'సంగీత వృత్తము', 'సీత—1', 'సీత—2', 'అమృతభావము'అన్న ఖండికలున్నాయి. ఇవికాక తిలక్ రచించిన ఛందోబద్ధ కవితలు 'వివేకానందస్వామి' (భారతి, 1963, జనవరి), 'అద్వైతమాన్మథము' (భారతి, 1966, మార్చి) అన్నవి ఉన్నాయి.

వీరశ్రీనాథము

శ్రీ కె. బాలసుబ్రహ్మణ్యం

"ధర్మక్షేత్రే కురుక్షేత్రే'—గీత.

"ఇది సమరావని యిది పుణ్యభూమి"— పలనాటి వీరచరిత్రము.

'కవిః క్రాంత దర్శీ'యను నానుడిగాని, 'నా వృషిః కురుతే కావ్యమ్' అను నియమముగాని మన తెలుగు కవుల కన్వయించుట క్వాచిత్కమే యనుట సాహసముకాదు. కారణమేమనగా మన తెలుగు కవులలో ముప్పాతిక మువ్వీసము మంది 'క్రాంతి'ని దర్శించినదియు లేదు, ఋషులైనదియు లేదు. సంస్కృత కవులు—లేక ఋషులందరు—దర్శించిన క్రాంతిని అనువదించుటయే తెలుగు కవులు తమ పరమార్థముగా బెట్టుకొనిరి. తెలుగు కవులు తమలో అటనట పొటమరించిన భావుకతా విజృంభణమును తామే యణచుకొని కోతి పిల్లలవలె సంస్కృతము పొట్టను కఱచుకొనియే సంచరించిరి.

వాగనుశాసనుడని పేరు పొందిన నన్నయ్యయు ఈ పద్ధతిని వదలినవాడుకాడు. అసలు నన్నయ్య తెనుగుకవి ఎప్పుడైనాడు? అతడు భారతమును ప్రారంభించినది సంస్కృత శ్లోకముతో. అతని రచనా పద్ధతి అచ్చపు సంస్కృతము. 'దండ తాడితుఁ జేసెదన్' ఇది తెనుగా? అచ్చటచ్చట తెనుగుదనము చూపవలెనని కుతూహల పడినను వెంటనే సమకాలీన పండితులేమనుకొందురోయని భయపడి — ఆంగ్ల విద్యా పరిచితులగు ఆధునికాంధ్రులు ఎదుటి వారే మనుకొందురోయని తెలుగును పరిహరించి ఆంగ్లమును మాట్లాడినట్లు—వెంటనే తెలుగును వదలి సంస్కృతము నాశ్రయించినవాడు. ఇక భావుకత విషయముననో—నానారుచిరార్థము లిచ్చు రమ్యములైన అక్షరములు మాత్రమే తనవియని—కంఠోక్తముగా చెప్పియే యున్నాడు. అర్థములు మాత్రము వ్యాసునివే.

కావున ఆలోచించి చూడగా కవులకు లాక్షణికులు నిర్దేశించిన లక్షణములు తెలుగు కవులలో పదింట తొమ్మిదిమందికి లేదు. తెలుగు కవులందరును గొప్పపండితులు. శబ్దశాస్త్రజ్ఞులు. కొందఱు పదవాక్య ప్రమాణజ్ఞులు. కాని దౌర్భాగ్యమేమనగా మనవారు పై చెప్పిన శబ్దశాస్త్రజ్ఞులను గౌరవించినట్లు అచ్చపు కవులను గౌరవింపరైరి. వసుచరిత్రకుగల ప్రసిద్ధి కళాపూర్ణోదయమునకేదీ? 'గమి కర్మీకృతనైక నీవృతుడనై' అను వాక్యమునకుగల గౌరవము 'వేముల పూసెను వేముల కాసె, కడసారి ఫలములు కాకుల కాయె' అను వాక్యమునకేదీ? మరి తిక్కనకు లభించిన గౌరవము అతని భారతాంధ్రీకరణమును బట్టియా లేక అతని తెలుగుదనమును బట్టియా యనగా అతడు సంస్కృతపు గుఱ్ఱముపై స్వారిచేసిన తెలుగురౌతగుటం బట్టియని చెప్పవలెను.

కవిత్వమునకు ముఖ్యలక్షణమైన భావుకత సంస్కృత కవులయందు సైతము ఎందరిలోకలదు? సంస్కృత కవులలో కొందఱును, ఆంధ్రకవులలో పలువురును తాము జదివిన శాస్త్రముల సారాంశమును, లేదా తాము కొన్ని శాస్త్రముల జదివితిమని సూచించు విషయములను పొందుపఱుచుట యందును, వర్ణ్య వస్తువునకు వన్నె తెచ్చుటకు కొండచుట్టుతిరునాళ్లవంటి ఉత్ప్రేక్షాద్యలంకారము లూహించుట యందును తమ సామర్థ్యమును విని

యోగించిరే గాని ఉత్కృష్ట మనోధర్మ ప్రతిపాదకములగు, భావములనుగాని, చమత్కృతిమత్కృతులగు సంఘటనలు — ఆంగ్ల విమర్శకులు సాధారణముగా డ్రామాఅని పిలుచునట్టివి — గాని సృష్టింపగలిగిన మహానుభావు లెందరు ? ఏ గ్రంథమునందైనను 'కుంభగతప్రదీపకలికా శ్రీ దోప నెందెందు బోకెందే నింద్రియములు సుఖమును గనునో' అట్టి ఒయాసిస్సులు ఒకటి రెండున్నను వానిని కనుగొనుటకు విశాలగ్రంథ మరుభూములయందు పరిభ్రమింపవలసి యున్నది. తెలుగు ప్రతిభ వెల్లి విరియునవియు, తెలుగుదనము నిండినవియు, ఆద్యంతమును హృదయమును ఆకర్షించునవియు నగు కావ్యములు ఒకటో రెండో మాత్రమే తెలుగున నున్నట్లు తోచుచున్నవి. కృష్ణదేవరాయల వంటి ప్రతిభావంతుడు సైతము అతుకులబొంతను కూర్చ గడంగినాడు. పదగుంభనంబునకు పేరువడసిన తెనాలిరామకృష్ణుడు స్థల పురాణముతో తృప్తి వహించినాడు. ఇట్టిది మన సాహిత్యస్థితి.

ఇట్టి ఆంధ్ర సాహిత్య మరుభూములలో పల్నాటి వీరచరిత్ర మొక చలిపందిరి. అది ఆంధ్ర దేశపు కథ. తెలుగుదనము, తెలుగు ఆచారములు, తెలుగు మనస్తత్వములు నిండారిన కథ. అది శ్రీనాథునిచే రచింపబడుట మరియొక విశేషము. తెలుగు భాషకు రాజమర్యాదల నొసంగినవారు రెడ్డిరాజులు. మల్లంపల్లి వారనట్లు రెడ్డియుగము వీరయుగము. వారియాస్థానమువాడు శ్రీనాథుడు. తన కవితా శక్తిని యథేచ్ఛగా వాడుకొన్న స్వతంత్రుడు. హేమ పాత్రమున అన్నముపెట్టిన వానికిని, పునుగు జవ్వాజులను 'సప్లై' చేసిన వానికిని తన మనస్సున కెక్కిన యొక్కొక్కని కొక్కొక్క కావ్యము నంకితము గావించిన ఉదారుడు. జీవితమంతయు వైభవోపేతముగా గడిపి తీయని కలలలో తేలియాడిన అదృష్టశాలి. ఎంతో శృంగార రసమును, కొంత భక్తియు, జిలిబిలి ఏడ్పులతో కూడిన కొంత శోకమును, కొంతమందహాసము పుట్టించు ఈషద్ధాస్యమును అతనికి ప్రియమైనవి.

రాజభోగములలో మునిగి తేలుచుండిన బుద్ధునకు ప్రపంచిన సుఖదుఃఖములు ఒక్కసారిగా గోచరించి మనఃపరివర్తనము గొనివచ్చినట్లు, శ్రీనాథుని స్వప్నమయజగత్తును భగ్నముచేయుచు పలనాటి వీర చరిత్రము అతని కర్ణగోచరమైనది. తొలుత 'చిన్న చిన్న గుళ్ళు, చిల్లర దేవుళ్లు' అనియు, 'జొన్న కలి జొన్న యంబలి' అనియు పలనాడును నిరసించిన శ్రీనాథుడే పలనాటి వీరచరిత్రమును విని ముగ్ధుడై కావ్యగానమున కుపక్రమించెను. కాని మన దురదృష్టవశమున సమగ్రమును, ఏక కవికృతము ననదగిన వీర చరిత్రము లభింపలేదు. ఖండ ఖండములుగ ఏ ఖండమున కాఖండము ఇదియే శ్రీనాథుని కృతియనుచు కన్పట్టుచున్నవి. కవిత్వ శైలినిబట్టి వాని కర్తృత్వమును నిర్ణయించుట కష్టతరము. ఈ వీరచరిత్రము జానపద కథకుల నోళ్లలోబడి నలుగుటచే ప్రక్షిప్తములనేకములు ఏర్పడినవి. వారి నోరుపట్టని కొన్ని వాక్యములును, మనస్సుపట్టని కొన్ని భావములును జారిపోయినవి. కవిత్వశైలి యందమా! శ్రీనాథుని తక్కిన గ్రంథముల శైలికిని దీనికిని హస్తిమశకాంతరము కలదు.

శ్రీనాథుడు పలనాటి వీరచరిత్రమును 'జనులెల్ల భక్తితోఁ జదివెదు కొఱకు' వ్రాసియున్నాడు. ఇది రాజులకుగాని, రాజాస్థానముల యందలి పండితులకుగాని కవులకుగాని ఉద్దేశ్యింప బడినదికాదు కావుననే శ్రీనాథుడు దీనిని జనసామాన్యమునకు సుబోధమగు శైలిలో వ్రాయ గడంగినాడు. అంతియేగాక ఇది 'పలనాటి వీరుల భాగవతంబు' భాగవత మనగా భగవంతుని కథ. పుణ్యకథయని ఔపచారికార్థము. పుణ్యకథ పారాయణము చేయదగినది అట్టిది సరళగమనముగల—అనుష్టుప్పువంటి—యొకానొక ఛందమున నడచుట సమంజసము. కావున ఇది మంజరీ ద్విపదయందు రచింపబడినది.

'మంజరీ ద్విపదగా మన్నించి నేను
చెప్పఁ బూనితి వచశ్శ్రీ మెఱయంగ'

ఇందు 'మన్నించి' యనుపదము సాభిప్రాయము. ఈ ఛందము శ్రీనాథుని మన్నన కత్యంతము పాత్రమైన దని తెలియుచున్నది. బసవపురాణము, రంగనాథరామాయణము మున్నగునవి జనబాహుళ్యమున పొందిన ప్రచారమునుగాంచి ముగ్ధుడై శ్రీనాథుడు ద్విపద నెన్నుకొన్నాడు. ఏ మందునకైనను తేనె గుణవర్ధకమైన అనుపానమైనట్లు ఏ రసమునకైనను ద్విపద గుణవర్ధకమగుట పై ద్విపద గ్రంథములలో శ్రీనాథుడుచూచియే యుండును.సాధారణముగా ద్విపద యందు ఏ పదముగాని, సమాసముగాని ఒకపాదము నతిక్రమించి మఱియొక పాదమునకు తొంగిచూడదు. ఇది సుఖపదనీయతకు పట్టుగొమ్మ. పఠన సౌలభ్యమును దృష్టియం దుంచుకొన్నచో వ్యర్థపదములు తప్పవు. గానకొని, అరయగ మున్నగునవి నన్నయ కవిత్వమున కొల్లలుగ కాన్పించుట కిదియే కారణము.

వావిళ్ళవారి 'పలనాటివీర చరిత్రము' నందు—

'నరనాథ సింహంబు నలగామరాజు
మహిత చారిత్రుండు మలిదేవరాజు
ధారుణి నేలుచు దమలోన బోరి
కార్యమపూడి శ్రీ కదనంబు నందు
నరపాల చంద్రుండు నలగాము దాక
బంపిన బాలుండు బహు విక్రముండు
తోరపు గజములు తురగ చయంబు
మన్నీల బలముల మహిత శౌర్యమున
చెదరి పారగ బొడ్చి చీకాకుసేసి
నలగాము తమ్ముడు నరసింగు నెదిరి
మర్దించి రణమున మడిసిన పిథము'

మాత్రమే వీనుల పండువుగా ప్రచురింపబడినది. కృత్యాది ప్రార్థనాదికముతో ప్రారంభమై ఫలశ్రుతితో అంతమగు నీ గ్రంథమున పై చెప్పిన కథ మాత్రమే కలదు. ఇది ఉపోద్ఘాత రూపమైన సంగ్రహము.

శ్రీనాథుడు పలనాటి వీరచరిత్రమును 'జను లెల్ల భక్తితో జదువుటకొఱకు' తన సహజశైలిని వదలి—సులభశైలి నాశ్రయించె నంటిని. శబ్దాడంబరములకు, పలుకుల గారడీలకు అలవడినవారి చెవులకు ఇందలి కవనము నచ్చకపోవచ్చును. భాష భాషకొఱకే యనియు,కవనము కవనము కొఱకే యనియు తలంచు వారిని, వాదించువారిని ఏమియు అనలేము. భాషయును, కవనమును జనులకొఱకేయని అంగీకరించువారు గ్రంథమును తప్పక మెచ్చుకొందురు అశేష శేముషీ విభవ సంపన్నుడైన శ్రీనాథుడు తన పాండిత్యంపాయి నెంత తగ్గించుకొని వ్రాసినను అక్కడక్కడ అతని సహజ గంభీరశైలి ఉట్టిపడుచునే యున్నది. యుద్ధముచేత—

'కుంద బృంద సితాబ్జ కుముదాప్త తార
హార డిండీర నీహార పటీర
ఘన మరాళంబుల కాంతిని మించు
సత్కీర్తి వేగమే సరవి నశించు' నట.

బ్రహ్మనాయుడు—

'ఉద్వేగ భర జనితోగ్ర రోషాన్ని
భస్మీ కృతాఖిల పరరాజ విపిను'డట.

మాంచాల కురులు—

'బంభర చయమును భయమంద జేసి
కాటుక కాకచే కందంగ జేసి
చీకటి గుహలలో చేరంగ దించి
కాలాంబుదంబుల గట్టులు జేర్చి
దీర్ఘమై నునుపులై తీరైన కురు'లట.

వీరులు బ్రహ్మనాయునితో నిట్లందురు.

అనివార్యమైన మీ యాజ్ఞాఖలీన
బద్ధులమై నిల్వబడితిమిగాక

అక్కడక్కడ వీరకవియైన తిక్కన పలుకుబడియు తొణికినది. 'కార్యఖడ్గముల ప్రజ్ఞా విశేషములు', 'పూసియు, తొడిగియు పొందించి కట్టి' మున్నగునవి. అణచినను అణగక, దాచినను దాగక

పెల్లుబికిన శ్రీనాథుని సహజశైలికి ఇట్టి ఉదాహరణములెన్నియో కలవు.

సాధారణముగా కవులు తమకుగల వివిధశాస్త్ర పరిజ్ఞానమును సంగతాసంగతములు విచారింపక తమ గ్రంథములయందు చొప్పించుట పరిపాటి. మాఘ భారవులకు సైతము ఈ వెఱ్ఱి లేకపోలేదు. తెలుగు కవులు సరేసరి. ధూర్జట్యాదులు తామెఱింగిన పండ్ల పేర్లను, బాలక్రీడల పేర్లను సైతము ఏ కరువు పెట్టుటకు ప్రాలుమాఱనవారు కారు. శ్రీనాథుడు తన వివిధశాస్త్రకూలంకషప్రజ్ఞను తన ఇతర గ్రంథములయందు ప్రదర్శించినను పలనాటి వీరచరిత్రము నందు మిక్కిలి సంయమము ప్రదర్శించెను. కాని ఒక సందర్భమున మాత్రము తన నాట్యశాస్త్ర పరిచయమును వెల్లడింపవలెనను చాపల్యము నడంపలేక పోయెను. కాని ఇతర కవులవలె చెప్పెడివారికిని వినెడివారికిని అర్థముకాని పద్ధతిలో కాక ఆనాటి నాట్యరంగనిర్వహణమును కనులకు కట్టినట్లు వివరించినాడు. రాజస్థానములయం దేయే స్థానములయందు నియమింపబడిన వేత్రహస్తులు ఆయా స్థానములయందు జరుగు కార్యములలో విశేష పరిచయము గలవారై యుందురు. నలగాముడు కొలువు దీరినపుడు ఒక నట్టువకత్తె సభ ప్రవేశించి—

'నిలిచి నాట్యమునకు నేర్పరియైన
వేత్రపాణికి దగ వినయంబు చూపి
అతడొసంగిన గజ్జ లతి భక్తితోడ
పాదములం గట్టి...'

నటించినదట. కావున నాట్య నిర్వహణమునకు ఆ వేత్రపాణియే బాధ్యుడు. నాట్యము జరుగునపుడు మేళగాండ్ర స్థానములు చూడుడు.

'వరమృదంగము లెస్స వాయించు మేటి
కుడిభాగమున యందు కుదురుగా నిలిచె
తాళమానజ్ఞులు దాపటి దిశను
నిలిచి రుత్సాహంబు నేరుపు మీర
ముఖవీణ వాయించు ముఖ్యుడొకండు
రాగమాలాపించు రమణు లిద్దరును
నిండు వేడుకతోడ నిలిచిరి వెనుక.'

ఇక ఆ నట్టువకత్తె నాట్యముచేసిన విధము చూడుడు.

'సమపాద యుతమైన స్థానకస్థితిని
తాత్పర్యమున దేవతలకును మ్రొక్కి
పుష్పాంజలి యొసంగి పూనినాట్యంబు
సమకట్టి నాదంబు సభయెల్ల గ్రమ్మ
కైకోలు విడుదలల్ ఘనకళాశైలి
కైముడి కట్నముల్ కనుపింప జేసి
వెలయంగ తొమ్మిది విధములైనట్టి
భూచారి నాట్యంబు పొందుగా సలిపి
పదునారు విధములై పరగిన యట్టి
ఆకాశచారియు నమరంగనాడి
అంగహారాఖ్య గలట్టి నాట్యంబు
విదితమౌ తొమ్మిది విధములనాడి
గతివారి భేదముల్ గనుపడునట్లు
భ్రమణ సంయుతదీప్తి పటిమ మీరంగ
పాణి భేదములను పాటించి చూపి
స్థానక సంచయ సంయుక్తి యమర
పేరణి దేశిని ప్రేంఖణ శుద్ధ
దండికాకుండలి తగు బాహుచారి
సప్తతాండవములు సల్పె చిత్రముగ
సభవార లాశ్చర్య సంయుక్తులైరి'.

ఇట్లొకసారి గ్రుక్కతిప్పకొని మరల రెండవ నాట్య మారంభించినది.

'తరువాత నిరుమేల తగు చెలు లమర
సంయుతా సంయుత చలన సంకుచిత
నానార్థ కరములు నాట్యహస్తములు
శిరములు చూపులు చెక్కిళ్ళు బొమలు
దంతోష్ఠ కంఠముల్ తగు చుబుకంబు
ముఖరాగ వీక్షముల్ మొదలుగా నెన్న
అంగంబులారు నుపాంగంబులారు
ప్రత్యంగ సముదయం బారునుంగూడి
యెనిమిది పదియగు నెనగు నంగంబు
లమరంగ నభినయం బాశ్చర్యముగను

మాచర్ల చెన్నుని మహిమంబు దెలుపు
ఆంధ్ర సంస్కృత వాఙ్మయాది గీతముల
భావంబు లెస్సగా ప్రకటంబు సేయ
మాచి రంభాదులు చోద్యంబు నొంది
శిరసులు వంచియు సిగ్గును చెంది'రట.

నాట్యశాస్త్రమును ఇంత సరసముగా, వివరముగా తెలిపిన తెలుగుకవి మరి యొకడున్నాడా? నర్తకి యొక్క నాట్యకళాప్రావీణ్యమో, కవియొక్క నాట్యశాస్త్రపరిజ్ఞానమో మనలను తలలూపజేయును.

పలనాటి వీరచరిత్ర శ్రీనాథుని కాలమునకు చాల ప్రాతబడినదికాదు. ఇంచుమించు రెండువందల యేండ్లకు పూర్వము జరిగినది. జనుల మనస్సులయందింకను మాయని ముద్రవైచినది. కథాకాలమునాటి సాంఘిక పరిస్థితులకును కవి కాలపు సాంఘిక పరిస్థితులకును విశేషభేదము ఉండనేరదు. కావున శ్రీనాథుడు తనకాలపు ఆచార వ్యవహారములను వ్రాసినను, కథాకాలపు ఆచార వ్యవహారముల నూహించి వ్రాసినను విశేషభేదముండునని తలంప రాదు. కావ్యమునందు సహజత్వము చిప్పిలుటకు ఇది యొక కారణము. తక్కిన కావ్యములవలె కృత త్రేతా ద్వాపరముల యందలి నాయికలు చంద్రోపాలంభన సందర్భమున మహమ్మదీయులను పేర్కొనుట వంటి యసంబద్ధ ప్రలాపములకు ఈ కావ్యమున స్థానములేదు.

రాజ ప్రాసాదముల యందును, సభాభవనముల యందును గోడలు కనబడకుండ చిత్రపటములను వ్రేలాడదీయించుట ఆనాటి యాచారము గానోపును. నలగామరాజు సభామంటపమున—

శ్రీరామ కథలును శ్రీకృష్ణ కథలు
పన్నుగా వ్రాసిన పటములు దెచ్చి
కట్టిరి గోడలు కనపడకుండ.

అట్లే బాలచంద్రుని మామగారైన గండువారింటియందు సైతము—

ఘన చిత్రకర్మ సంకలిత పటాలి
గోడలు కనరాక గుత్తమౌనట్లు

అలంకరించిరట. ఇవి కుడ్యచిత్రములు కావు. పటచిత్రములు. భద్రముగా చుట్టి దాచుకొనియుండి విశిష్టజనులు వచ్చినపుడు, విశేష సమయములందును భవనముల నలంకరించుటకు వాడుకొను చుండెడివారు.

ప్రాచీన కాలమున ధనుర్బాణములు ప్రహరణ సాధనము లైనట్లును, విజయనగర రాజుల కాలమున ఖడ్గము ముఖ్యాయుధమైనట్లు వీరి కాలమున శూలము ముఖ్యప్రహరణసాధనముగా నుండెడిది. నలగాముడు యుద్ధమునకు తరలుచు 'బలువైన శూలాల బండ్లు కెత్తింపు'మని యాజ్ఞాపించినాడు. 'చుట్టుక వారల శూలాల బొడిచెద'నని నలగాముని ప్రతిజ్ఞ. బ్రహ్మనాయుడు 'మెప్పించి దివిజుల మేటివజ్రంబు, సమమైన కుంతంబు చక్కగా గొనియె'నట. 'బ్రహ్మనాయనియొద్ద బలువైన కుంత, మున్నది యనిభీతి నుర్వీశులెల్ల' మలిదేవరాజునకు విధేయులై యుండిరట.

ఆనాటి సైన్యము ఎన్నితెఱంగుల సైనికులచే సంఘటితమగు చుండెనో పరికింపుడు.

'మనయొద్ద బంట్లును మన్నెవారలును
పంక్తుల నన్నంబు భక్షించువారు
రొక్క జీతంబుల రూఢులౌవారు
క్షేత్రముల్ జేసుక జీవించువారు
పల్లెలు బుచ్చుక బ్రతికెడువారు
నెలగోలుప్రజలు...' నుండెడివారట.

వీరుగాక సంఖ్యాబలమును అధికముగాజూపి శత్రువులను ప్రతారించుటయు కలదు. ఇట్టి యుద్ధనీతి యందు నాయకురాలు నాగమ్మ మిక్కిలియు నిపుణురాలు. యుద్ధమున బాలచంద్రుని ధాటి కాగజాలక నలగాముని బలములలో కొందఱు ఈ సత్యమును వెల్లడించు చున్నారు.

'బహుదినంబులు మేము పాలేరు చేసి
మునికోల లెల్లను ముంజూర్లుదోపి

పడతులు దిట్టిన పడలేక వచ్చి
చచ్చుచు నుంటి మీ సమరరంగమున
పాఱిపోనిచ్చిన బ్రతుకుదు మయ్య'

అని కొందఱును,

'బోయవారము మేము పూర్వంబునందు
బుజముల కాయలు పూని కన్గొనుడు
పగవారు మిముగని పాఱిపోవుదురు
మీకేమి భయమని మెలత నాగమ్మ
బాగుగా నమ్మించి పనుప వచ్చితిమి'

అని కొందఱును తమ సేనానివహము యొక్క దుర్బలత్వమును వెల్లడించిరి.

సాధారణముగా యుద్ధమునకు పూర్వము రెండు పక్షములయందును మంత్రాలోచనములు బహుళముగా జరుగుచుండును. అందు అల్పసంఖ్యాకులును, బలవ ద్వంచితులు నగువారు యుద్ధమును, యుద్ధఫలిత మును తమ జీవన్మరణ సమస్యగా పరిగణించుటచే ఔగాములను ఠెక్కించుటయందు అత్యంతము నిమగ్ను లగుదురు; ఏలయన సందిగ్ధ జీవనులు వీరే. రెండవ పక్షమువారు సుఖపరిస్థితులు. వంశపరంపరాగత సకల విభవ సంపన్నులు. ప్రమత్తులు. భారత రాయబారము నందును పాండవుల ప్రయత్నమే యధికము. పలనాటి వీరచరిత్రయందును బ్రహ్మనాయని పక్షమున ఆబాల గోపాలము యుద్ధ సన్నద్ధమగుటచే తర్కవితర్క ములు మెండుగా జరిగినవి. ఇట్టిపట్టుల కొంత వేదాంతబోధయు, కొంత వీరరసప్రబోధమును అని వార్యములు. శ్రీనాథు డీ ఘట్టములయందు ధర్మ బోధను, వేదాంతమును తేటతెలుగు బాసలో వివరించి యున్నాడు. భాష తేలిక—భావము బరువైనది.

బాలచంద్రుడు బంగారుతో బొంగరములు చేయింపుమని తల్లినికోరి ఆమె లోభగుణమును ఉపా లంభించుచు భోగానుభవమును, ధర్మాచరణమును వైరాగ్యమునకు జంటబాటలని చెప్పుచున్నాడు.

'సంపదవేళనే సకలభోగములు
పొందంగవలె ధర్మములు చేయవలయు
భోగానుభవముచే పుట్టి సంతృప్తి
వేసట జనియించి వెగటుగాతోచు
అటుమీద వైరాగ్య మమరుచునుండు
ధర్మంబుచేసిన తనరు పుణ్యంబు
సజ్జన సహవాస సంప్రాప్తిగలుగు
వైరాగ్యమధికమై వర్తించు బిదప
భోగ ధర్మంబులు పుట్టిన యపుడె
సరవి విరాగిత సంసారమెడలు
సద్గురు పదసేవ చయ్యన గలుగు
అందుచే నిర్వాణ మందికయగును.'

బాలచంద్రుని కోరికప్రకారము కమసాలులు బంగారమును కరిగించి అచ్చుపోసిరి. కాని ఆ అచ్చు చిద్రుపలైనది. ఎల్లరును భయభ్రాంతులైరి. అప్పుడు బాలచంద్రుడు పలికిన ధైర్యవచనములు వినుడు.

'సంచారి జీవముల్ సమయుచునుండు
సమసిన జీవముల్ జనియించు మరల
జడపదార్థంబులు చైతన్యమొందు
పొలియ దొక్కటి విను బొత్తిగా నెపుడు
పుట్టదు కొత్తది భూమిలోపలను
పోయిన దానిని పోయెనటంచు
ఉన్నదానిని జూచి యున్నదటంచు
భావింపగారాదు పడతిరో కనుము
కాలవశంబున గల పదార్థములు
రూపభేదంబుల రూఢిగాబొందు.'

పై వాక్యములన్నియు పొల్లు వేదాంతము కాదు—వేదాంత సారము. ఇందు 'జడపదార్థములు చైతన్యమొందు' అను వాక్యము గమనింపదగినది.

ఇందలి స్త్రీ పురుషులందరును వీరధర్మోపాస కులు, వీరధర్మ ప్రవర్తకులు. శ్రీనాథుడు నోరార వీరధర్మ సంకీర్తనము గావించినాడు. అందు బాల చంద్రుని నోట వినవచ్చు ప్రతి వాక్యమును వీర విజృంభణమే. యుద్ధమునకు బోవలదని తల్లి వారించినపుడు బాలచంద్రుడు పుణ్యలోకములకు బోవు మార్గములను రెంటె నిట్లు తెలుపుచున్నాడు.

'నెజ్జన సంగతి సంసార మెడల
గురువు బోధించిన గురిమీద మనసు
నిలిపి మరణమొందు నిశ్చలు డొకడు
ప్రాజ్య సామ్రాజ్య సంరక్షణమందు
ఘన రణమ్మున రొమ్ము గాయాలనొంద
మనసు చలింపక మరణంబు నొందు
శౌర్య పరాక్రమ సంపన్ను డొకడు
వీర లిద్దరు లెస్స వినువీథి కేగి
ఆదిత్య మండలం బరుదార జించి
పోయి పుణ్యంబుల భూమి చెందెదరు
మొదటి కార్యము బూను ముఖ్యతలేదు
శౌర్యంబుచే మాకు సంపాద్యమగును.'

అంతేకాదు. వీరము ప్రజలకు శ్రీరామరక్ష.

'జనులకు కష్టంబు సమకూరునపుడు
శ్రీవీర వీర్యంబు చెదరంగజేయు
దేశంబు పరస్వాధీన మౌనపుడు
శ్రీవీర సత్వంబు చిక్కంగ బట్టు
సామ్రాజ్య తరువెండి చచ్చెడు నపుడు
శ్రీవీర రక్తంబు చిగురింపజేయు.'

బాలుని బోకుండ పట్టుట యెట్లని యడిగిన మాంచాలకామె తల్లి రేఖాంబ బోధించిన వీరధర్మములు కుంతి పాండవులకిచ్చిన వీరసందేశమునకంటె వేయి మడుంగులు ఉదాత్తములై యున్నవి. కుంతీ సందేశమునకు స్వార్థము మూలము. రేఖాంబ పలుకులకు కేవలము వీరారాధనమే మూలము. చూడుడు.

'జన్మ వృక్షమునకు చవిగల యట్టి
పటుతర కమనీయ ఫలములు రెండు
కెరలు భోగము లొండు కీర్తి రెండవది
తొలిపండు చవిమాచి తొలగునొకండు
మలిపండు చవిచూచి మలగునొకండు
వీర లిద్దరికిని భేదంబు హెచ్చు
మొదటి ఫలంబున మొనసెడు రసము
క్షణభంగురంబది సమసి పోగలదు
రెండవ ఫలమున రెక్కొను రసము
శాశ్వతంబౌచు దిశల్ గలదాక
సవితృడు గలదాక శశికలదాక
తారలుగలదాక ధరగలదాక
వారధి గలదాక వరలుచునుండు
....
వీరాంశమునబుట్టి వలయువారలకు
మొదటిఫలం బది ముఖ్యంబుగాదు
మహిమాస్పదంబయి మన నుజ్వలింప
బరువెత్తుదురు రెండవ ఫలంబు కొఱకు '

వీరాంశమున బుట్టినవారి మనస్సు కీర్తికై ఉజ్వలించుచు పరువెత్తును. అట్టివారిని ఆపుటకు భార్య కాదుకదా, ఆ హరిహరబ్రహ్మాదుల చేతను కాదు. మరి వారిని నమ్మియున్న వారి గతియేమి ? ఏ సుఖమునకు నోచుకోని ఎల్లబాయపు ఇల్లాలి గతి ఏమి ? ఆమెగతి ఆ పుట్టువున కంతే. వీరపత్నియై జన్మజన్మలకు అట్టివాడే భర్తకావలెననియో, ఏ జన్మకును అట్టివాడు భర్తకారాదనియో భగవంతుని ప్రార్థించుచు సహగమనము చేయవలసినదే. ఆ విషయమునే రేఖాంబ యిట్లు చెప్పుచున్నది:

'నీవు భోగములపై నిరతి త్యజించి
బాలచంద్రుని భద్ర భావంబెఱింగి
భావిమానవుల హృద్భవనంబులందు
తావకీన యశోలతా వివర్ధనము
సేయంగ గోరుము చెలువరో యిపుడు
బాలచంద్రుని నాగ బట్టంగ వలదు.'

సహగమనము ముఖ్యాచారముగా నుండిన యాకాలమున తల్లి కుమార్తెకు బోధించెడి నీతి యెంత ఉదాత్తము! ఎంత త్యాగమహిమాస్పదము! చరిత్ర ప్రసిద్ధులగు ఖడ్గతిక్కన భార్యయు, తల్లియు కంటె రేఖాంబ మహోన్నతవీరగుణాన్విత యని నా యభిప్రాయము. పంచలింగాల యుద్ధమున మనుమసిద్ధి పక్షపు యుద్ధభారమంతయు ఖడ్గతిక్కన భుజస్కంధములపై నుండినది. ఆ భారము నాతడు— తాత్కాలికముగానైననేమి—త్రోసిపుచ్చి పఱివచ్చినాడు

అట్టి ప్రసిద్ధుని ఓటమికి భార్యయు, తల్లియు జుగుప్సవహించుటలో అచ్చెరువులేదు. కాని బాలచంద్రుని విషయ మట్టిదికాదు. ప్రధాన వీరులెవరును యుద్ధ సందర్భమున బాలచంద్రుని తలంపనైన లేదు. బొంగరాలాట యాడునంతవరకు బాలచంద్రునకు యుద్ధవిషయమే తెలియదు. ఉన్నట్లుండి యుద్ధోన్ముఖుడైనాడు. అతనిని విరమింపజేయుట యందు అనౌచిత్యమేమియులేదు. పైపెచ్చు ఎట్టి స్త్రీకిగాని తన కన్నబిడ్డ సుఖముకంటె ముఖ్యమైనది మఱియొకటిలేదు. ఐతాంబాదులు తమ వంశగౌరవ హానికైనను వెనుదీయక బాలచంద్రుని యుద్ధ విముఖునిగావింప బ్రయత్నించుచుండ రేఖాంబ తన కన్నబిడ్డ సుఖమునకై ప్రయత్నించుట యందెట్టి దోషమునులేదు. కాని రేఖాంబ యట్టిపనికి పూనుకొనలేదు. వీరత్వముపై నామెకుగల అభిమానమే అందుకు కారణము.

బాలచంద్రుడు వేశ్యయొద్దను, భార్యయగు మాంచాలయొద్దను వీడ్కోలు పొందు సందర్భము పలనాటి వీరచరిత్రమునకు మకుటాయమానము. వేశ్య సబ్బాయి (శ్యామాంగి) నెఱజాణ. బాలచంద్రుడు డరుదెంచిన వార్తవిని మొదట తలనొప్పిగా నున్నదని చెప్పిపంపినది. వెంటనే బాలచంద్రుడు 'గరిమ కార్యమపూడి కలనికి నేను, పోవుచు ధనమిచ్చి పోవలెనంచు, వచ్చితి నింతలో వనిత గర్వించి, ప్రేమమై సిరిరాక పెడచేత ద్రోసె' అని పలుకగా శ్యామాంగి 'ప్లేటు ఫిరాయించి' బాలచంద్రుని ఆహ్వానించినది. ఈ సందర్భమున శ్యామాంగి మాటలు వేశ్యాజన సహజములు. అతనిని బాసిన దినములైదును ఐదేండ్లవలె దోచెనట. జీవంబు దొలగంగ చింతయొనర్చి పరవశంబున పానుపుపై నుండెనట. బాలచంద్రుని మాట చెవిని బడినంతనే తలనొప్పి యుడగినదట. శ్యామాంగి యన్నట్లు బాలచంద్రుని బుద్ధి పేదది. ఈ బుడిబుడి ఏడ్పులకే కరిగిపోయి యేనూరు మాడలిచ్చినాడు. తన యుద్ధప్రయాణమును చెప్పి తాను మరణించినచో సహగమనము చేయుటకు గాబోలు — వెంట రమ్మనెను. కాని శ్యామాంగి లోకాచారమును తేల్చి చెప్పినది.

'సరిలేని ఇహసౌఖ్య సాధనాలేము
పరసౌఖ్యమునకు నీ పడతి సాధనము.'

కాని మూర్ఖుడగు బాలచంద్రుడు సత్యము గ్రహింపలేక కులకాంతలపై కోపించినట్లు వెలయాలిపై కోపించినాడు. శ్యామాంగి వాని బేలతనమును మరల తన వంచనకు సాధనముగా వినియోగించుకొని పురుషుల 'మనసొక చందంబు మాటొకతీరు' కావున 'నీమది నిల్కడనే గాంచగోరి పరీక్షితి'నని బుజ్జగించినది. మన మిరువురము అభేద భావము గలవారము. 'నఱికితే జలములు నడిమికి తెగవు' అని రూపించి పలికినది. మఱియు ఈ ఉపమానము కనుడు—

'తరువును లతయును దంటగా నుండ
చెట్టు వినాశంబు చెందిన యపుడు
తీగె కాధారంబు తిన్నగ చెడును
తీగె నాశంబున తెగిపోదు చెట్టు.'

చివరకు శ్యామాంగి బుద్ధిగల వాడెవ్వడును నమ్ముటకు వీలులేని బొంకు బొంకినది.

'మాయక్క కంటెను మరి వేగమునను
నీతోడ వైకుంఠ నిలయంబు చూతు.'

ఈ పలుకులతో బాలచంద్రుడు శ్యామాంగికి పూర్తిగా లోబడినాడు. ఆ మాటకే వేయిమాడలు మంజూరు చేసినాడు. ఆ నాటి యాచారము చొప్పున తన పెద్దలకు, 'ఓలి' (కన్యాశుల్కము) నిచ్చి తన్ను సొంతము జేసికొమ్మన్నది శ్యామాంగి. వేశ్యమాత వచ్చినది. తనకూతు చెయిదమునకు మిక్కిలి చింతించినట్లు నటించినది.

'మనసు నీపాలాయె నమ్మొల్ల విడిచె
సర్వకాలము నేను సాకినదాన
సత్యంబు నీవెంట సాగి పోనీయ

'అడిగిన ద్రవ్యంబు నలర నాకిమ్ము
నీవెంట పంపింతు నెలతను నేను'

అని పండ్రెండువేల మాడలు ఓలిగా కోరినది. ఇచ్చినాడు. 'నీ వారుగా జూతు'నని పట్టు పచ్చడము లాగికొన్నది. అన్నపు ఖర్చునకు ఆకు పోకలకు, నాలుగువేల మాడలు రాల్చుకొని పోయిరమ్మన్నది. అప్పటినుండి బాలచంద్రుడు భార్యయింటికి పయనమై పోయినాడు.

ఆంధ్రకావ్య నాయికలలో దయనీయయు, ఉదాత్త గుణోపేతయు, ధీర స్వభావయు నైనది మాంచాల. పాపము విధివంచిత—వివాహమై ఏడు సంవత్సరములు గడచినను దాంపత్య సుఖమునకు నోచుకొన్నదికాదు. అత్తయైనను తన కుమారునికి బుద్ధి చెప్పరాదా? ఆ అత్త ఎవరోకాదు తన మేనత్తయే. కుమారు డాడినదంతయు ఆటగా చెల్లించుచున్నది. స్నేహితులైనను బాలచంద్రునికి బుద్ధిచెప్పరాదా?

యుద్ధమునకు పయనమైన తన కుమారుని నివారించుటకై కోడలి సాయ మపేక్షించి వచ్చినది ఐతాంబ. మాంచాల తన మనస్సున రగులుచున్న అగ్నిపర్వతము నెట్లు బద్దలు గావించినదో చూడుడు.

'సమరాన నాతడు సమసిన వెనుక
వెంట నేగెద నత్త విడువుమీమాట.'

అని భవితవ్యమును చెప్పినది.

'వెలయ భుజించుట వేశ్యగేహమున
విడియంబు సేయుట వెలయాలి యింట
సౌఖ్యంబు పొందుట సాని ధామమున'

అని ఐతాంబకు ఆమె కుమారుని దుర్వర్తనము తెలిపినది.

'భోగంబు నొందెడు సోంతులువారు
చావనోచిన యట్టి సకిఁయను నేను'

అని దౌర్భాగ్యమును నిందించుకొన్నది.

ఆనాటి భారతనారియొక్క దైన్యస్థితి అట్టిది. ఏనాడును, ఏముద్దుముచ్చటలకును నోచకపోయినను కేవలము తాళిబొట్టు కట్టించుకొన్న నేరమునకు మొగమైనను జ్ఞాపకములేని భర్తతో సహగమనము చేయవలసినదే. ఆదరించినను, ఆదరింపకపోయినను పతియే సతికి ప్రత్యక్షదైవము. పతి తన ధర్మమును నిర్వర్తింపకపోయినను సతి ఇది యేమని ప్రశ్నింపరాదు. అట్లు ప్రశ్నించినచో ఆమె ధూర్త. ఆ విషయమునే ఆమె 'సరిచేసి యీ మాట సభ నెన్నరాదు' అని పలికి సాంఘికమర్యాదను పాటించినది. అంత మాత్రముచేత సత్యము మఱుగుపడదు. జరిగిన అన్యాయము మాసిపోదు. న్యాయము వేరు ధర్మము వేరు. సంఘనిష్ఠమైన న్యాయమట్లున్నను మనోనిష్ఠమైన ధర్మము మాంచాలపక్షముననే మొగ్గు చూపుచున్నది. ఐతాంబయు స్త్రీయే. స్త్రీ హృదయము నామె చక్కగా యెఱుగవలయును. భర్తయెడల భార్యకు భక్తియు గౌరవమును ఎట్లేర్పడును? భర్త చూపెడు ఆదరాభిమానములను, ప్రేమోపలాలనములను బట్టియే కదా. అట్టివేవియు లేకయే భర్తతో సహగమనము చేయునంతటి భక్తి స్త్రీకెట్లు కలుగును? సంఘమున కివియెంతయు గాబట్టవు. తాళి గట్టినవాడు భర్త. వాని నడవడికకు సంఘము జవాబుదారి కాదు. సరియేకాని సాటిస్త్రీయు, ఇరువురకును మాతృస్థానీయురాలునునగు ఐతాంబయైనను తన కుమారుని చక్కదిద్దినదా? స్త్రీగా కోడలి దుఃఖమును ఆమె అర్థము చేసికొనినదా? అందులకే మాంచాల అత్తగారిపై మూటిగా నేరారోపణ గావించినది.

'నీ పుత్రు నడవడి నీ చిత్తమెఱుగు
నీవు కర్తవి మాకు నేమి వాక్రుత్తు.'

మాంచాల మాటలయందలి ప్రౌఢత్వము ఆమె అనపోతుతో నెఱపిన సంభాషణమున ఇంకను వ్యక్తమైనది.

బ్రాహ్మణుడైన అనపోతు, చాకల చందు, మంగల మల్లు, వెలమల దోర్నెడు, కుమ్మర పట్టి, కమసాల చంద్రుడు, కమ్మర పెట్టి, బాలచంద్రుడు—ఈ

ఎనమండుగురు ప్రతిజ్ఞాతభ్రాతలు. ఆ కాలమున నిట్టి సఖ్యములు ప్రసిద్ధములు. వారిలో నెవడు ముందు మరణించినను తక్కినవారు బలవన్మరణము పొందవలెననెడి ప్రతిజ్ఞయు వారియం దుండెడిది. ఆ యెనమండుగురు మాంచాల గృహమున కరు దెంచిరి. మాంచాల బాలచంద్రుని ఎదుటికి వచ్చి నపుడు బ్రాహ్మణుడగుటచే అనపోతు, భర్త యగుటచే బాలచంద్రుడు లేవరైరి. తక్కిన వారు లేచి నిలువబడిరి. కూర్చున్నవారిలో భర్త యెవరో యెరుగనందున వారిలో కంటికి సదురుగా 'కాంచన వర్ణప్రకాశుడైనట్టి, బ్రాహ్మణు డనపోతు పాదంబు పట్టి' కడుగ బోయినది. భయముతో అన పోతు తమ పరిచయము గావించుకొన్నాడు. అప్పు డామె పలికిన మాటలు వినుడు.

'వినవయ్య విప్రుడ విన్నపం బొకటి
ఇద్దరికిని మీర లెలమితో బెండ్లి
చేసెదు నాడొక్క చెనటి విప్రుండు
చూడగా లేక అసూయ పెంపొంద
సౌందర్య మన్నది చానకు నున్న
యెట్లు గావించినా రీ వివాహంబు
అని పల్కెనో యేమొ అటుగాకయున్న
బాలు డీ విధమున భావంబు విడిచి
నన్నేల విడనాడు నయమార్గ మెడలి.'

పై వాక్యముల భావమేమో ప్రత్యక్షముగా వినుచున్న బ్రాహ్మణునకే అర్థము కావలెను. జరుగు చున్న ఒకానొక దుస్సంఘటనమునుచూచి ఉపేక్షించు వాడును, ఆ దుస్సంఘటనమునకు కారణ భూతుడును సమానులే కాని వేరుకాదు.

అనపోతాదులు నిజముగా బాలచంద్రుని శ్రేయోభిలాషులే యగుదురేని వాని దుర్వర్తనమును మాన్పి యుండవలెను. మాన్పలేదు కనుక ప్రోత్స హించినవారే యగుదురు. అందు ముఖ్యముగా సకల ధర్మవేత్తయైన అనపోతు ఈ విషయమున ఉపేక్ష వహించియుండుట క్షంతవ్యముగాదు. ఈ విషయ మును సైతము మాంచాల నేర్పుమై వెల్లడించినది.

'బ్రహ్మ కులంబున ప్రభవించినావు
వేదాది విద్యల విజ్ఞాని ననుచు
నీ చరణంబులు నేను పూజింప
పట్టితి నాకన్య భావంబు లేదు'

అని తన పొరబాటును సైతము కప్పి పుచ్చుకొన్నది.

ఇంత ధీర స్వభావయైన మాంచాలయు భర్త సన్నిధియందు అగ్ని సమీపమున వెన్న కరగి నట్లు కరగిపోయినది. మోహమునకు గురియైనది. తల్లియగు రేఖాంబ కడకేగి

'కదన రంగమునకు కదలుచున్నాడు
చిరవియోగము మాకు సిద్ధించునొక్కొ
దైవ మీలాగున దయతప్పి నన్ను
పుట్టింపగానేల భూస్థలిమీద
అడవి గాసిన వెన్నెలాయె నా బ్రతుకు
తల్లిరో నేనెట్లు తాళ గలాను
బాలుని పోకుండ పట్టుట యెట్లు ?
దరియేమి నాకని తల్లడం బంది'నది.

అందులకు వీరవనితయైన రేఖాంబ ఎట్టి ప్రత్యుత్తర మిచ్చినదియు ముందే తెలుపబడినది.

సహజసౌందర్య విభ్రాజితురాలైన ఇల్లాలిని జూచి బాలచంద్రుడు

'ఆశ్రిత జనముల నరయుట మాని
పరియాచకము చేయువారల కిచ్చు
భ్రష్టుల పోలిక భార్యను బాసి
వెలయాలి ప్రేమించి వీరిడినైతి'

అని చింతించినాడు.

'కాంచనవర్ణసంకాశుడైన బ్రాహ్మణు డన పోతు మొట్టమొదటిసారిగా మాంచాల హృదయమున ప్రవేశించి భర్తకొఱకు ప్రత్యేకింపబడినచోట వేసిన ముద్ర సులభముగా చెఱగిపోలేదు. మాంచాల ఆ ముద్రను అతిప్రయత్నమున చెఱపివైచి బాలచంద్రుని మూర్తిని అందు ప్రతిష్ఠించినను ప్రాతముద్ర ఛాయా మాత్రముగా నిలిచియేయుండెనని నా అనుమానము.

ఆ స్నిగ్ధత్వ మృదుత్వముల ఫలితమే అనపోతును యుద్ధమునుండి మరలించు ప్రయత్నము. ఆ ప్రయత్నము విఫలమై సమకూడిన సంధిని భగ్నమొనర్చి సర్వనాశమునకు దారితీసినది.

అసలు పలనాటివీరచరిత్రమున రాజులపాత్ర యేమియులేదు. యుద్ధముగాని సంధిగాని రాజుల ప్రమేయ మేమియులేకయే మంత్రులచే నిర్ణయింప బడుచువచ్చినది. మఱియు విశేషమేమనగా నలగామ రాజు సంధికి ప్రయత్నించినపుడు నాగమ్మ యుద్ధమే కర్తవ్యమని బోధించినది. రాజు యుద్ధమునకు పూను కొన్నతరువాత ఆమె సంధికి ప్రయత్నించినది.

మలిదేవరాజాదులు పాండవులవలె వేరుపడిన వారు. నలగామరాజాదులు వంశక్రమాగతమైన రాజ్యమును పెద్దలు నివసించుచువచ్చిన నగరునుండి పాలించినవారు. వీరి యుద్ధమునకు ముఖ్యకారణము భూభాగమేయైనను ఆ యుద్ధము తీవ్రరూపము ధరించి మలిదేవరాజాదులు చావో విజయమో తేల్చుకొనవలసిన పరిస్థితి యేర్పడుటకు కారణము అలరాజు మృతి. నలగామరాజు అలరాజును హత్యచేయించి నందులకు ప్రతిగా నలగాముని తమ్ముడైన నరసింగు వధింపవలెనని ప్రతిన బూనిరి. కావుననే మలిదేవరాజు కడనుండి రాయబారమువచ్చిన భట్టు

'నరసింగభూవిభుని నమ్మిక మీరు
తమ్ముడా మలిదేవధరణీశుకడకు
పంపుడి'

అన్నాడు. ఏల? వధించుటకా? 'నమ్మి' 'తమ్ముని'చెంతకు పంపగా తమ్ముడు వధించునా. ప్రతిన తీరినదని వదలిపెట్టును. ఈ విషయమునే ప్రకరణాంతరమున సాక్షాత్తు అలరాజుతండ్రియగు కొమ్మరాజు ఇట్లు చెప్పినాడు.

'చేతికిచ్చినవాని ఛేదించినట్టి
పాపంబు నెబ్బంగి పాపికోవచ్చు.'

రాయబారి మాటలు నలగామరాజు విన్నాడు. అతని హృదయము మెత్తనిది. ధర్మనిష్ఠుడు. నరసింగును సమర్పించుట మగతనముకాదు. కాని రాజ్యభాగము నిచ్చుట ధర్మమేయని నలగామరాజు నిర్ణయము.

'తమ భూమి నిచ్చిన దక్కించుకొనగ
శక్తిగల్గిన జాలు సదయుడ నగుచు
ఇచ్చితి తనుభూమి యేలుకొనంగ'

అని తన పెద్దరికము మొక్కవోకుండ పలికినాడు. కాని యేమేమియో చేయ నిశ్చయించియుండిన నాయకురాలు నాగమ్మ ఈ మాటలకు బమ్మెఱవోయినది. పటురోషమందియు నవ్వుచు రాజును డగ్గరినది.

'కలను ప్రవేశించి కదనంబు చేయ
కనిపెట్టి యున్నాడు గ్రక్కున మిమ్ము
రమ్మని పిలిచిన రామనరాదు'- అని పురికొల్పినది.

'మగటిమి విడనాడి మానంబు దూలి
పంచి భూమి నొసంగ పంతంబుగాదు'

అని బోధించినది.

'సిరిసొత్తు చేయుట చెల్లునుగాని
ఆజ్ఞ పొత్తిచ్చుట అది నీతిగాదు'

అని రాజనీతియు బోధించినది. చెప్పవలసిన దంతయు చెప్పి 'కార్యమర్మజ్ఞ నీ వెఱుంగని ధర్మమే నెఱుంగుదునె' యని నలగాముని మగతనమును అందల మెక్కించినది. ఆ పొగడ్తతో నలగాముని కన్నులు నెత్తికెక్కినవి. శత్రుసైన్యము బహు స్వల్పముగా కనబడినది. 'గున్నయరా చింతచెట్టుక్రిందికిలేరు శిబిరమంతయును, మూకంత వరిమడి మూలకు లేదు' అని తిరస్కరించి యుద్ధము ప్రకటించినాడు. నాగమ్మచే సంధి భగ్నమైనది.

నిజమునకు మలిదేవ రాజాదులసేన మిక్కిలి స్వల్పము.

'ఉగ్రకోపాఢ్యులు ఉరుబాహుబలులు
అసహాయశూరులు నరువదేగురు—'

మాత్రమే వీరి పక్షముననున్న ప్రధాన పురుషులు. కాని వీరందరును ఏకకుటుంబము వంటివారు. అల

రాజు చావును, అతనిభార్య సహగమనమును వీరి హృదయములందు సెలవేయు చుండినవి. వీరిని యుద్ధోన్మత్తులను చేయు విషయ మిదియే.

'మన అక్క వెలలేని మాణిక్యమరయు
చచ్చి ఆ కైలాస శైలంబు నందు
అలరాజు గలసిన దాశ్చర్య సరణి
సరసిజలోచన చావు విన్నపుడు
దరిగొనదా మది దావాగ్నిరీతి.

అట్లు దరిగొను మనస్సులుగలవారు గనుక అరువదే గురుఁను మరణమునే ప్రధాన లక్ష్యముగా నిడుకొనిరి. జయము వీరికి ఆనుషంగికము. నలగామరాజు సైన్య మున 'వీర రాహుత్తులు వెలయ ముప్పాట, అరువది మంది'. వీరుగాక సంఖ్యాబలమునకు నాయకురాలు నాగమ్మ పల్లకీ బోయీలను, 'పాలేళ్లను పట్టుకొని వచ్చి నిలిపిన సంగతి ముందే ప్రస్తావింపబడినది.

బ్రహ్మనాయుడు సైన్యములయందు ఆత్మ విశ్వాసము, ధృఢదీక్షయు (Morale) అనబడువానిని సృష్టించుటయందు నిపుణుడు. యుద్ధమునకు బయలుదేరునపుడే అందరికిని మరణమే అంతిమలక్ష్య మని బోధించినాడు. తనకు ప్రత్యామ్నాయముగా బాల మలిదేవరాజును రాజుగను బాలచంద్రుని మంత్రిగను, మాడచిని అంతఃపుర రక్షకురాలుగను నియమించినారు. భూతరాట్స్తంభము అనునొక స్తంభమును వెంటగొని వచ్చి యుద్ధరంగమున పాతినాడు. ఇది తమకు దైవసహా యము కలదని సైనికులకు ఉత్సాహశక్తి నొసంగు టకు. కార్యమపూడి రణరంగమును శోధించుటకై అర్ధరాత్రమున బ్రహ్మనాయుడును, అతని పెంపుడు కొడుకు కన్నమదాసునుపోయి అచ్చటనున్న చెరుకల పానియును శక్తితోడను, కొరవిదయ్యములతోడను తలపు రెతోను మాట్లాడిరి. రణరంగము శుభపడు నట్లు పంద్రెండుగడియలసేపు కుంభవర్షము కురిసి నది. ఈ విషయములన్నియు మరునాడు ఉదయ మున బ్రహ్మనాయని మాహాత్మ్యములనుపేర ఉభయ సైన్యములయందును చిలువలు పలువలుగా ప్రచారమైన నవి. మలిదేవుని సైన్యమున మరింత ఆత్మవిశ్వాస మును, నలగాముని సైన్యమున రవంత అధైర్యమును పుట్టించినవి.

బ్రహ్మనాయని ఈ అలౌకికతంత్రములు నాగమ్మ లౌకికతంత్రములను వమ్ముగావించినవి. సైనికుల ధైర్య కవచములను భగ్నము గావించినవి. అమానుషశక్తుల తోడ్పాటుగల వారితో ఎవరు పోరాడగలరు? దేవళము చావనెంచివచ్చినవారితో ఎవరు పోరాడగలరు? నాగమ్మ తన సైన్యము అతుకుల తడికెవలె నిలిచియుండు టయు గమనించినది. ఇక సంధియే కర్తవ్యమను కొనినది.

'సమరముగాకుండ సంధియౌనట్లు
మాటాడి యటుమీద మాచెర్ల భాగ
మేలుకొందునిచెప్పు మింకొక్కమాట
నాయనియొద్దకు నరసింగుదెచ్చి
కులవైర మంతము కోరి మీరంద
రొక్కటి కమ్మని యొప్పించి రండు.'

అని కొండ అన్నమరాజును, కోటకేతుని, మాడుగుల వీరారెడ్డి, చింతపల్లిరెడ్డిని రాయబారమంపినది. ఇందు నాగమ్మ ఉద్దేశము అంతుపట్టుటలేదు. ధర్మరాజును ప్రాణములతో పట్టియిమ్మని దుర్యోధనుడు ద్రోణుని కోరినప్పుడు దుర్యోధనుని ఉద్దేశము లెట్టివో నాగమ్మ ఉద్దేశ్యములు నట్టివే కానోపును. రాయబారు లైన దొరలు మలిదేవుని స్కంధావారమునకువచ్చి నాగమ్మ సందేశమును వినిపించిరి. అప్పుడు అచ్చట చేరిన వీరులు

'పాపంబుచేసిన పగవాడువచ్చి
కనపట్ట శిక్షింప కర్తవ్యమగును
హస్తగతుండైన యట్టి శాత్రవుని
పొమ్మని సెలవిచ్చి పోరాడుటెంచ
చెట్టెక్కి ఫలములు చేనంటి చూచి
వేగమే దిగి రాతవేసినట్లగును—'

అన్నారు. కాని పుత్రశోకోపహతుడగు కొమ్మరాజు

'చేతికిచ్చినవాని ఛేదించినట్టి
పాపంబు నెబ్బంగి పావుకోవచ్చు'

నని సంధికి సమ్మతించినాడు.

నిజమునకు కులపగ దీర్పవలసినవాడు బాల చంద్రుడు. పూర్వము అలరాజు హత్యవిని తండ్రియగు కొమ్మరాజు దుఃఖించుచుండ బ్రహ్మనాయుడు కొమ్మ రాజు 'కొనరెట్టువట్టి కులపగదీర్చ నీ కొడుకితడంచు' బాలచంద్రుని ఆతని కప్పగించెను. అప్పటినుండియు బాలచంద్రుడు నరసింగు తలగొట్టుటకై ప్రతిజ్ఞ బూనియున్నాడు. ప్రతిన మాత్రము పూనెను కాని బాల్య చాపల్యముచే నది మరచి క్రీడాసక్తుడైనాడు. బొంగరాలాడు సమయాన కోమటి అన్నమ్మచే ప్రతి బోధితుడై యుద్ధరంగమునకు బయలుదేరినాడు. బ్రాహ్మణుడైన అనపోతు యుద్ధమున చచ్చినచో బ్రహ్మహత్యా దోషము కలుగునని మాంచాల చెప్పి నది. కావున బాలచంద్రుడు మార్గమధ్యమున కార ణాంతరములు కల్పించి అనపోతును వెనుకకు పంపి యుద్ధరంగమును సమీపించినాడు. తుదకు మలిదేవ రాజు స్కంధావారము చేరునప్పటికి దొరల రాయ బారము ఫలించినది. ఎల్లరును సంధికి సమ్మతించి యుండిరి. కాని స్కంధావారమును సమీపించుచున్న బాలచంద్రుని ఔద్ధత్యమునుచూచి అతని పూన్కి ముందే ఎఱింగినవారు కనుక దొరలు సంశయాకు లాత్ములైరి.

'సంధి కార్యమునకు చనుదెంచినట్టి
దొరల మొగంబుల తొలగె తేజంబు
ఇకనేమి చక్కటి యేమికార్యంబు
ఇతడు రాకుండిన నెసగును సంధి
ఇకసాగ దెవ్వరి హిత విచారంబు
దైవకృతంబేరు తప్పింప లేరు.'

అని కడు చిన్ననోయి కళతప్పి నిలిచిరి. అతనిని రాజ సమ్ముఖమునకు పోనీయక దారి వదలక వానిని చూడ నట్లు అడ్డముగా నిలిచిరి. కాని బాలచంద్రుడు వీరులపైనుండి కుప్పించి దుమికి రాజుమ్రోల వ్రాలి అచ్చటనున్న వీరులకెల్ల రోషావేశము తలకెక్కమాట లాడినాడు. కాని పుత్రశోక సంతప్తుడైన కొమ్మ రాజే మేరు ధీరుడై నిలిచి బాలచంద్రుని చేయి పట్టుకొని

'నాయన్న వినవయ్య నళినాప్త తేజ
సంధి కార్యంబేగి శత్రులచేత
పరగ చచ్చినవాడె బాలుడు నువ్వె
అరయ మా సుతుడైన అలరాజు నీవె.'

అని తన క్షమాగుణమును వెల్లడించి బాలచంద్రుని సంధి కొప్పించినాడు. ఔరా కొమ్మరాజు ఆత్మీయత! ఆ కాలమున కులములు వేరైనను, అంతస్థులు వేరై నను ఆత్మీయతకు కొదువ యుండెడిదికాదు. ఈ ఆత్మీయత ఈ కథయందు పలుచోట్ల కానవచ్చు చున్నది. వీరులమీదుగా కుప్పించి దాటిన బాల చంద్రుని కన్నమదాసు నిరోధించి తన భైరవఖడ్గమును ఝళిపించినాడు. కన్నమదాసు కడజాతివాడు. బ్రహ్మ నాయునికి పుత్రతుల్యుడై జ్యేష్ఠపుత్రుడని ప్రసిద్ధి గన్నవాడు. వానితో బాలచంద్రు డేమనుచున్నాడో చూడుడు.

'చెలగి బ్రహ్మన్నకు జ్యేష్ఠపుత్రుడవు
తలదన్ని పుట్టిన తమ్ముడ నేను
కదిసి అగ్రజు తొడల్ గదె లుజేసి
త్రొక్కుచు బోవచ్చు తొడరినకూర్మి'

ఇక కన్నమదాసు ఏమనగలడు!

'...తలవంచి,
భైరవ ఖడ్గంబు పడవైచి ధరణి
చిరునవ్వు నవ్వుచు చేరిసోదరుని
ఒనరంగ నెత్తుక ఉర్వికి దించి
తప్పునాయెడ నుండె తమ్ముడా యనెను.'

ఇట్టి యాత్మీయతలను పఠించునపుడు కన్నులు చెమ్మ గిల్లక మానవు. ఇట్లెల్లరు సంధి కంగీకరించి విందులు భుజింప సమకట్టిన సమయమున మేడపి నుండి అంతఃపుర రక్షకురాలు మాడచి వచ్చినది. అనపోతు యుద్ధమున మరణించినచో తమకు బ్రహ

హత్యా పాతక మంటుననికదా బాలచంద్రు డతనిని వెనుకకు పంపియుండెకు. కాని ఆ అనపోతు బాల చంద్రుడు గావించిన మోసమును గ్రహించి ఖిన్ను డైనాడు. తాను యుద్ధరంగమునకు రారాదని బాల చంద్రుని ఆన. ఆ ఆన మీరరానిది. యుద్ధము తప్పక జరుగుచుండుననియు మరణైక లక్ష్యులగు బాలచంద్రాదులు యుద్ధమున తప్పక మరణింతు రనియు తానుమాత్రము చావక మిత్రద్రోహి యైనా డనియు భావించినాడు అనపోతు. మిత్రధర్మమును నెరవేర్చుటకై అతడు 'తన తలగోసుక ధరమీద వ్రాలె'. అతని కోరిక ననుసరించి మాడచి రక్త సిక్తమైన అతని బంగారు జన్నిదమును, బిరుదము లనుదెచ్చి విందులు భుజించుటకు బంతులుదీరి కూర్చున్న బాలచంద్రాదులకు 'వీనికంటెను కడు ప్రియమైన మేలు, వస్తువులివి గొనవలయు నటంచు' ఇచ్చినది.

'చూచిన యంతనె ఛురికాగ్రమునను
వక్షంబు పొడిచిన వడువున గలిగి
బాలచంద్రుడులేచి పగరు వినంగ
పెడబొబ్బ పెట్టెను ..'

బాల చంద్రాదులు యుద్ధమున మరణించి యుందు రనికదా అనపోతు బలవన్మరణము పాలాయెను! అన పోతు మరణించిన తర్వాత బాలచంద్రాదులు బ్రతికి యుండవచ్చునా ? అట్లు బ్రతికియుండుట స్నేహ ధర్మమగునా ? కావున మరల బాలచంద్రుడు తన ప్రతినను పునరుద్ఘాటించినాడు. సంధి కాదని అందరు ఆశ వదలిరి.

'వీరులును దొరలును వేగమే లేచి
సంధికార్యము మాని జాహ్నవి కేగి
ఆ మడుగులో వేసి రన్నమంతయును.'

ఈ కథయంతయును చూడగా ఇందు రాజుల ప్రమేయ మేమియు మున్నట్లు లేదు. భూభాగమును పోగొట్టు కొన్న మలిదేవ రాజెక్కడ ? కొడుకును పోగొట్టు కొన్న కొమ్మరాజెక్కడ ? బ్రాహ్మణుడైన అనపోతు ముందువెనుక లాలోచింపక తలగోసుకొని చచ్చుట యేమి ? వానికై బాలచంద్రుడు పెద్దలుకూర్చిన సంధిని తిరస్కరించి విజృంభించుట యేమి ! బాల చంద్రుని తమకమునకు కార్యశూరులైన పెద్దలు మారాడలేక పోవుట యేమి ? అలంఘ్య భవితవ్యత ఇదియే కాబోలు.

ఇక జరుగవలసినది యుద్ధము. శ్రీనాథుడు యుద్ధరంగ తత్త్వమునెట్లు వర్ణించినాడో చూడుడు.

'శౌర్యంబునకు బాదు స్వర్గంపు ద్రోవ
యెల్లసుఖంబుల కిది పట్టుగొమ్మ
ఇది ముక్తి సోపాన మిది మూలధనము
ఇది దేవ వితతుల నెన్ననౌ మేలు
హెచ్చైన వీరుల కిది పుట్టినిల్లు
ఇది సమరావని ఇది పుణ్యభూమి.'

శృంగార శ్రీనాథుడు వీర శ్రీనాథుడైనాడు. ఇక శ్రీనాథుడు గావించిన యుద్ధవర్ణనము యుద్ధరంగ మును మన కన్నులయెదుట నుంచుచున్నది. ఇది తిక్కనగావించిన భారత యుద్ధవర్ణన కెంతమాత్ర మును తీసిపోదు. భారతయుద్ధమున పాల్గొన్నది పదు నెనిమిది అక్షౌహిణుల సైన్యము. పలనాటి యుద్ధ మున పాల్గొన్నవారు చాల కొలదిమంది. అందునను శ్రీనాథుడు వర్ణించినది బాలచంద్రుని యుద్ధమునే. ఈ స్వల్ప పరిధియందే భారత యుద్ధమునందు వలె ఎన్నో అవాంతర సంఘటనములు కనులకు కట్టినట్లు వర్ణింపబడినది.

బాలచంద్రుడు నరసింగును సామంత రాగో లతో వక్షస్థలమున పొడిచినాడు. నరసింగుడు 'మాచెర్లచెన్నుని మదిలోన దలచి' బ్రహ్మరంధ్రమున ప్రాణములు విడిచినాడు. మరణముతో పగ నశించి నది. బాలచంద్రునిలోని రాజభక్తి తలసూపినది.' వలగొని ముమ్మారు భక్తితో మ్రొక్కి ఇట్లన్నాడు.

'మిమ్ము గట్టం ద్రాళ్లు మీరె తెచ్చితిరి
మీపాలి మృత్యువు మెలత నాగమ్మ
అలరాజు జంపిన ఆ పగ దీర్ప
పట్టి చంపితిగాని పాపం బెఱుంగ'

అన్న దుఃఖించి శిరస్సునుకోసి చేతియందుంచుకొని స్కంధావారమునకు వచ్చినాడు. బ్రహ్మనాయుడు మున్నగువారు నరసింగుని తలకు గావించిన గౌరవ సత్కారములు కరుణరసపూరితములు.

> 'నరసింగు వచ్చెను నాయకులార
> యెదురుకొందమటంచు నేతెంచి భక్తి
> నరసింగు శిరమును నమ్రతగొనియె
> తపనీయపీఠిపై తలయుంచి మంచి
> గంధము కస్తూరి కలయంగనలది
> తగటు పచ్చడముపై తలయుంచి పిదప
> కొలువెల్ల మ్రొక్కిరి కోపంబులణచి
> ....
> కనిబాద రాహుత్తు డడలె చింతించి
> కొమ్మరాజు వగచె కొలువెల్ల నడలె
> సుంకర్లు వగచిరి శూరు లేడిచిరి
> గండువారల వంత ఘనమయి యుండె
> కమ్మవారందరు కడు చింతపడిరి.'

పలనాటి వీర చరిత్రమునందలి ఈ ఘట్టము స్త్రీ పర్వమునకు సరియుద్ది యగునేకాని తక్కువదికాదు. ఈ గ్రంథాంతమున గావింపఁబడిన భూతప్రేత పిశాచాదుల సంచార వర్ణనతో శ్రీనాథుని కావ్యశిల్పము పరాకాష్ఠ నందినది. ఇది కావ్య వస్తువునకును, యుద్ధరంగమునకును విషాద యవనికాచ్ఛాదన మైనది. ఆర్నాల్డు కవి రచించిన 'రుస్తుం అండ్ సోహ్రాబ్' కావ్యమున చివరగావించిన నదీగమన వర్ణనమువలె ఈ వర్ణనమును కావ్యమునకు శాంత గాంభీర్యములను చేకూర్చుచున్నది. ఈ వర్ణనము చదివి గ్రంథము ముగించు నప్పటికి పాఠకునకు ఒక విధమగు నిర్వేదమును, ఆ గ్రంథముపై నొక విధమగు గౌరవమును శ్రీనాథునిపై నొక విధమగు మెచ్చుకోలును ముప్పిరిగొనక మానవు.

> 'ఘనుడైన శ్రీనాథ కవి రాజరాజు
> చెన్నుని కృపచేత చిత్తముప్పొంగి'—

రచించుట చేతనే ఈ కావ్యమింత రసవంతమును, హృదయగ్రాహియు నైనది. రాజులిచ్చు సంభోజాక్షి చతురంతయాన తురగీ భూషాదులాశించి వ్రాసిన నిట్లుండునా ? చిత్తముప్పొంగి రచించినవి గనుకనే తిక్కన భారతమును, పోతన భాగవతమును సర్వజనామోద పాత్రములైనవి.

శృంగార శ్రీనాథుని యితర కావ్యములచేత కృతిభర్తలు ధన్యులైరి. కాని పలనాటి వీర చరిత్రముచే కృతికర్తయే ధన్యుడైనాడు. పలనాటి వీర చరిత్రము శ్రీనాథకృతము కాదనువారికి దూరము నుండియే ఒక నమస్కారము.



భీమ్లీ

శ్రీ సోమసుందర్

అపరిచిత సోదరుడా, ఇక్కడనే నిలు నిలు
విపరీతం కాదుసుమీ విను మా పలుకులు
ఈ ఊరికి తూరుపునే కలదొక సుందరతీరము
అక్కడి కక్కడనే ఉరకలిడే పరుగులిడే సాగరము

మావూరికి ముప్పొద్దుల తిరిగే సముద్రపాదము
అవునుసుమీ ఇదే ఇదే భీముని పట్నము
చీకటి కడుపును నిర్దయగా చీల్చే దిక్కడనే
వేకువ పెదవుల చిందిన దె్రటి నెత్తుటి వెలుతురు !

కొస్త కొస్త పడమటిదిశ కొరిగిన దీ బోడికొండ
పస్తాయిస్తూ ఉదయాన్ని అభినందిస్తూ
చప్పున వెనుదిరిగిన చీలమండ

గంధకద్రవస్నపితములై నును పెక్కిన రాళ్ళు
మావూరికి—ఎప్పటికీ తరుగని సౌందర్యానికి ఆనవాళ్ళు
అపరిచిత సోదరుడా ! ఇక్కడనే రవంత నిలు నిలు
విపరీతం కాదుసుమీ మా పలుకులు విను విను !

సాగర మేఖలపై ఉరికే
ఊరిపైకి లంఘించే వెలుతురు కెరటాల్
నాగరికత దాచని కోరికలై
నఖక్షతా లొనరించే సముదిత కిరణాల్
సికతాతలి వక్షస్సున చెరగని నెలవంకలు......

కదుపకుమీ కాలిక్కడ—
ప్రతీ యిసుము వినిపించును వలపుకతను
సద్దువద్దు ప్రతిగాలిని వినుమిక్కడ
సహస్రాప్సరసల రసన లజస్రం
వినిపిస్తాయి చిరవిరహ గీతా లనంతం

నీవెవి నాడులలో లోలోపల్లి నరాళల్లో
తెరచుకొనును రహోమందిరాంతఃపుర
పరాగ లాక్షా పథములో?
చరణ నూపుర ధ్వనులో?

    ఆర్ద్రములై, నిస్సీమిత సౌందర్యో—
    ద్భాసితమై, సకలేంద్రియ సమ్యగు
    త్సాహములై, రాసిక్యావధి తెరలించును.

నాసికకా, కన్నులకా, నాలుకకా, చెవులకా...
చవులూరించే భిన్న భిన్న రసాకృతుల ప్రసన్నచ్ఛవులివి...
అపరిచిత సోదరుడా! నిలు నిలు మిక్కడనే...
విపరీతానందంలో పరవశించు మిక్కడనే...

    ఒక్కమాట మరువకుమా
    మా వీటను వీగిపోని సౌందర్యం
    విరహుల గుండెల కెగదన్నే బాడబాగ్ని
    ప్రణయ పరీరంభానికి
    కేవలమూ స్వర్గము మా భీమునిపట్నం

పాపాలను తుడిచేసే సముద్రనాదము
భాస్వద్రేఖలుగా ప్రవహించే మధుమాసము

    దూర దూర సాగరాల తేలేనౌకలు
    బాలకృష్ణుడెపుడో విడిచిన కాగిశంపు పడవలు
    నడివేసవి మధ్యాహ్నం...సాగరముకురము
    కేల్దోయిని పట్టుక తిలకం దిద్దుకొనును

మా ఊరన్నది—ముప్పక్కల కడలిని వెలిగించే దీపము
పున్నమిరేయిని ముంచెత్తే తరంగాల కోపము
అదే అదే ఆనంద స్వర్గము—
పిడికెడు నీ బ్రతుకును వెలయించే మహేంద్రవాసము.

ఉ ద య ం

శ్రీ మల్లాప్రగడ రామారావు

'బిసీటెడ్. కూర్చోండి.'

'పరవాలేదండి.'

'నో. నో. నా కిలాటి తారతమ్యాలన్నీ నచ్చవు. నేను కంపెనీ ప్రొప్రైటర్నీ, మీరు గుమాస్తా అయినంతమాత్రాన యిద్దరమూ మనుష్యులం కాకుండా పోము. దయచేసి కూర్చోండి.

'థేంక్యూ సర్!'

'దట్సాల్. మీ అమ్మాయిపెళ్లికని సెలవు పెట్టారు?'

'అవున్సార్. ఎంతలేదన్నా ఒకవారం సెలవు కావాలి.'

'నో. నో. వారం ఎలా సరిపోతుంది. పదిహేను రోజులు సెలవుతీసుకొండి. ఈ అయిదువందలూ... మీరు కాదంటే నేను బాధపడాల్సివస్తుంది.'

రాజు ఎడమవేపునుంచి కుడివేపు ఒత్తిగిల్లాడు. పాతబడిన మడతమంచం ప్రాణం పోతున్నట్లు కిర్రుమంది.

'హుః. ఈ ఆలోచనలు కాదు. నిద్ర అసలు రాదు. మధురంగా ఊహించాలి' అనుకున్నాడు రాజు, తలక్రింద మడతపెట్టిన చెయ్యివుంచుకుని.

రాజు ప్రీవీపర్సువున్న రాజో, పోగొట్టుకున్న రాజో కాదు. పేరులోనే రాజు. వడ్డాది చిన సీతారామరాజు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడి పెద్ద కొడుకు మాత్రమే. కాని దరిద్రమే ఒక సామ్రాజ్యమైతే దాని కతనే సామంతరాజు.

కడుపు నిండినవారి చిరునవ్వులావుంది పున్నమి వెన్నెల.

నిద్రపట్టని ఎర్రఅని కళ్లువిప్పిచూసాడు రాజు.

వాకిట్లో అతను పడుకున్న మంచంచెంతనే వున్న తెల్లచేమంతులు వెన్నెలముద్దల్లా వున్నాయి. మరో పక్కవున్న దొండపాదునీడ మంచంమీద పడుతున్నది. ఇంటి నానుకునేవున్న ఆకుమళ్లమీదనుంచి చల్లని గాలివచ్చి శరీరాన్ని తాకుతున్నది.

ఇంటివేపు చూసాడు. క్రిందికి వంగివున్న చూరు. ఎండిన చొప్పగడ్డిమీద పడి వెన్నెల మెరుస్తున్నది.

ఆ యింటి నానుకుని మరోవేపువున్న గుడిసెలలో కొండవాళ్లుంటున్నారు. మగవాళ్లు రాత్రి పూరు కాపలాకాస్తే కలిగిన వాళ్లంతా పెద్ద పండుగనాడు ధాన్యం కొలుస్తారు. పగలంతా ఆడవాళ్లు ఆ చాకిరీ, ఈ చాకిరీచేసి గంజినీళ్లకి సరిపడా సంపాదిస్తారు. వాళ్లు పెంచుతున్న పందుల గురక ప్రశాంత వాతావరణాన్ని భంగపరుస్తున్నది.

రాజుకి పూర్వం వాళ్లుండేయిళ్లు జ్ఞాపకం వచ్చింది.

పైన చొప్పగడ్డితోనే నేయబడ్డా యిల్లంతా గచ్చుచేసి వుండేది. ఇటికలతోకట్టి సున్నంవేసిన గోడలు.

కాలం కలిసొస్తే పైనకూడా పెంకు వేయించాలని సీతారామయ్యకి మహాకోరికగా వుండేది. కాలం కలసిరాలేదు సరికదా రాజుకన్నా పెద్దపిల్ల పెళ్లికని ఆ యిల్లు అమ్మేయాల్సొచ్చింది. రెండు మూడు అద్దెయిళ్లు మారాక యిప్పడుంటున్న యింటికెదురుగావున్న బియ్యంమిల్లు నాయుడుగారి దగ్గర చవకలో ఈ జాగా కొన్నారు.

ఇటు ప్రక్క కొండవాళ్ల గుడిసెలు, అటు కూరాకుల మళ్లు. ఈ యిల్లే వూరికిచివర. సీతా రామయ్య తల్లికి నిండా అయిదుప్రాణాలు లేక పోయినా ఆచారాలు మాత్రం వదలిపోలేదు. ఆవిడ మొదట ఏసుక్కున్నా సీతారామయ్యే లెగించి నాలుగు మట్టిగోడలు లేపి దానిమీద ఏదో కప్పువేయించి గృహప్రవేశం చేయించాడు.

డబ్బులేక కాలేజీచదువు మధ్యలో ఆపేసి యింటి కొచ్చేసిన కొత్తలో రాజుకి పగలల్లా మిల్లు చేసే ధ్వనులు వింటూ కూర్చోవాలంటే చిరాకని పించేది. క్రమంగా, కుటుంబం ఎదుర్కొంటున్న అనేక చిక్కులగురించి పూర్తిగా తెలిసాక ఆ చికాకు సంగతి మరచిపోయేడు.

రాజు కళ్లుగట్టిగా మూసుకున్నాడు. నిద్ర పోవాలనివుంది. కాని సమసమాజంలాగ నిద్ర ఎంతకీ రావడంలేదు. సాయంకాలం తండ్రి చూపించిన 'ఆర్డరు' కాగితమే జ్ఞాపకమొస్తోంది.

ఇంకో మూడునెలల్లో సీతారామయ్యకి యాభై అయిదేళ్లు నిండుతాయి కాబట్టి ఆ రోజుతో ఆయన సర్వీసునుంచి విరమింప చేయబడతాడని అందులో వుంది.

'ప్రచండ వాతూలహత నీపశాఖవోలె' అని ఏదో పుస్తకంలో రాజు చదివాడు. కాని ఆ కాగితం చదువుతూనే అలాంటి వణుకే ఆరంభమయిం దతనిలో.

అయిదునెల్లాయి తండ్రికి జీతంలేదు. ఊరి నిండా బాకీలే! కుటుంబమంతా ఒకపూట తింటే రెండుపూటలు పస్తుంటున్నారు. ప్రైవేటు చదువు తున్న పిల్లల తండ్రులు బ్రతిమాలించుకుని, పది సార్లు తిప్పించుకుని, అప్పుడో అర్ధ, అప్పుడో రూపాయి చొప్పున యిస్తే ఆ డబ్బుతోటి, అమెరికా వాళ్లు బడిపిల్లలకోసమని యిస్తున్న పాలపొడి, గోధుమనూకలతోటి సంసారం లాక్కొస్తున్నాడు సీతారామయ్య.

ఒకటి రెండుసార్లు కూలీ నాలీ చేసుకుని వూరికి కనపడాకాస్త బలికే కొండవాళ్ల దగ్గర్నుంచి అవీ, యివీ పుచ్చుకుని తల్లి పొయ్యిమీద గిన్నె క్కించడం రాజుకి తెలుసు. అప్పుడు సిగ్గుపడాలో, గర్వించాలో, ఉరేసుకు చావాలో అతనికి తెలియలేదు.

తండ్రి ఉద్యోగమూ ముగుస్తే బ్రతకడం ఎలాగ? పెళ్లీడుదాటుతున్న రెండో అక్క గతేమిటి? ఇంకా చిన్నవాళ్లు తమ్ముడు, యిద్దరు చెల్లెళ్లు, అనారోగ్యంతో బాధపడేతల్లి, ఏళ్లుదాటిన మామ్మ ఏనూతిలో దూకాలి?

'హైకోర్టులో 'రిట్'వేస్తే మరో మూడేళ్లు, దశబాగుంటే అరవైఏళ్లవరకూ కూడా సర్వీసు పొడిగించవచ్చు. అన్ని ఏర్పాట్లూ యూనియన్‌వాళ్ల చేస్తారు'

తండ్రిమాటలు వింటుంటె ఏదోఆశ పొడ మింది. భూమిలోకంటూ చొచ్చుకుపోతే వేళ్లు రాతి నేలలోనైనా నీళ్లంటాయేమో నని.

'కాని నూటనలభై రూపాయలు కావాలి; ఆ తతంగమంతా జరపాలంటే'

తండ్రి స్వరంలోని నిస్సహాయత రాజు హృద యాన్ని కలచివేసింది.

తండ్రివంక చూసాడు.

సీతారామయ్య అందగాడు కాదు. యాభై అయిదేళ్లవాడు అరవై పైబడ్డట్టుంటాడు. కొంచెం వంగిన నడుం. దట్టంగా పెరిగిన, నెరసిపోయిన గడ్డం. బట్టతలమీద జీవితంలో మిగిలిన ఆశల్లా అక్కడక్కడ తెల్లవెంట్రుకలు. సన్నని పొట్టిమనిషి. జీవితం నిర్దాక్షిణ్యంగా సారమంతా పీల్చివేయగా మిగి లిన చెఱకుపిప్పిలా వుంటాడు.

రాజు తనవంక చూసుకున్నాడు. తండ్రితో పోలుస్తే తను నయమేలేదు. బలమైన చేతులు. బల హీనంకాని శరీరం.

అతనిమీద అతనికే అసహ్యంవేసింది. ఇరవై ఏళ్లొచ్చాయి, బీ. యు. సీ. వరకు చదువుకున్నాడు.

తండ్రికీ, కుటుంబానికీ ఏవిధంగానూ కొరగాని తన శరీరమంటే ప్రేమ పోయి రోతకల్గింది.

రాజు పేరు 'ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్‌ఛేంజి'లో నమోదు చేయబడే వుంది. సీతారామయ్య కొడుకు ఉద్యోగంగురించి అర్థించని మనిషిలేడు. ఆయన ఆశ—ఏ గుమస్తాగిరియేనా కొడుక్కి దొరక్కపోదా—అని.

దొరకదనీ, దేశంలో తనకన్నాకూడా ఎక్కువ అర్హతలున్నవాళ్ళు చాలామంది నిరుద్యోగులుగా వున్నారనీ, వాళ్ళందర్నీ కాదని ఉద్యోగంచిలక తనమీద వాలాలంటే ఎంతో పలుకుబడికాని, ధనంకాని వుండాలనీ రాజుకి తెలుసు.

'ఏ బెండరుపని, కళాసీపని ఏదైనా చేస్తాను' అన్నాడు రాజు. మొదట్లో తండ్రి వప్పుకోలేదు. అందుకు సమాధానపడి, ఆ యత్నాలు ఆరంభించిన తర్వాత తను తక్కువనుకుంటున్న పనులుకూడా తన కొడుక్కి సంపాదించలేడని సీతారామయ్యకి తెలిసొచ్చింది.

మూటనలభై రూపాయలు ! ఎలావస్తాయో రాజుకి తెలియలేదు. తల్లి మెడవేపు చూసాడు అప్రయత్నంగా. మెళ్ళోని పసుపుతాడు బోసికాళ్ళు చూసిన తర్వాత తల్లికి పుస్తెలుకాదుకదా కాళ్ళని మట్టెలైనా లేవని గుర్తొచ్చింది.

రాజు మంచంమీద వెల్లకిలా పడుకున్నాడు. కడుపులో మంటగా వున్నట్టనిపించింది. ఆకలిమంట. పడుకునేముందు డబ్బాపాలు, తొలిసారి టీకాచి వడబోస్తే మిగిలినపొడి, కలిపి తయారుచేసిన టీ త్రాగాడు. ఆ నీళ్ళెన్నడో జీర్ణమై ఆకలి పోటులాగ ప్రారంభమైంది.

జీవితం కురుపులా సలుపుతోంది. ఆలోచనలు పుండుమీది ఈగల్లా ముసురుతున్నాయి.

వెన్నెలమాత్రం విరగబడి నవ్వుతోంది.

మిల్లుముందు చెట్టుమీది కాకి ఒకసారి 'కావ్' మంది.

లోకంలోని ఆకల్ని, హీనత్వాన్ని, రోగాన్ని, దైన్యాన్ని, నీచాన్ని, మోసాన్ని చూసి రోతవేసినట్టు, భీతికలిగినట్టు వీథిలో ఎక్కడో రెండు కుక్కలు జంటగా వికృతంగా, భయంకరంగా, బాధామయంగా అరుస్తున్నాయి.

రాజుకి కాలేజీ చదువు మానేసి, దరిద్రంతో ముఖాముఖి తలపడవలసివచ్చిన దగ్గర్నుంచీ రాత్రుళ్ళు పడుకోగానే సాధారణంగా నిద్ర రావడం మానేసింది. అందుకని అతను నిద్ర వచ్చేందుకు మూడు ఏర్పాట్లు చేసుకున్నాడు.

మొదటిది : అతనికొచ్చిన ప్రార్థన పద్యాలన్నీ మనసులో వల్లించుకోవడం. చిన్నప్పుడు తాత డొక్కలో పడుకుని కృష్ణశతకంలోని పద్యాలు చెప్పించుకునేవాడు. మరచిపోగా మిగిలినవి కళ్ళు గట్టిగా మూసుకుని చదువుకుంటాడు.

ఆ యత్నం విఫలమైతే తానో లక్షాధికారైనట్టైతే (ఏ లాటరీయో వచ్చి) ఆ డబ్బు నెంత చక్కగా ప్రజోపకారకంగా ఖర్చుపెడతాడో, సుఖిస్తాడో వూహించుకుంటాడు.

అప్పటికీ నిద్రరాకపోతే అతని ఎరికలోవున్న, అందుబాటులోలేని అమ్మాయిలందాన్ని, వాళ్ళతో తను మధుర జీవితాన్ని ఎలా గడపగలడో కలకంటూ నిద్రపోతాడు.

తనకి తెలియకుండానే బోర్లా తిరిగి పడుకున్న రాజు యిప్పుడు మూడో అవస్థలో వున్నాడు.

'ఊరుకోండి మరీ చిలిపివారై పోతున్నారు.' ఎర్రగా కందిన బుగ్గమీది పంటిగాటును తడుముకుంటూ కోపంగా రాధ చూస్తుంటే రాజు గర్వంగా నవ్వుతున్నాడు.

'ఓరి దేవుడోయ్; ఆడుతూపాడుతుండే పిల్లలే నీకు దొరికారా?'

రాజుకి మగతనిద్రలో దీనంగా వినిపిస్తున్న ఆ కంఠధ్వని కలో నిజమో తెలిసేంతలో 'నాయనా; రాజా!' అంటూ వణుకుతున్న కంఠంతో తండ్రి పిలుస్తుండడం వినిపించి గాభరాగా కళ్ళు తెరిచాడు.

ఎదురుగా కళాకాంతుల్లేని తండ్రిముఖం చూసి దిగ్గున లేచాడు కట్టుకున్న లుంగీ సర్దుకుంటూ. ఇంట్లోంచి చిన్నగా మామ్మ ఏడుపు వినిపిస్తున్నది.

'ఏమయిందో తెలియదు. సుబ్బి నోటంట నురగ కారుస్తూ తెలివితప్పి పడిపోయిందిరా. బుర్ర కూడా వేళ్ళాడేస్తున్నది'. తండ్రిమాట పూర్తి కాకుండానే రాజు వంగుని యింట్లోదూరాడు.

చాపమీద అతని ఆఖరిచెల్లి ఆరేళ్ళది సుబ్బి చేతనంగా పడివుంది. రెండుచేతులా పసిదాన్ని ఎత్తుని డాక్టరింటివేపు పరుగుతీసాడు. తండ్రీ, తల్లీ అతణ్ణి అనుసరించారు.

ఊర్లోవున్న ఎల్. ఎమ్. పి. చదువుకున్న ఒక్కడాక్టరూ తలుపు దబదబా బాదిన పదినిమిషాలక్కాని తెరవలేదు. చూడగానే ఫీజు రాని కేసని తెలిసి విసుక్కోవడం మానలేదు.

'ఇలా యింతకు మునుపెన్నడేనా వచ్చిందా?' అన్నాడు పరీక్ష ముగించి ఇంజక్షన్ యివ్వడానికి సిరంజిలో మందెక్కిస్తూ. లేదన్నట్టు రాజు తల్లి అడ్డంగా తలాడించింది.

ఆవిడ తోవకడాకూ గ్రామదేవతలు మొదలుకుని, వేంకటేశ్వరుడివరకూ ముక్కోటి దేవుళ్ళకూ మొక్కుకుంటూనేవుంది. అందరు దేవుళ్ళూ మూర్తీభవించినట్టు తోచిన డాక్టర్ని చూడగానే 'బిడ్డవంటి వాడివి నాయనా! చచ్చి నీకడుపున పుడతాను. నా పిల్లని నాకు దక్కించు' అంటూ అతణ్ణి ప్రాధేయపడడం మొదలుపెట్టింది. డాక్టరు విసుగ్గా చూసాడు.

'మధ్యరాత్రిలో పక్కలో పడుకున్నపిల్ల పళ్ళు కొరుచుకొంటున్నట్టు శబ్దమైతే కలో, కలవరింతో అనుకున్నాను. పాపిష్టిదాన్ని. పాడునిద్ర కళ్ళమీదనుంచి తొలగలేదు. మళ్ళీ గంటా గంటన్నరకి తెలివొచ్చి చూద్దునుకదా శబ్దం అలానే వినిపిస్తున్నది. చెయ్యివేసి తడివితే ఒళ్లంతా చల్లగావుంది. దీపం పెద్దదిచేసి వెలుగులోచూస్తే నోట్లోంచి నురగలు వస్తున్నాయి. పరుగెత్తుకొచ్చాం నాయనా! నీ పుణ్యంవుంటుంది. ప్రాణంపొయ్యి.'

'నాచేతనైంది నేచేస్తాను. కానీ మీరు పిల్లని వెంటనే పట్నం తీసుకెళ్తే మంచిది. ఈ పల్లెటూళ్ళో ఏం మందులున్నాయి? పిల్లబుగ్గల్లోనైనా నెత్తురుచుక్కలేదు. ఏక్షణాని కేమవుతుందో?'

డాక్టరు మెల్లగా అంటున్నమాటలు మబ్బుల్లేని పిడుగుల్లాగ వినిపించాయి ముగ్గురికీ. రాజు తండ్రివంక చూసాడు. తల్లీ అటే చూస్తున్నది. ఇద్దరి చూపుల్నీ ఎదుర్కోలేక, దండనకోరిన దోషిలా తలదించుకున్నాడు సీతారామయ్య.

ముగ్గిరివరసా డాక్టరుకి అర్థమైంది. ఆవులించడం ముగించి 'ఇంతకుమించి నేను చేయగల్గిందేమీలేదు. మీ అదృష్టం బాగుండి యిచ్చిన యింజెక్షనే పనిచేసి తెలివొస్తే తెల్లారి తీసుకురండి' అన్నాడు డాక్టరు.

రాజుతల్లి మళ్ళీ ఏదో బతిమాలబోయింది. 'నా ప్రయత్నం నే చేసాను. ఇంక వెళ్ళండమ్మా!' డాక్టరు విసుగ్గా అంటుంటే రాజుకి అభిమానం వేసింది. నోటి చివరిదాకా వచ్చినమాటను అణచి పెట్టుకుని 'పదమ్మా' అన్నాడు.

మౌనంగా సీతారామయ్య ముందుగా, ఆ వెనుక యింకా వెనక్కి, వెనక్కి డాక్టరును వేడుకుంటున్నట్టుచూస్తూ ఆయనభార్యా, సుబ్బిని చేతుల్లో ఎత్తుకుని రాజూ యింటివేపు బయల్దేరారు.

గుమ్మం దాటుతుంటే గుండెలమీద సమ్మెటతో బాదినట్టు, డాక్టరుగారింటి గడియారం ఠంగు ఠంగున రెండుగంటలు కొట్టింది.

వీధిలోంచి కాకుండా శ్మశానంలోంచి వెడుతున్నట్టుంది రాజుకి. తల్లిమాత్రం 'పిల్లకి సరైన మందైనా యిప్పించుకోలేని వెధవజన్మ పగవాడికైనా వద్దు భగవంతుడా!' అంటూ ఏవేవో గొణుక్కుంటోంది. భగవంతుడి బదులు ఆ మాటలకు తానే సమాధానం చెప్పవలసి వచ్చినట్టు సీతారామయ్య కుమిలిపోతూ నడుస్తున్నాడు.

క్షణం రాజు బుర్ర పని చేయడం మానేసింది. కలలో మాదిరి చెల్లి నెత్తుకు నడవసాగేడు. సుబ్బిని యింట్లో చాపమీద పడుకోబెట్టి బయటకొచ్చి నిలబడ్డాడు. మిలు ముందు జువ్విచెట్టు జడలువిప్పుకున్న శివుడిలావుంది. దొండపందిరిదాపునుంచి పూరివంక చూసాడు.

ఎత్తుగా దొరగారిమేడ, కంట్రాక్టరు నాయుడి మేడ, మునసబుమేడ, వడ్డీవ్యాపారి నాగయ్య మేడ కనబడుతున్నాయి. వాళ్ళదగ్గర కంబార్లుగా పనిచేసేవాళ్ల గుడిసెలు ఏమూలున్నాయో తెలుసునుగాని అవి కంటికి కానడంలేదు. కొండవాళ్ల గుడిసెలు చలికి వణుకుతూ ముడుచు కూర్చున్న ముసలివాళ్లమల్లే వున్నాయి. నీడల్లాగ ఆ గుడిసెల తర్వాత చిన్నచిన్న రైతుల పూరిళ్లున్నాయి.

ఊరిలో డబ్బులేదా? ఓ యాభై రూపాయల్లేక చెల్లిప్రాణమూ, నూటనలభై రూపాయల్లేక తండ్రి వుద్యోగమూ పోవలసిందేనా?

'అలా బెల్లంకొట్టిన రాయిలా కూర్చుంటావేరా, నాయనా! సీతారావుడూ! ఎవరికాళ్లోనా పట్టుకుని నాలుగు డబ్బులెత్తేరా! పిల్ల దానిప్రాణం కాస్త గుటుక్కుమంటే అప్పుడేమనుకునీ లాభం లేదురా?' ఇంట్లోంచి మామ్మగొంతు దీనంగా వినిపిస్తున్నది.

తండ్రివేపు చూశాడు రాజు. మోకాళ్లలో దాచుకున్న ముఖం పైకెత్తకుండానే 'ఎవరిస్తారమ్మా! అప్పు దొరక్కపోగా ఈ అర్ధరాత్రి లేపినందుకు తిట్లుకూడా తినవలసొస్తుంది' అన్నాడు సీతారామయ్య భయం భయంగా.

'అత్తయ్యా! అత్తయ్యా! పిల్లకు మూర్ఛ వచ్చినట్టు కాళ్లూ, చేతులూ కొట్టుకొంటున్నది'.

రాజు గాభరాగా లోనికి వెళ్లాడు.

'ఓరి భగవంతుడా! ఎంతఘోరానికి ఒడిగట్టావురా? ముసలిదాన్ని నన్నుంచి పిల్లమీద కన్ను వేసావా? నీకంత కోరికైతే నన్ను తీసుకెళ్లి నా ఆయుష్షు దానికి పొయ్యరో...'

'అవును తండ్రీ! అలివేలుమంగానాథా, నన్ను తీసుకుపోయి నా బిడ్డను దక్కించు.'

'అమ్మా! కాసేపు నోర్మూసుకో! ఆ దేవుడి పేరు తలిచావో నేనా నూతిలో పడతాను'.

అన్నతర్వాతగాని రాజుకి తా నేమన్నాడో తెలిసిరాలేదు. అవాక్కై కూర్చున్నారు తల్లీ, మామ్మాను. తండ్రి ముఖంలో ఆశ్చర్యం కనిపించినా ఆయనా ఏం మాట్లాడలేదు.

'పుట్టిం దగ్గర్నుంచీ ఆ దేవుడిని కొలుస్తూనే వున్నాం. ఏం మంచి చేశాడని ఆయున్ని ప్రార్థిస్తారు?' అన్నాడు మెల్లిగా. ఆ మాటలు తన్ను తానుద్దేశించుకుని అన్నట్టుగా అతని కనిపించింది.

'అవేం మాటలురా? ఎవరికర్మ కెవరు కర్తలు! మన రాతకు దేవుణ్ణైనా నిందించి లాభం లేదు.'

'అందుకే బామ్మా, నేనంటున్నది. మన రాతప్రకారం మన జీవితాలు తెల్లవారవలసివున్నప్పుడు ఈ ముడుపులూ, మొక్కులూ, ప్రార్థనలూ దేనికి?' అన్నాడు రాజు.

ఈ గోలకి లేచిన పిల్లలు ఏడవడం మొదలు పెట్టారు.

'పంతులూ! యిట్నారా!' పరిచితమైనగొంతు విని రాజు పైకొచ్చాడు.

వాకిట్లో ఆరడుగుల ఎత్తు శరీరంమీద ఒకప్పుడు తెల్లనిదైవుండి, ప్రస్తుతం మాసి నల్లగా కనబడుతున్న, చేతులున్న గుడ్డబనీను, చెవిసందున పొడుగాటి చుట్ట, చేతిలో చేపాటికర్ర, నూనూగుమీసాలమీద కోటేరులాటి ముక్కూ, పెద్దనుదురుమీద పడుతున్న గిరజాలజుత్తూకల కొండవాళ్ల కుర్రాడు 'అర్జునుడు' కనిపించాడు.

'ఏందలా ఏడుత్తాది ముసిల్ది' అన్నాడు అర్జునుడు. 'గుడిసెలో కినబడుతుంది ఏడుపు. ఆ పలాన లెగిసొచ్చినా యేంగోరం జరిగినాదో యేటోనని'

రాజు క్లుప్తంగా జరిగినదంతా వివరించా

'ఎంత కావాలేటి సొమ్ము ?

'కనీసం ఓ యాభై వుండాలి.'

'అయిత్సలే! నా నరగంటలో తిరిగొత్తాను. గంగులుగాడి బండికూడా తీసుకొత్తా. పెయానంకి రడీగా వుండో !'

'అర్జునా' అనబోయిన పిలుపు రాజు నోటిలోనే వుండిపోయింది.

అర్జునుడేం చేస్తాడో, డబ్బెలాతెస్తాడో రాజుకి చూచాయగా తెలుసు. ఐనా రాజు పరుగెడుతూ వెడుతున్న అర్జునిడి నాపలేదు. అట్టే చూస్తూ నిల్చున్నాడు.

కాస్సేపు పోయింతర్వాత ఇంట్లోకి వెళ్లి 'అమ్మా ! పట్నం వెల్దాం. బండి వస్తుంది. నాలుగు గుడ్డలు సర్దు' అన్నాడు.

అన్నట్టుగానే అర్జునుడు అరగంటలో వచ్చాడు. వీధి తలుపుదగ్గర గూడుబండి ఆగివుంది.

బండి ఎక్కుతున్న రాజుచేతులో ఏదో వస్తు వుంచి గుప్పెట మూసాడు. చేతిలో రెండు అయిదు రూపాయల నోట్లుకూడా పెట్టాడు.

'ఇవెక్కడివి?'

'కనుంకి కమీజు కొంపా మనుంచినా[?]గాని తీసు కెళ్లు'. నీరసంగా మూలిగినట్టుగావుంది అర్జునుడి కంఠస్వరం.

'ఏమయింది?'...అన్నాడు రాజు ఆత్రుతగా అర్జునుడి కణతలమీది చెయ్యి తొలగిస్తూ.

'ఏటపుద్ది వాసం గుచ్చుకుని బొక్కెట్టింది. గంగులూ! ఎల్లనీరా బండిని'. తెచ్చిపెట్టుకున్న విసుగుతో కేకవేశాడు అర్జునుడు.

కొరడా దెబ్బలో ఎడ్లు కదిలాయి.

రాజు కష్టంమీద కళ్లలో నీళ్లు తిరగకుండా ఆపుకున్నాడు.

అర్జునిడి నుదిటినుంచి కారిన రక్తంబొట్లు కర్తవ్యం ఉపదేశించి నట్టయింది.

భారం భగవంతుడిమీదవేసి లాభంలేదు అదృష్టం వెతుక్కుంటూ వస్తుందని కూర్చోపీల్లేదు.

జీవితంలో పలాయనవాదం అసలేపనికిరాదు.

ఊహల్లోంచి తల్లి గుసగుసగొంతు లోకం లోకి తీసుకొచ్చింది.

'వెధవ ఎక్కడేనా ఎత్తుకురాలేదు కదా ! ఏమిటి పెట్టాడు చేతిలో ? చూడనీ !'

రాజు పంచప్రాణాలు వున్నట్టు గుప్పెట ముడుచుకున్నాడు గట్టిగా.

'దొంగసొమ్ము మనకెందుకురా ? ఏజన్మలో చేసుకున్న పాపమో యీనాడనుభవిస్తున్నాం. ఇంక యీజన్మలో కూడానా ?'

అప్పటికీ రాజు మాట్లాడలేదు.

చేతితో వస్తువు దొంగతనానికి ప్రతీకో, త్యాగానికి, సహానుభూతికీ, మానవత్వానికీ చిహ్నమో అతనికి తెలుసు.

అతనికి భయపడి తల్లి మనసులోనే రామ నామ స్మరణ చేసుకుంటున్నందువల్ల కాబోలు పెదాలు కదిలి అస్పష్టంగా శబ్దాలు పైకొస్తున్నాయి.

ఇంజెక్షన్‌పని చెయ్యడం మొదలుపెట్టిందో, మళ్లీ తెలివి తప్పిందోగాని సుబ్బి కదలకుండా పడుకుంది.

చల్లగా తగిలి గాలి శరీరాన్ని, మనసుని సేద దీరుస్తున్నది.

చుట్ట అడ్డపొగపెట్టుకుని, గంగులు 'తెల్లారిపో వచ్చినాది బాబూ !' అన్నాడు.

రాజు తలూపాడు.

ఇలకోళ్లు 'కో' కూస్తున్నాయి.

లోకం ఉషోదయంకోసం ఊపిరి బిగబట్టుకు చూస్తున్నది.

విజయనగరములోని కన్నడ హరిదాసకవులు

శ్రీ కె. వి. ఆచార్య

పడిపోయిన విజయనగరములోని ప్రతి శిథిలమూ పలక నారంభిస్తే విజయనగరచరిత్ర కేవలము తెలుగు చరిత్రగా మాత్రమేకాక దక్షిణాపథానికి చెందిన సమైక్యభవ్యేతిహాసముగా విదితవౌతుంది. ప్రాంతీయభాషా కులమత దురభిమానాలకు జడిసి హృదయ సంవాదులైన ఆ శిథిలాలు మూగవోయినవి నేడు. అక్కడ తెలుగురాయుడు పాలించి స్వర్ణ యుగాన్ని సృష్టించిన కాలంలో దాక్షిణాత్య సాహితీ సంస్కృతులు శాంతియుత సహజీవనం చేసినవి.

రాయలు పెద్దన తిమ్మనల తెలుగు ప్రబంధాలను అంకితం తీసికొన్నట్లే కన్నడకవి తిమ్మణ్ణచేత కృష్ణరాజభారతాన్ని వ్రాయించి కృతి నందుకొన్నాడు. అతడు తెలుగురాయ డనిపించు కొన్నట్లే కన్నడ రాయడనీ అనిపించుకొన్నాడు. అతని బిరుదావళిలో 'మూరురాయరగండ' మొదలయినవి కన్నడ వంది మాగధుల కైవారములే.

రాయల రాజధానిలో ముక్కోటిదేవత లొక్కటిగా వేంచేసి వెలసినారు. విఠలునికి కోవెల వున్నట్లే విరూపాక్షునికీ, విఘ్నేశ్వరునికీ ఆలయా లున్నవి. చివరికి ఆ శిథిలాలలో జైన దేవాలయంకూడా కనిపిస్తూ ఉండడం ఆ రాజు సహనశీలానికి సాక్షి. రాయలు కృష్ణస్వామికి గుడి గోపురాలు కట్టించి విఠలస్వామి మందిరాన్ని మరింత సుందరతరంగా నిర్మించినా, విరూపాక్షునికి గోపురప్రాకారాలు నిర్మించటంలో సంకోచము చూపలేదు.

సర్వమతసహనభావముండి, దేనిలోనూ ఏమీ సాధించని మనిషికాదు రాయలు; వైష్ణవ వేదాంతంలో రాయల ప్రవేశం చాల దొడ్డది. అతడు సర్వమతసహనశీలం కలవాడనిచెప్పి, అతని వైష్ణవ తాత్త్వికయోగ్యతలనుకూడా మనము చెప్పికోవలెను. సాహిత్యాన్నీ చరిత్రనూ పరిశీలిస్తే ఈ రెండు యోగ్యతలూ రాయలలో ఎంత సామరస్యంతో రాణించినవో తెలియవస్తుంది.

సర్వతోముఖంగా దర్శనం చేసినపుడు, రాయలు జన్మించి జీవించిన యుగము సమగ్రభారతదేశంలోనే భాగవతయుగంగా భాసిస్తుంది. ఒక పాదమటూ ఒక పాద మిటూ కలుపుకొని పదహారవ శతాబ్దమంతా సేతుశీతాచలపర్యంతమూ, దేశంలో విష్ణుభక్తులు వర్ధిల్లి, వైష్ణవమతాన్నీ విష్ణుభక్తినీ ప్రచారం చేసిన కాల మది. అటు ఉత్తరదేశంలో 'పుష్టిమార్గ' ప్రవర్తకుడూ మహాకృష్ణభక్తుడూ అయిన వల్లభాచార్యుడు (క్రీ. శ. 1481—1533) వైష్ణవ భక్తిని ప్రచారంలోనికి తెచ్చినాడు. వల్లభాచార్యుల శిష్యుడు సూరదాసు (క్రీ. శ. 1479—1584) కృష్ణసేవాలాలసుడై వైష్ణవభక్తివారాశిగా గోచరించే 'సూర్‌సాగర్' సృష్టికర్త అయినాడు. ఉత్తరప్రదేశంలో పావనగంగాతీరంలో కూర్చొని గోస్వామి తులసీదాస్ (క్రీ. శ, 1511—1637) లోకోత్తరంగా రామాయణాన్ని ప్రాచీనహిందీభాషలో రచించి హైందవజనతను రామచరితమానసులను కావించినాడు. అతని 'రామచరితమానస్' నేటికీ ఔత్తరాహులకు పారాయణ గ్రంథమై వున్నది. ఇటు నవద్వీపవాసి (బెంగాల్) కృష్ణచైతన్యుడు క్రీ. శ. (1485—1533) మధురమైన కృష్ణ'ప్రేమ' నత్యంతజనప్రియంచేసికృష్ణావతారు డనిపించుకొన్నాడు. ఇక మహారాష్ట్ర దేశంలో పాండురంగక్షేత్రము కేంద్రముగా 'నాథ' మార్గంలో వైష్ణవ భక్తి

సం(ప్రదాయం వైభవాన్ని చూపుతూనే ఉన్నది. జ్ఞానదేవుడు మహారాష్ట్ర భాషలో గీతాభాష్యం (వ్రాసి మహాభాగవతుడూ జ్ఞానీ అయి విలసిల్లుతు ఉంటే అతని శిష్యుడు ఏకనాథుడు (1533—1599) పండరి విఠలుని అంతరంగ భక్తుడై 'అభంగ' భగవన్నామ సంకీర్తనచేసి (ప్రజలను పరవశులను చేసినాడు. 'అభంగము' లనబడే అతని సంకీర్తనలు మహారాష్ట్ర జనులకు శిరోధార్యము లయినవి. అదే కాలంలో మీరాబాయి భజనవాఙ్మయాన్ని విరివిగా రచించింది. ఇక ఓఢ్రదేశంలో ఒక సాహిత్య యుగానికే నాయకుడని (ప్రసిద్ధిపొందిన జగన్నాథదాసు భాగవతాన్ని ఒరియాభాషలోనికి అనువదించి జనప్రియుడయినాడు. కేరళదేశంలో ఎళుత్తచ్చన్ అనేకవి ఇదేకాలంలో భారత భాగవత రామాయణాలు రచించి 'హరినామ కీర్తన'ము (వ్రాసి ప్రజలను భక్తిభావంతో నింపినాడు. కన్నడదేశంలో హరిదాస సాహిత్యమనే వైష్ణవభక్తి వాఙ్మయశాఖ స్వర్ణయుగాన్ని సంతరించుకొన్నది ఈ కాలంలోనే. ఉత్తరదక్షిణ దేశాలలోవైష్ణవధర్మవ్యాప్తి ఈ విధంగా ఉంటే విజయనగర (ప్రభువుల చరిత్రలో సాళువ నరసింహుని కాలము (క్రీ. శ. 1486—1491) నుండి ఆ రాజులు వైష్ణవాన్ని ఆదరించినారు. అప్పటినుండి తిరుపతి వైష్ణవానికి కేంద్రంగా దక్షిణదేశంలో చాల (ప్రసిద్ధిపొంది విజయనగరరాజుల సేవా గౌరవాలకు పాత్రమయింది. ఇటు పరంపరగా వైష్ణవము నాశ్రయించిన రాజవంశానికి చెందిన రాయలు వైష్ణవము మూడు పూలారుకాయలై వర్ధిల్లిన కాలంలో జన్మించి సహజంగా వైష్ణవుడే అయినాడు.

రాయలకాలంలో రామానుజ మాధ్వ వైష్ణవ మతాలు మాన్యస్థానాలను పొందిఉన్నాయి. ఈ రెండు వైదికమతాలూ విష్ణువు పరదైవమనీ, భక్తి పరమార్థ సాధకమనీ సిద్ధాంతీకరిస్తాయి. వైష్ణవ మతాన్ని అవలంబించిన రాయలు హరి పరతరుడనీ, భక్తి మోక్షానికి ఏకైకమార్గమనీ సిద్ధాంతీకరింప బద్ధకంకణులయిన మాధ్వపీఠాధిపతులనూ, రామానుజ పీఠాధిపతులవలే గౌరవించి వారికి కూడా దాన మానములతో పాటు రాజమర్యాదలూ ఇచ్చి (ప్రోత్సహించినాడు. ఈ విధంగా రాయల భక్తిగౌరవాలను చూరగొని రాయలకు గురువుగాఉండి కర్ణాటదేశంలో వైష్ణవభక్తి సం(ప్రదాయాన్ని విశాలంగా వ్యాప్తిలోనికితెచ్చి, అసంఖ్యాక శిష్యబృందానికి కులపతిగా ఉండి, విజయనగరంలోనే వాసముండిన యోగివర్యుడంటే వ్యాసరాయలే (క్రీ. శ. 1447—1539). వ్యాసరాయలు (ప్రసిద్ధద్వైత పీఠాధిపతిగాఉండి ఆ మతానికి కలిగించిన (ప్రచార(ప్రాభవాలు చాల గొప్పవి. ఈ యోగీంద్రుడు మహాకృష్ణభక్తుడు. కృష్ణరాయలకు వ్యాసరాయలపైన అపారగౌరవము. క్రీ. శ. 1514 లో రాయలు ఉదయగిరిని జయించి తిరిగి వస్తూ గురువైన వ్యాసరాయలకు దివ్యసుందర బాలకృష్ణ విగ్రహాన్నొకదాన్ని తెచ్చి కానుకగా సమర్పించినాడు. ఆ యోగీంద్రుడు ఆ కృష్ణస్వామిని విజయనగరంలో (ప్రతిష్ఠించి రాయలచేత గొప్పఆలయాన్ని నిర్మింపజేసినాడు. ఇప్పుడు మనకు కనిపించే కృష్ణస్వామి ఆలయ మదే. ఆ స్వామి విజయనగరంలో నెలకొన్న పర్వకాలంలో వ్యాసరాయలు గొప్పగా సంకీర్తనలు (వ్రాసినట్లు శ్రీ కే. ఎ. నీలకంఠశాస్త్రిగారు తమ దక్షిణభారతచరిత్రలో (వ్రాసినారు. "On his way back to his own capital Krishna and his Queens Tirumaladevi and Chinnadevi visited Tirupati and gave thanks to Venkateswara (A. D. 1514). His religious orthodoxy was also shown by the capture from Udayagiri and re-errection in Vijayanagar of a fine image of Balakrishna. The sage Vyasaraya composed songs celebrating the occasion."

వ్యాసరాయలు కృష్ణాంకితములయిన అనేక పదములను కన్నడభాషలో రచించి కన్నడ పద సాహిత్యాన్ని సంపన్నమొనర్చిన కవి. 'న్యాయామృతము', 'తర్క తాండవము' 'భేదోజ్జీవనము', 'తాత్పర్య చంద్రిక' మొదలయిన (ప్రమేయ (గ్రంథాలను రచించిన గొప్ప వేదాంత పండితుడు. (ప్రాంతీయభాష

అయిన కన్నడంలో పదసాహిత్య సృష్టికి పూనుకోవటం విప్లవాత్మకమూ జనహితమూ అయినకార్యము. దేవభాషలోనూ దేశభాషలోనూ వైష్ణవభక్తి సంప్రదాయ ప్రవర్తకుడయిన వ్యాసరాయులపైన రాయల కున్న గౌరవాన్నిగూర్చి 'Vyasaraya was highly honoured by the great Krishna devaraya of Vijayanager' అని నీలకంఠశాస్త్రిగారు తెలుపుచున్నారు. వ్యాసరాయులు పూర్ణపురుషుడై జీవించి కృష్ణరాయలకు ముందూ అతనితరువాతకూడా విజయనగర ప్రభువు లైదుగురికి రాజగురువుగా ఉన్నట్లు అతని సమకాలికుడైన సోమనాథకవి చాల విశదంగా 'వ్యాసయోగి విజయ' మనే కావ్యంలో వ్రాసాడు. ఈ మహానుభావుడు విజయనగర రాజ కుటుంబానికి చేసిన ఉపకారమునుగూర్చి జనశ్రుతిగా వచ్చే కథలు చాలఉన్నవి. కృష్ణరాయలకు ఒక దుర్యోగము సంభవించినపుడు వ్యాసరాయులు సింహాసనాధిష్ఠుడై రాయలను రక్షించినట్లు తెలుపుతూ ఇప్పటికీ మైసూరు సమీపములో ఉండే ఈ మఠానికిచెందిన పీఠాధిపతుల 'రాయసము'లలోనూ, సాయంకాల పూజా సమయములలో చేసే స్తోత్ర పాఠాలలోనూ 'కర్ణాట సింహాసనాధీశ' అనే బిరుదు కనిపిస్తుంది.

నాదము శరీరముగా, భక్తి ఆత్మగా, పవిత్ర ముక్తగణమువలె లక్షలాది ముక్తకాలతో విలసిల్లే కన్నడ 'హరిదాస సాహిత్యము'ను సువ్యవస్థితము చేసినది వ్యాసరాయులే అయినా, అంతకుముందు శ్రీ మధ్వాచార్యుల (క్రీ. శ. 1205—1293) సమకాలికుడూ వారి ప్రథమ శిష్యుడూ అయిన నరహరి తీర్థులు మొదటి రచయితగా తెలుస్తున్నది. అతని తరువాత వ్యాసరాయల విద్యాగురువు అయిన శ్రీపాద రాజతీర్థులు రంగవిఠలాంకితములయిన పెక్కు దేవర నామములు (సంకీర్తనములు) రచించినారు.

చెదురుమదురుగా సాగిన ఈ సాహిత్య రచన వ్యాసరాయల చేతిలోను అతని శిష్యులయిన పురందర దాసు, కనకదాసుల చేతులలోనూ సర్వాంగసుందరంగా రూపు దిద్దుకొన్నది. నేటి కర్ణాట సాహిత్య చరిత్రలో హరిదాససాహిత్యమని ప్రసిద్ధిపొంది మాన్యతనుపొందిన ఈ వాఙ్మయానికి వారి కాలము స్వర్ణయుగమయినది. వ్యాసరాయల శిష్యులలో పండితులూ, పదసాహిత్యకారులూ ఉన్నారు. పదసాహిత్య కారులకు పాండిత్యమూ, పండితులకు పదసాహిత్య రచనాచాతుర్యమూ ఉండటమే ఆ కాలపు విశేషము. హరిదాససాహిత్యనిర్మాతలందరూ అసాధారణ శాస్త్ర పాండిత్యమూ ఉన్నవారుగా కనిపిస్తారు. అందుకే ఆ సాహిత్యము పండితులనూ పామరులనూ ప్రబోధింపగలుగుతూ ఉన్నది.

వ్యాసరాయలు కృష్ణాంకితములుగా వ్రాసిన దేవరనామములలో, భక్తి సర్వోత్కృష్టముగా వ్యాప్తిపొంది; రాయలనాటి రసికతా జీవనాన్ని చూచి వ్యసనానికి బానిసవు కావద్దని చేసే హెచ్చరిక స్పష్టంగా కనిపిస్తుంది

'హరిణము కింకిణీ ధ్వనికి వశమైనట్లు
లోకమున మోహితుడవైతివి'

అని హెచ్చరిక ఉంది.

'జారత్వమున చేసిన పాపములకు
గోపజన జారుడన్న చాలదే'

వ్యసనికి పాప నివారణోపాయమయిన నామ సంకీర్తనము నెంతో మధురగతిని బోధిస్తున్నవీ గీతలు.

'హరికథా తురగముండగా వదలి, పదద్రోయు
గార్దభము నెక్కకు రోయి ?'

అని చక్కగా సన్మార్గమును సూచించును.

'చెడుదారులబడి లంపటమున జిక్కి
మద్దెలలో చిక్కిన ఎలుకవలె అయిన దీ దేహము'

ఉపమానములు హృదయాకర్షకములుగా ఉంటాయి. సరళమయిన ఉపదేశసరణి, జటిలమయిన ప్రమేయ విషయమూ వ్యాసరాయల దేవరనామములలో ఉండి ఇటు పండితులకూ అటు పామరులకూ ఆనంద వికాసాలను కలిగిస్తాయి

తెలుగు రాయలకూ, తెలుగు ప్రజలకూ ఇలవేలుపైన తిరుపతి వేంకటేశ్వరునిపైన హరిదాసులు

అనేక సంకీర్తనలను రచించినారు. దాసకూట ప్రవర్తకుడయిన వ్యాసరాయలు రాజప్రతినిధిగా తిరుపతికివెళ్లి అక్కడ 12 సంవత్సరాలు వేంకటేశ్వరుని పూజాదికములు నిర్వర్తించినాడు. ఇప్పటికీ ఆ ఆలయ ప్రాకారంలో ఒకచోట వ్యాసరాయలు తపస్సు చేసినచోటు అని వ్రాసి ఉన్నారు. తిరుపతికీ వ్యాసరాయలకూ ఉన్న సంబంధాన్ని వివరించే చరిత్ర కొంత దీనివెనుక ఉన్నది. అంతవరకూ కన్నడ హరిదాసులకు పండరి కేంద్రంగా ఉండేది. వ్యాసరాయల కాలంలోనే తిరుపతి హరిదాసులకు ముఖ్యకేంద్రమయిఉంటుంది. ఈ కన్నడ హరిదాసులు తిరుపతిక్షేత్రాన్ని, ఆ వేలుపునూ ఎన్నోపదాలలో సంకీర్తన సలిపినారు. ఆనాటి హరిదాసులందరికి గురువుగా ఉండిన వ్యాసరాయలకు తిరుపతిలోఉన్న స్థానమాన్యాలు పదేపదేవారికి ఆ క్షేత్రాన్ని దర్శింపచేసి ఉంటాయి. అదేకాలంలో తెలుగులో ప్రసిద్ధసంకీర్తనకారుడయిన తాళ్లపాక అన్నమాచార్యులు తిరుపతిలో ఉన్నాడు. కన్నడ హరిదాస యుగపురుషుడయిన పురందరదాసు (క్రీ. శ. 1494—1564) తిరుపతిలో అన్నమాచార్యులను చూచినట్లూ వారు పరస్పరం గౌరవించుకొన్నట్లూ తాళ్లపాక చిన్నన్న ద్విపద కావ్యంకూడా తెలుపుతుంది. తాళ్లపాకవారి తరువాత తిరుపతి వేంకటేశ్వరునిపైన దేశభాషలలో అధిక సంఖ్యాకంగా కీర్తనలు కన్నడ హరిదాసులే రచించినారు. వ్యాసరాయలు కారణంగా హరిదాసులకు విజయనగరము గురుపీఠమూ, తిరుపతి హరిపీఠమూ అయినవి. హరిదాసుల రచనలలో విజయనగర జనజీవన చిత్రాలు విరివిగా కనిపిస్తాయి. తన సమగ్రజీవితమూ వైష్ణవానికి అంకితముచేసి చిరకాలం దేశను మరువలేని భక్తశిఖామణులను రూపొందించి విజయనగరంలో జీవించి చివరికి విజయనగరంలోనే, వ్యాసరాయలు దాని వినాశానికి కించిత్పూర్వము పరమపదించెను. నేటికీ వ్యాసరాయల సమాధి తుంగభద్రానదీ తీరంలో హంపీశిథిలాలకు చేరువగా నవబృందావనమని పిలువబడేచోట విరాజిల్లుతున్నది. కర్ణాట హరిదాసకూట వ్యవస్థాపకుడు స్వయంగా ఆ సాహిత్యాన్ని సృష్టించినవాడూ తెలుగురేని రాజధానిలో చిరముగా నిలిచిపోయినాడు.

వ్యాసతీర్థుల శిష్యులందరూ ప్రసిద్ధులు. ఆ యోగీంద్రుడు పాత్రమెరిగి విద్యాదానము చేసినవాడు. స్వరూప యోగ్యతలను గుర్తింపగలిగిన జ్ఞాని కావటం చేతనే వర్ణవ్యవస్థ కట్టుదిట్టములుగాఉన్న ఆ దినములలో పురందరదాసుకూ కనకదాసుకూ మంత్రోపదేశం చేయగలిగినాడు. ఆ ఇద్దరూ వ్యాసరాయలకు చాల ప్రీతిపాత్రులు అయినారు. ఈ విషయాన్ని తెలిపే రచనలు ఆ సాహిత్యంలో చాల ఉన్నాయి. ఆ యిద్దరి జీవిత చరిత్రలూ చాల చిత్రములుగా ఉంటాయి.

పురందరదాసు పండరికి సమీపములోఉన్న పురందరగడ మనే గ్రామంలో ఒక రత్నాలవ్యాపారి. అతడు వ్యాసరాయల శిష్యుడు కాకముందు అతని పేరు శ్రీనివాసనాయకుడు. అతనికి నవకోటి నారాయణుడని బిరుదముండేది. అంత ధనవంతుడన్నమాట. దానికి తగినంత లోభితనము అతని దగ్గరుండేది. జీవితంలో గొప్ప పరివర్తన రావలసిన యోగము కలిగింది. యాచించటానికివచ్చిన బ్రాహ్మణుడతని పాలిటి భగవంతుడయినాడు. ఆ యాచకుణ్ణి పదిసార్లు తిప్పుకొని చిలుముపట్టిన కాసుఇచ్చి పొమ్మన్నాడు. అతడు శ్రీనివాసనాయకుని ఇల్లాలినిచూచి విషయము తెలిపినాడు. ఆ సాధ్వి తన ముక్కులోని బంగారు ముక్కరను ఇచ్చి పంపింది. దాన్ని అమ్మడానికి మళ్లీ శ్రీనివాసనాయకుని దగ్గరకే వెళ్లినాడు. ఆ సొమ్ము తన భార్యదని పసిగట్టి దాన్ని పెట్టెలో భద్రపరచి ఇంటికిపోయి భార్యను 'ముక్కర ఎక్కడ' అని ప్రశ్నించాడు. పెట్టెలో దాచి ఉంచినట్లు చెప్పింది. తెచ్చి చూపమన్నాడు. ఆ ఇల్లాలు తాను చేసిన పనికి పరితపించకుండా ఆత్మ త్యాగానికి పూనుకొన్నది. భగవంతుడు దయామయుడు. ఆమె త్రాగవలసిన విషపాత్రలో ఆ ముక్కరను పడవేసినాడు. తెచ్చి భర్తకు చూపింది. మళ్లీ దుకాణమునకుపోయి పెట్టె తాళములు గట్టిగా ఉన్నది చూచినాడు. తెరిచిచూస్తే అందులో ఆ ముక్కరలేదు. ఆ యాచ

కునికై వెతికినాడు. అతడూ కనిపించలేదు. శ్రీని వాస నాయకుని జన్మ ఆ క్షణంలోనే పండిపోయింది. గొప్ప గొప్ప పర్వదినాలలోనైన పండరినాథునిముందు భజన చేయవలసి వచ్చినపుడు తాళముకానీ, తంబూర కానీ పట్టాలంటే సిగ్గుపడే శ్రీమంతుడు, ఎంగిలి చేతితోనైనా కాకిని తోలని పిసినిగొట్టు, సమస్తమూ సత్పాత్రులకు దానంచేసి 'కృష్ణార్పణమస్తు' అని బరువు దింపిన రీతిగా భావించి జోలికట్టి చిటిక పట్టి తంబూరమీటుతూ బయలుదేరినాడు. భార్య తనకు చేసిన ఉపకారాన్ని ఉద్గారంగా పలుకుతా డొక చోట 'అయినదంతా మంచిదే అయినది. ఆ యిల్లాలి కులము వెయ్యిగా వర్ధిల్లవలె. తంబూరపట్టుటకు తలవంచుకొనేవాడను నాచేత తంబూర కొలపట్టిం చింది...'. తులసీదాసుకు భార్యవలన కనువిప్పు కలిగి నట్లే పురందరదాసుకూ అతని భార్యవల్లనే జ్ఞానో దయం కలిగింది అతనిలో తాత్వికమయిన దాహం బయలుదేరింది. నవకోటినారాయణుడుగా ఉన్నప్పుడు విజయనగరానికి రత్నాల వ్యాపారానికిగాను చాలసార్లు వెళ్లినాడు కాబోలు వ్యాసరాయల ప్రసక్తి ఎప్పుడో విన్నది గుర్తుకు వచ్చింది. ఆ మహానుభావుడైతే తనకు దారి చూపగల డనుకొన్నాడు. అతనిని ఆశ్ర యించినాడు. ఆ యోగీంద్రుడు అనుగ్రహించి మంత్రోపదేశంచేసి 'పురందర విఠల' అనే అంకితమును (మకుటమును) ప్రసాదించి హరిదాసులలో ప్రాగ్గణ నీయుడుగా వర్ధిల్లమని దీవించినారు. వెంటనే పురం దరదాసు.

'వ్యాసరాయల చరణ కమల దర్శనము నాకు
ఎన్ని జన్మల సుకృత ఫలమై దొరకినదో—నాదు
సహస్ర కులముల సమూహమును పావనమయ్యె
శ్రీశుని భజించుట కధికారి నేనైతి'నని పాడినాడు

తానెట్లు పురందర విఠలాంకితుడైనదీ చెబుతూ,

'అంకితముండక యుండరాదని
పంకజనాభ శ్రీ పురందర విఠలుని
అంకితము నా కిచ్చెను గురువ్యాసరాయలు'

అన్నాడు.

పూర్వాశ్రమంలో పురందరదాసు రత్నాలను దేశమాద్యంతమూ సరఫరాచేసే ధనవంతుడయితే ఇప్పుడతడు వైష్ణవ సంకీర్తన వాఙ్మయ రత్నాలను అమూల్యంగా అందరికీ అందచేసే పావన సంపన్న జీవనుడు అయినాడు. అతడు నాలుగు లక్షల డెబ్బై ఐదువేల దేవరనామములు రచించినట్లు ప్రసిద్ధము. ఇప్పటికీ సహస్రాధికంగా పురందర విఠలాంకిత పదాలు ప్రచారంలో ఉన్నవి. సర్వసంపదనూ సత్పాత్రులకు దానము చేసిన తరువాత తానూ తన భార్యా నలుగురు పుత్రులూ, ఒక పుత్రిక, సేవకుడూ విజయనగరం చేరుకొన్నారు. అందరూ వైష్ణవదీక్ష నందినారు. అందరూ దేవరనామములను రచించినారు.

పురందర విఠలనా, అనే ముద్రికతో ఉన్నవి పురందరదాసు వ్రాసినవనీ, వరదపురందర, గురు పురందర, మధ్వపతి పురంధర, అభినవ పురందర విఠలాంకితములయినవి అతని పుత్రులు వ్రాసినవనీ, తందెపురందర విఠలాంకితమయినవి అతని కూతురు వ్రాసినవని, శ్రీపురందరవిఠలాంకితములయినవి అతని భార్య రచించినవనీ, ఒడెయ పురందర విఠ లాంకితములయినవి అతని సేవకుడు రచించినవనీ ప్రతీతి.

పురందరదాసు సృష్టించిన సాహిత్యము భాగ వత తత్త్వపు విశ్వరూపమే అని చెప్పవచ్చు. భగవద్భక్తిని సామాన్య మానవ హృదయాలలో పాదుకొల్పటానికి ఈతని రచనారీతులు బహుముఖంగా నడచినవి. భాషా, భావమూ, సన్నివేశమూ చదివిన ప్రతివ్యక్తి తనవిగానే అనుకొనేటట్లు ఈతని రచనలో ఉంటాయి. అవి ఆపాతమధురమేకాక ఆపాతవేద్యమూ అయి ఉండటం గమనింపదగినది. ఉపనిషద్రహస్యాలనుకూడా కన్నడ భాషలో స్వయంసమగ్ర వాచావైభవంతో, చదువు నేర్చినవారికి కాదుకదా, నిరక్షరాస్యులకుకూడా తేటతెల్లముచేసే సరళతా, శక్తి పురందరదాసు కీర్త నలలో ఉన్నవి. అందుకే గురువైన వ్యాసరాయలే వాటిని 'పురందరోపనిషత్తు'లని పిలిచి గౌరవించి నాడు. సాహిత్యము విశ్వశ్రేయో సాధనమే అయితే పురం

దరుల హరిదాససాహిత్యము ప్రాగ్గణనీయము.సోదాహరణ ముగా పురందరుల సాహిత్య విమర్శ చేయబూనితే అది బృహద్గ్రంథానికి వస్తువుకాగలదు. అతనిని మహా భక్తుడుగానూ, సాహిత్య శిల్పిగానూ సంఘసంస్కర్త గానూ, సూక్తికారుడుగానూ, దార్శనికుడుగానూ నిరూపించటానికి ఏపాటి శ్రమా అవసరంలేదు.

ఇక అతడు కర్ణాట సంగీత పితగానూ, లక్షణ కారుడుగానూ త్యాగయ్యా, తులజేంద్రుడూ మొద లయిన సంగీత కోవిదులు మాన్యతనిచ్చినారు. దాక్షి ణాత్య సంగీత సంప్రదాయము పురందరదాసు భిక్ష యని ముక్తకంఠంతో మద్రాసు సంగీత అకాడమీ త్రైమాసిక పత్రిక "Purandaradasa has also been justly termed the father of Karnatic music. He was not merely a composer, but a lakshanakara of the highest calibre. The system of South Indian Music as we now have it is entirely his gift" అంటుంది.

ఈ విధంగా కర్ణాట సంగీత సాహిత్య యుగ పురుషుడయిన ఈ మహానుభావుడు తెలుగు రాజధాని అయిన విజయనగరానికి వచ్చి తన జీవితశేషాన్ని సమ గ్రంగా అక్కడేగడపి చివరకి అక్కడే అవతార సమాప్తి కావించినవాడు. ఇప్పటికీ విజయనగరంలో శిథిలాలనానుకొని తుంగభద్రాప్రవాహానికి ప్రక్కన ఒక రాతిమంటపం, ఈ ఉజ్వలమూర్తి పవిత్రజీవన చైతన్యానికి రంగస్థలంగా ఉండి నేడుచూచే సామాన్య ప్రేక్షకునికి మూగనోయి కనిపిస్తుంది. అక్కడి వాళ్ళ నడిగితే అదే 'పురందరదాస మంటప" మని చూపు తారు. అందులో పురందరదాసు భవ్యాత్మ–సాన్నిధ్య మున్నదని ఆస్తికులు విశ్వసించే ఒక రాతి స్తంభ మున్నది. దానినే "పురందరదాసర స్తంభ" అని పిలుస్తారు.

వ్యాసరాయలూ పురందరదాసూ విజయనగరంలో జీవిస్తూ ఉన్నకాలంలోనే ధారవాడ జిల్లా బంకా పురానికి చెందిన ఒక బోయపాలెయగారు పురందర దాసువలె జీవితంలోనే పువర్జన్మపొంది వ్యాసరాయుల నాశ్రయించి మంత్రోపదేశాన్ని పొంది దాసకూటంలో చేరి ధన్యుడయినాడు. అతడే కనకదాసు. కనకదాసు పెక్కు యుద్ధాలలో పాల్గొని ఒకసారి యుద్ధంలో మరణిస్తే కేశవుడువచ్చి అతనిని బ్రతికించినాడట. తరువాత అతనిలో గొప్ప పరివర్తన వచ్చింది. వ్యాస రాయల అనుగ్రహానికి సంపూర్ణంగా పాత్రుడయిన తరువాత కనకదాసు కాగినెలె ఆదికేశవాంకితములయిన కీర్తనలు పెక్కులు రచించినాడు. అంతేకాక, "మోహన తరంగిణి", "రామధ్యాన చరిత్రె" "నళచరిత్రె" మొదలయిన సాంగత్యాలు షట్పదీ కావ్యాలు చాల రచించినా డితడు. ఇతడు కేశవనామములు (24) కూర్చి వ్రాసిన సంకీర్తన రచన కన్నడదేశంలో ఆస్తిక కుటుంబాలలో ఆబాలవృద్ధులు పాడుకొంటారు. ఇతని భక్తినీ, నిర్మలమైన అంతఃకరణమునూచూచి వ్యాసరాయలు అమితంగా గౌరవిస్తూ ఉంటే అగ్ర జాతివారు అసూయపడేవారని పురందరదాసు రచించిన ఒక పదమునుబట్టి తెలుస్తున్నది. ఉడిపిలో శ్రీకృష్ణుని దర్శనానికి వెళ్లినపుడు 'తలుపు తీయమని' ప్రార్థిస్తే కృష్ణుడు అతడు నిలబడిన వైపు మొగముత్రిప్పి నిలిచినట్లూ, అతడు ఆ విరాట్టును చూచిన కిటికీని 'కనకనఖిండి' అని ఆ నాటినుంచీ పిలుస్తూ ఉన్నట్లు ప్రసిద్ధంగా ఉన్నవి. ఇతని రచనలలో భక్త్యావేశమూ హార్దికగుణమూ మెండుగా ఉంటాయి. ఇతని కావ్యములలోని పురవర్ణనలలో విజయనగర ప్రతిరూపాలు గోచరిస్తాయి. పురందర దాసు తరువాత ఆ యుగంలో అద్వితీయుడయిన హరిదాస సాహిత్య నిర్మాత కనకదాసు.

ఇదే కాలంలో వ్యాసరాయల మరిద్దరు శిష్యులు వాదిరాజతీర్థులూ, విజయీంద్రతీర్థులు. ఈ యిద్దరూ ద్వైత వేదాంత పీఠాధిపతులై శాస్త్ర గ్రంథాలు రచించటమేకాక వ్యాసరాయల మార్గాన్ని శిరసావహించి పదసాహిత్య రచన కూడా చేసి నారు. వాదిరాజతీర్థులు మాఘకావ్యానికి ప్రతి స్పర్ధిగా "రుక్మిణీశ విజయ" మనే ప్రౌఢకావ్యాన్ని సంస్కృతములో రచించిన గొప్పకవి. ఇతని ఆరాధ్య దైవము హయగ్రీవమూర్తి. 'హయవదన' ముద్రాంకి తంగా పెక్కు దేవరనామములు పాడి, అనేక సాంగత్య షట్పదీకావ్యాలు రచించిన సంతకవి వాదిరాజతీర్థులు.

దక్షిణ భారతంలో సన్నిద్ధరాళ్వురులని ప్రసిద్ధిపొందిన వైష్ణవ ఆళ్వారుల తరువాత వైష్ణవభక్తి సాహిత్యాన్ని దేశభాషలలో ఇంత విరివిగా వెలయించిన వారంటే కన్నడ హరిదాసులే. ఆళ్వారుల దివ్యప్రబంధ పాశురము లుపనిషత్తులకు బదులుగా దేవతోత్సవాలలోపాడే అలవాటు ఉన్న రీతిగానే హరిదాసుల దేవరనామములూ మాధ్వమఠాదులలో దేవ పూజా సమయంలో పాడే ఆచారమున్నది.

మొదలాళ్వారులని ప్రసిద్ధి పొందిన పాయ్‌గై ఆళ్వారు, పూదత్తాళ్వారు, పేయాళ్వారు భిన్నదేశాలకు చెందినవారు. ఆ ముగ్గురూ ఒకరోజు తిరుక్కోవెలూరులో కలిసికొన్నట్లే, వ్యాసరాయలూ, పురందరదాసూ, కనకదాసూ విజయనగరంలో కలుసుకొన్నారు. చాల విషయాలలో వైష్ణవ ఆళ్వారులకూ కన్నడ హరిదాసులకూ పోలికలున్నాయి. పాయ్‌గై ఆళ్వారు 'భూమిని ప్రమిదనుచేసి, సప్తసాగరాలనూ నెయ్యిగా పోసి, జ్యోతిర్మయుడయిన సూర్యుణ్ణి దీపంగాచేసి, వాఙ్మయ ముక్తాఫలాలనుకూర్చి సహస్రార సుదర్శన చక్రపాణి పొన్నడుగుదమ్ములను కైసేసి' సేవచేస్తే, పురందరదాసు 'బ్రహ్మాండమే మంటపము, జ్యోతిశ్చక్రమే దీపము, మహామేరువే సింహాసనము, మహాలక్ష్మియే ఆభరణము, అమృతమే నైవేద్యముగాజేసి' విష్ణుమూర్తిని సేవిస్తాడు.

పేయాళ్వారు విష్ణుమూర్తిని చూచి

'సిరిని చూచితిని
బంగారుమేనిని చూచితిని
యుద్ధమందు జ్వాలలు క్రక్కే
సుదర్శనమును చూచితిని
పాంచజన్యము పట్టిన
చేతిని చూచితిని
కడలివంటి వన్నెగల
మేనిని చూచితిని'

అని వర్ణిస్తే పురందరదాసు,

'కోటి సూర్య ప్రకాశమనిపించు
కిరీటమును మస్తకమునగంటి
చూపున కాశ్చర్యమగు నగుమొగముపై
తిరుమణినిగంటి, చతురహస్తముల
సాటిలేని శంఖచక్రగదాబ్జములగంటి'

అని తిరుపతి వేంకటేశ్వరుని దర్శించి కీర్తిస్తాడు.

పెరియాళ్వారు (విష్ణుచిత్తుడు) వాది నిగ్రహం చేసి వైష్ణవాన్ని స్థాపించినపుడు విష్ణుమూర్తి సర్వాలంకారసుందరుడై లక్ష్మీసమేతముగా గరుడారూఢుడై వచ్చినాడు. ఆ ముగ్ధ మోహన సౌందర్యమూర్తికి ఎక్కడ దిష్టి తగులుతుందో అని ఆ ఆళ్వారు 'పల్లాండు' పాడినాడు: 'అనేక సంవత్సరాలు, అనేక సహస్ర సంవత్సరాలు, అనేకకోటి సంవత్సరాలు, ఎర్ర తామరలవంటి నీ పాదముల అందానికి రక్ష'.

హరిదాసులు భగవంతుని అందాన్ని అపరోక్షంగా చూచి ఈ విధంగానే దిష్టి తగులుతుందని పాడిన పదాలు ఈ సాహిత్యంలో చాలా ఉన్నవి. పురందరదాసు.

ఎటువంటి పాపిష్టి దిష్టిసోకినది గోపాలకృష్ణునికి
....
అంగితొడిగి ఉంగరముపెట్టి కనులకు కాటుకతీర్చి
ముంగిలిలో ఆడుకొంటూ ఉంటే
అంగనల దిష్టి యిదేమో—ఎటువంటి పాపిష్టి
దిష్టిసోకినది గోపాల కృష్ణునికి' అని అంటాడు

ఇంకొకచోట పురందరదాసే— 'దిష్టిసోకినదే మా కృష్ణరాయనికి సృష్టిలో అంగనలు కన్నుంచి త్రావెదరే' అని ప్రారంభించి దశావతారములనూ ఆ కీర్తనలో ధ్వనింపచేస్తూ సాహిత్య శిల్పాన్నికూడా చూపుతాడు.

పూదత్తాళ్వారును భూతముని అనీ మహదాహ్వయాళ్వారును పేయాళ్వారనీ పిలుస్తారు. లోకాన్ని మరచి భక్తి పారవశ్యంతో అలౌకికానందమందుతూ చేసేవారి చేష్టలనుచూచి పెయ్‌పిడిత్త—దయ్యంపట్టిన ఆళ్వారులని లోకం పిలిచింది. విజయనగరంలో ఈ హరిదాసులూ ఆ విధంగానే ఉండేవారు. జగన్నాథదాసు అనే కన్నడ **హరిదాసు వాళను**

గూర్చి వర్ణిస్తూ 'రంగా! నిన్ను కొనియాడే మంగళాత్ములు నవ్వుతారు, ఏడుస్తారు, చిందులుత్రొక్కుతారు, మూగవారివలె, చెవిటివారివలె లోకులకు కనిపిస్తారు' అని చక్కగా వారిచేష్టలను వివరిస్తాడు.

సుసంపన్నమయిన విజయనగర వీథులలో తంబూర మీటుతూ, చిటికవేస్తూ, పక్షివాహన నాట్యంచేస్తూ, దేవరనామములు పాడుతూ పారవశ్యంలో నడచిపోయే ఈ హరిదాసులకు పురంధ్రులు చేటలనిండా ముత్యాలు రత్నాలు తెచ్చి భిక్ష పెట్టేవారు. గండభోగములందు ముద్రశులహరులు కప్పి ఉంటే, నుతులు పాడుతూ భక్తిజనితోద్య త్తాండవమాడుతూ జగమును మరచి ఏ అపరాహ్ణ వేళకో ఇల్లు చేరుకొంటే హరిదాసుల ఇల్లాండ్రు ఆ జోలి సంచులను కుమ్మరించి చూచి నిట్టూర్పవలసి వచ్చేది. అందులో బియ్యంకంటే రాళ్లే (రత్నాలే) ఎక్కువగా ఉంటే వాటిని వాళ్ళు ఏరిపారవేసి చాలీచాలని బియ్యాన్నివండి హరికి నివేదించి అతిథికిపెట్టి అనంతరం తామందరూ ఆరగించేవారు. సమలోష్టాశ్మ కాంచన దృష్టి హరిదాసులకేకాక వారి కుటుంబాలవారికీ ఉండేది.

విజయనగరంలోని సిరిసంపదలకు బలిసిపోయిన లౌకికులకు హరిదాసులిచ్చిన హెచ్చరికలు అన్నికాలాలవారికీ అర్థవంతములుగానే ఉంటాయి.


'నమ్మకుము ఈ భాగ్యము ఎవరికీ
స్థిరముకాదు నిశ్చయము హెచ్చరిక'

'పెరుగక పొంగక ఉన్నచో
లోకమునకు మెప్పు నినుము హెచ్చరిక'

'పడయిపోవును కాయము నిలుచునదొక
కీర్తియే ఇలయందు హెచ్చరిక'

హరిదాస కుటుంబాలనుండి బయటపడిన ముత్యాలూ రత్నాలూ కొందరు ఏరుకొని దాచుకొంటే మరికొందరు హరిదాస కూటాలు వెలువరించిన సూక్తి రత్నాలను ఏరుకొని పదిలపరచినారు. నిజమైన రత్నాలు కాలంలో కరగిపోయినవి. దాచినాదాగలేదు. కానీ సూక్తిరత్నాలు భావితరాలవారికి భాగ్యంగా నిలిచిపోయినవి. యుగాంతపువేళనయినా నిలిచిఉండగలవు.

విజయనగర శిథిలాలుకూడా అనంతమయిన కాలప్రవాహంలో ఎప్పటికయినా అరిగి అగుపించకుండా పోవచ్చు. వానితోపాటు 'పురందరదాసర మంటప'మూ, వ్యాసరాయల సమాధీ మటుమాయం కావచ్చు. కానీ శ్రుతులుగా వేదాలు జీవిస్తూ ఉన్నట్టే హరిదాస వాణికూడా అమరమై ఆచంద్రతారార్కంగా విశ్వశ్రేయాన్ని విస్తరింపజేస్తూ విరాజిల్లగలదు.



కలగూరగంప:

ఉత్తర హరివంశము

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారు ఈ మధ్య నాచనసోముని ఉత్తర హరివంశమును ప్రకటించిరి. వారు తొలిపలుకులలో 'ఈ గ్రంథమునకు విపుల వ్యాఖ్య వ్రాయుటయేగాక దేశమందలి తాళపత్ర ప్రతులు పరిశీలించి ఉత్తమ ప్రతినొకటి ప్రచురింప వలయునని తోచినది......ఇందుకొరకు సంపాదకవర్గమును యేర్పాటు చేసినారు' అని ప్రకటించినారు. కాని ఆ సంఘమునందుగల సంపాదకవర్గము వారి పేర్లు అకాడమీ వారు ప్రకటింపలేదు.

ఇక విపుల వ్యాఖ్య నొకదానిని వ్రాయుటకు ఈ సంపాదకవర్గము నియమింపబడినట్లు పై వాక్యములవలన తెలియుచున్నది. కాని దీనికింతకుముందు కీ. శే. వేటూరు ప్రభాకరశాస్త్రిగారు, కీ. శే. పురాణపండ మల్లయ్యశాస్త్రిగార్ల వ్యాఖ్యలు గలవు. సుప్రసిద్ధులగు మహాపండితులు వ్రాసిన రెండు వ్యాఖ్యలుండగా ఈనాడు అకాడమీవారు క్రొత్తగా వ్యాఖ్య వ్రాయించుటకుగల యావశ్యకత ఏమో యూహింపజాలకున్నాము.

ఈ గ్రంథము వ్యాఖ్యతోగూడ ప్రకటితము గావలసినదే. వ్యాఖ్యలు ముందుగా నొక యుత్తమ ప్రతిని ప్రకటించుటకు అకాడమీవారు నిశ్చయించి దీనిని ప్రకటించినారు. 'దీని సంపాదకురాలు శ్రీమతి పి. యశోదారెడ్డిగారు సమర్థతతో నీ కావ్యము పరిష్కరించి ప్రకటించినారు' అని అకాడమీవారు వారికి కృతజ్ఞతను తెలిపియున్నారు. కాని గ్రంథము మొదటనుంచి చివరవరకు పరిశీలింపగా ఇంతవరకు ముద్రితమై ప్రాచీనమైన ప్రబంధములందు కానరాని యతి గణ ప్రాస భంగములు దీనియందు కానవచ్చుచున్నవి. అవి అన్నియు వివరముగా చూపినచో ఒక పెద్ద వ్యాసమగును. ప్రస్తుతము హంస డిభకోపాఖ్యానమునుండి ఈ క్రింద కొన్ని చూపించుచున్నాను. ఇంకను ఇట్టివి యున్నవి. ఈ హంసడిభకోపాఖ్యానము గ్రంథమున చతుర్థాశ్వాసములోనిది.

యతిభంగములు

4—26 తే॥ నెనరు వారికి నుబుకంగ నొక్కియున్న.

4—30 చ॥ తను వనజాత నూతన బలాకము (బుష్కరమన్ తబాకమున్.)

4—148 ఉ॥ ఉండుట తప్పువారికడ నుండమి తప్పిటరాక తప్పరా.

గణభంగములు

4—4 క॥ రంసా మతిం దత్కథాంతరము వినవలతున్

4—48 ఉ॥ శ్రీ సురుండు జగతీ పతికిన్ సఖుండై సుతోదమో

4—38 క॥ బ్రీతి జేయఁగఁ దలంచి పిలువంబనిచెన్

ఈ చతుర్థాశ్వాసమునందేకాక గ్రంథమునగల తక్కిన అయిదాశ్వాసములయందును శతాధికములగు ఛందోదోషములు కన్పట్టుచున్నవి. వీనితోపాటు వ్యాకరణమునకు సంబంధించిన అర్థానుస్వార దోషములు ముద్రణస్ఖాలిత్యములు. ప్రత్యి తండములుగా నున్నవి. ఇందువలన సాహిత్యమునందాసక్తి కలిగిన విద్యార్థులు దీనిని చదువుకొనుటకెంతో క్లేశపడుచున్నారు.

పైన చూపిన గ్రంథ ముద్రణమునకు సంబం

ధించిన దోషములేగాక పీఠికయందు సంపాదకురాలు వ్యక్తపరచిన అంశములును విమర్శనీయములై యున్నవి.

నాచన సోమనాథుని కాలము

సంపాదకురాలు 'నాచన సోముని కాలమును గూర్చి పండితులలో బలుదగవులున్నవి. కేవలము నాచన సోముఁడేని, ఎఱ్ఱాప్రగడయేని హరివంశమును వ్రాసినచో నీతని కాలనిర్ణయమున కిన్ని వివాదము లుండెడివికావు. ఈకవి కాలనిర్ణయము మహాకవులైన ఇద్దరి హరివంశ రచనల పౌర్వాపర్యముతో జోడింప బడినది.' 'ఈతడు క్రీ. శ. 1280 ప్రాంతమున జన్మించి క్రీ. శ. 1350—55 వరకు జీవించి యుండవచ్చునని తలచుట కవకాశమున్నది.' అనివ్రాసిరి.

కాని వాస్తవముగా పండితులలో ఈతని కాలమును గూర్చి వివాదమేలేదు. అంతేగాక ఎఱ్ఱన నాచన సోముల హరివంశ రచనల పౌర్వాపర్యములతో జోడింపబడినది గావున ఇందనేకములైన ఇతర విషయములు ప్రవేశించెనని వ్రాయుట ఎంతమాత్రము సరికాదు. ఏలననగా ఎఱ్ఱనకాలము హరివంశ రచన చేతనేగాక అతని నృసింహపురాణ రచనచేతనే నిర్ణీతమై యున్నది. అందున ఎఱ్ఱన తాను వెలనాటి చోడుని వలన మన్ననగన్న భీమన మంత్రికి నాలుగవ తరము వాడనని చెప్పుకొన్నాడు. ఆ వెలనాటి చోడుడు క్రీ. శ. 1160—81 వరకు పాలించుటచేత తరమునకు 25 సంవత్సరములు లెక్కించినను ఎఱ్ఱన క్రీ. శ. 1260—80 ప్రాంతములం దుండవచ్చును. ఆంధ్ర కవితరంగిణికారులును ఈ కాలమునే ఆమోదించిరి. ఇక ఎఱ్ఱన హరివంశము రెడ్డిరాజ్యస్థాపకుడగు ప్రోలయ వేమారెడ్డికి అంకితమైనది. ప్రోలయవేమా రెడ్డి క్రీ. శ. 1320 నుండి 53 వరకు పరిపాలించినాడు. ఎఱ్ఱన తన హరివంశమును ప్రోలయ వేమారెడ్డికి క్రీ. శ. 1320 ప్రాంతముననే కృతి నిచ్చినట్లు అవతారికలోని విషయములు శాసనములతో సమన్వయించి ఇదివరకే నిర్ణయింప బడినది.[1]

పై దానిని బట్టి ఎఱ్ఱన హరివంశ రచనము క్రీ. శ. 1320 ప్రాంతముననే నిర్ణయమయినపుడు వీని పౌర్వాపర్యములుగూర్చి చర్చించుటయే అనావశ్యకము. నాచన సోముని కాలము పెంచుకలదిన్నె శాసనమునుబట్టి క్రీ. శ. 1344 అగుటచే సోమన ఆ కాలమున నున్నాడనియే తెలియుచున్నది. దాని తరువాత ఎంతకాలమునకు ఈ ఉత్తర హరివంశము వ్రాసినాడో మనకు తెలియక పోవుటచేత సోముని హరివంశ రచనకన్న ఎఱ్ఱన హరివంశ రచనయే పూర్వమని నిర్వివాదముగ తేలినది.

నాచన సోముని గ్రంథములు

నాచన సోముని గ్రంథములుగా సంపాదకురాలు 1. ఉత్తర హరివంశము 2. హరి విలాసము 3. వసంత విలాసము 4. ఆదిపురాణము 5. హర విలాసము అని వ్రాసినారు. ఆదిపురాణమునుగూర్చి 'కనుక అప్పకవి ఆదిపురాణమనుచు నుద్ధరించిన గ్రంథము నిజమైయున్నచో సోము డాదిపురాణమను వేరొక గ్రంథమును రచించెననుటయే యుక్తము' అని కలదు. ఈ నిర్ణయముకూడ సరికాదు. ఆదిపురాణమునకు హరివంశమునకు ఏ మాత్రము సంబంధము లేదు. ఆదిపురాణ మనునది జైనకావ్యము. ఇది జైనులలో ప్రథమ తీర్థంకరుడగు పురుదేవుని చరిత్రమనియు, దీనిని క్రీ. శ. 953 ప్రాంతమున నున్న సర్వదేవుడను జైనకవి రచించెననియు తెలియుచున్నది. ఈ ఆదిపురాణమునుండి రెండు పద్యములు మనకు లభించుచున్నవి. ఈ సర్వదేవునిగూర్చి ఆదిపురాణమునుగూర్చి వివరములు ఈ వరకు వాఙ్మయ చరిత్రకు పరిచితములే[2]. ఇందుచే ఆదిపురాణ రచన నాచన సోముని దెంతమాత్రము కాదని స్పష్టము.

---

1. ఎఱ్ఱన హరివంశరచనాకాలము—శ్రీ నిడదవోలు వేంకటరావుగారు. పరిశోధనపత్రిక, సంచిక 14—1956.

2. తెనుగుకవుల చరిత్ర—శ్రీ నిడదవోలు వెంకటరావుగారు. పుట 90 నుండి 96 వరకు. మదరాసు విశ్వవిద్యాలయ ప్రకటితము. 1950.

సోముని ఇతర గ్రంథములుగూర్చి ఇంత చర్చ చేసిన సంపాదకురాలు అప్పకవియే సంయుతాసంయుత ప్రాసక్రింద సోముని హరివంశమునందు పేర్కొన బడిన ఈ క్రింది పద్యమునుగూర్చి పీఠికయందు ఏమియు తెలుపకపోవుట చిత్రముగా నున్నది.

శా. నాతో మార్కొనలేరు నిర్జరపురీ
నాగేంద్ర బృందారకా
రాతు ల్మున్నగు దేవసంఘములు
పోర స్థిర సంగ్రామ కుం
డీ త్రైలోక్యమునందుఁ గల్గఁడు
రణం బెచ్చోట లేకుండఁగాఁ
జేతుల్వేయు వృథా భరం బగుచు
వచ్చె న్దేవ ఈ మేనికిన్.

ఈ పద్యము ఉత్తర హరివంశమున పంచమాశ్వాసమున శివునితో బాణుడు తనకు వేయిచేతులు ఇచ్చిన వరమునుగూర్చి విన్నవించిన సందర్భములోనిది.

ఇది ఇట్లుండ ఈ మధ్య సాహిత్య అకాడమి వారే ప్రకటించిన కావ్య పరిమళమున ఉత్తర హరివంశమునుగూర్చి వ్రాయుచు శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు నాచనసోమునికృతి ఒక్క ఉత్తర హరివంశమనియే వ్రాసిరి. అకాడమివారే ప్రకటించిన రెండు గ్రంథములందును ఈ విషయమునుగూర్చి పరస్పర విరుద్ధముగా నుండుట చిత్రముగానున్నది.

నాచనసోమన పూర్వహరివంశమును రచించెనా? లేదా?

హరివంశ సంస్కృతమూలమున పూర్వోత్తర భాగము లున్నవనియు, ఎఱ్ఱాప్రెగడ తన హరివంశమును పూర్వోత్తరభాగములుగా రచించెననియు, నాచన సోముడు ఉత్తరహరివంశము వ్రాయుటచేత, అతడు పూర్వహరివంశమును రచించెనని కొందఱు విమర్శకులు వ్రాసిన విషయము సంపాదకురాలు చర్చించి, తుదకు సోముడు పూర్వహరివంశము వ్రాయలేదని నిర్ణయించినారు.

కాని మూలమున పూర్వోత్తర విభాగములే గాక పర్వవిభాగమున్నట్లుగా ఆమెయే తెలిపినారు. 'పర్వములుగా విభక్తమైన హరివంశప్రతులలో విష్ణుపర్వము 61 వ అధ్యాయముగ నున్నది. '62 వ అధ్యాయమున నున్నది.' (పుట. 16). దీనినిబట్టి హరివంశ మూలసంస్కృత ప్రతులలోనే (1) పూర్వోత్తర విభాగము (2) పర్వవిభాగములుగల రెండు విధములైన ప్రతులున్నవి అన్నమాట. అప్పుడు పై రెండింటిలో ఏప్రతి ప్రాచీనమో, దేనిని ఎఱ్ఱన, దేనిని సోమన అనుసరించిరో సందేహము కలుగుచున్నది. కాని సంపాదకురాలు ఈ విషయమై ఏమియు చెప్పలేదు.

నాచనసోమన పూర్వహరివంశభాగములను విడచిపెట్టి ఉత్తరహరివంశభాగ కథలనే స్వీకరించుటకు బలవత్తరమైన కారణమొకటి కలదు. నాచన సోముడు సాహిత్యరసపోషణసంవిధానచక్రవర్తి. తన కావ్యమున ఆ రసపోషణ సంవిధానమునకు అనుకూలమైన శృంగార వీరఘట్టములనే ఆతడు హరివంశము నుండి గ్రహించినాడు. పూర్వహరివంశమున శ్రీకృష్ణుని బాల్యక్రీడలు, యౌవనప్రాదుర్భావము, బలదేవుని మహిమ మొదలగునవి మాత్రమే వర్ణితములు. అందు శృంగారరసపోషణమునకు అనువగుఘట్టములులేవు. ఆ ఘట్టములన్నియు ఉత్తరభాగమునందే ఉన్నవి. అందుచే తనకు నవసరమగు పూర్వహరివంశభాగమును సోముడు విడచిపెట్టినాడని మనము నిస్సందేహముగా చెప్పవచ్చును.

గ్రం థా వ తా రి క

సంపాదకురాలు గ్రంథావతారికలనుగూర్చి కొంత చర్చ చేసినారు. సోముని హరివంశమునకు అవతారికలేదు. కథతో ప్రారంభము. ఆమె 'తెలుగునందు ప్రథమ కావ్యముగ భారతము వెలసిననాటినుండి సోమనాథునివరకు అవతారికలులేని కావ్యములు రచించినవారు లేరు' అని వ్రాసినారు. కాని ఆ కాలమందే వెలసిన భాస్కర రామాయణమునకే యవతారిక లేదు. అంతేకాక ఆమె సంస్కృతకావ్యములలో నవతారికలు లేవ ట్లుదాహర

ణములు చూపి, చివరకు సోముడు అవతారికలేని కాళిదాసకృతకావ్యముల ననుసరించి అవతారికలేకుండ, కథతో కావ్యము ప్రారంభించినాడని, అందువలన నాతని నవీనగుణసనాథత్వము ప్రదర్శించెనని వ్రాసినారు (పుట 2).

ఉత్తర హరివంశమునందలి, ఆశ్వాసాంత గద్య సరిగా పరిశీలించినట్లయితే సంపాదకుఁడింత వ్రాయ వలసిన అగత్యమేలేదు. చూడుఁడు—ఆశ్వాసాంత గద్య.

'ఇది శ్రీ మదుభయకవిమిత్ర కొమ్మనామాత్యపుత్ర బుధారాధనవిరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబైన శ్రీ మహాభారతకథానంతరంబున శ్రీమత్సకల భాషాభూషణ, సాహిత్య రసపోషణ సంవిధాన చక్రవర్తి, సంపూర్ణకీర్తి, నవీనగుణసనాథ నాచన సోమనాథ ప్రణీతంబైన యుత్తర హరివంశమునందు.'

సోముడే గద్యలో స్పష్టముగా తిక్కన భారత గద్యతో ప్రారంభించి, యిది 'మహాభారత కథానంతరంబున' అని చెప్పుటచేత ఉత్తర హరివంశము ప్రత్యేక గ్రంథమేకాదనియు, తిక్కన విడచిన భారత ఖిలపర్వమగు హరివంశములోని భాగమనియు తెలియు చున్నది. అందుచేత నేకాశ్వాసముగానున్న స్వర్గారోహణపర్వము తర్వాత ఖిలపర్వకథను హరిహరనాథుని కంకితముగా ప్రారంభించి తిక్కన భారతముతో నను సంధించినాడు. ఇది యొకవిధముగా ఎఱ్ఱన అరణ్య పర్వశేషము రచించినట్లు, తిక్కన విడచిన ఖిలపర్వ శేషకథలను నాచనసోముడు రచించినట్లు ఊహింప వచ్చును. ఉత్తర హరివంశము ప్రత్యేకమైన నూతన గ్రంథము కాకపోవుటచే అవతారిక ఆవశ్యకత ఎంత మాత్రము లేదు.

—శ్రీ ఎన్. ఆర్. ప్రసాదరావు.

'మడికిసింగన—కాలము'

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి హైదరాబాదు వారు 1970 లో మడికిసింగన కవి కృతమగు సకల నీతి సమ్మతమను గ్రంథమును శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు, శ్రీ పోణంగి శ్రీరామ అప్పారావుగార్ల సహ సంపాదకత్వమున ప్రచురించి యుండిరి. చిరకాలము తరువాత నైనను వాఙ్మయ పరిశోధనకు బనికివచ్చు నిట్టి సంకలన గ్రంథము ప్రచురణయై పాఠక లోకమున కందుట సంతోషమగు చున్నను గ్రంథముద్రణలో చేరిన ముద్రణ స్ఖాలిత్యములు, పరిష్కారమునకు వచ్చిన చారిత్రకాంశముల తీరునుబట్టి అది అందరికి ఆమోద యోగ్యము గాకపోవుట విచారమగుచున్నది. తెలుగు వాఙ్మయములో నిట్టి ప్రచురణలు అవ్యవస్థితభావము నేర్పరచుటకు దారితీయును కనుక ముందైనా అవి సవరింపబడునని ఇచ్చుట పేర్కొన బడుచున్నది. పరిష్కర్తలలో ఒకరైన శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు దీనికి విపులమైన పీఠిక నొకటి వ్రాసి తొలుదొల్తనే మడికి సింగనకవికాల మందు నిర్ణయించిరి గావున ఆ అంశమునే మొదట ఇచ్చుట గ్రహింతము.

మడికి సింగనకవి రచించిన గ్రంథములు పద్మ పురాణోత్తర ఖండము, భాగవత దశమ స్కంధము, జ్ఞానవాసిష్ఠ రామాయణము, సకలనీతి సమ్మతములలో ఆతని వంశచరిత్రతోబాటు చారిత్రకమైన పూర్వసమకాలీన అంశములు కొన్ని వెల్లడి గావించియుండెను. ఈ కవి జీవితకాలము గనుకొనుట కవి చక్కగా సహాయమగుచున్నవి. అవి;

(1) తిక్కన సోమయాజి వంశముతో వీరికి గల సంబంధము.

(2) తొయ్యేటి అనపోత భూపాలునికడ అయ్యలుమంత్రి మంత్రిత్వము.

(3) ముప్పభూపాలుని ఆస్థానపదవి—వంశ వర్ణన.

(4) కందనామాత్యుల పరిచయము—వంశ వర్ణన.

(5) అపరిచితము, అజ్ఞాతమునైన అనేక గ్రంథముల యునికి తెలియుట.

పై యంశముల చారిత్రక సంఘటనల ననుస

రించి మడికిసింగన కాలము ప్రమాణమగునట్లు నిర్ణయింపవచ్చును. కాని గతానుగతికముగా ఈ వరకు పరిశీలకులు ఒకరు నుడివిన అంశములనే ప్రమాణమని భావించుచు తక్కిన అంశముల జోలికిపోక వదిలివేయుచుండుటచే తెలుగుకవుల చరిత్ర - వారి చారిత్రక కాలములు మిక్కిలి వివాదగ్రస్తమగుట సంభవించుచున్నది.

మడికిసింగనకవి కాలము నిర్ణయించినవారిలో శ్రీ నిడుదవోలు వేంకటరావుగారితోసహా కొందరు వాఙ్మయ విమర్శకారులు పద్మపురాణములో చివరగల ఒక వృత్తము నాధారము గావించుకొని ఆతని కాలము క్రీ. శ. 1370 మొదలుకొని 1450 వరకని నిర్ణయించుచుండిరి.[1] ఇది పైన గనబరచియున్న చారిత్రక అంశములకు ఎట్లు విరుద్ధమో తెలుసుకొనుట అవసరమై యున్నది.

జ్ఞానవాసిష్ఠ రామాయణములో మడికి సింగనకవి పేర్కొనియున్న మూడు అంశములలో తిక్కన సోమయాజివంశముతో తమ పూర్వీకులకుగల సంబంధము తెలుపుట, తొయ్యేటి అనపోత భూపాలుని మంత్రిత్వము, రామగిరి పట్టణము నేలు ముప్పభూపాలుని వంశవర్ణనము ప్రధానమైనవి. వీనిలో తిక్కన సోమయాజి పుత్రుడైన కొమ్మనామాత్యుని పుత్రిక చిట్టాంబికను సింగనతాతయగు అల్లాడమంత్రి వివాహ మాడినట్లు తెలిపియుండెను.[2] పద్యములో తిక్కనకు కొమ్మన పౌత్రుడని వ్రాయబడి యున్నను తిక్కనకు పౌత్రుడు హరిహరామాత్యుడుగాని కొమ్మన గాదు. ఆ పౌత్రుడనుదానికి పుత్రుడను పాఠాంతరము గూడాయుండుటచే కొమ్మనను తిక్కన పుత్రునిగానెంచి వారి వంశక్రమము లెఖ్ఖజూచినచో మడికి సింగనకవి వరకు గడచిన కాలమిట్లు దేలుచున్నది.

తిక్కన సోమయాజి=క్రీ. శ. 1280.
|
కొమ్మన = ,, 1310.
|
చిట్టాంబిక=అల్లాడ మంత్రి=1340.
|
అయ్యలుమంత్రి=1370.
|
సింగనకవి= 1400.

రెండవ అంశము రాజమహేంద్రవరమును పరిపాలించిన తొయ్యేటి అనపోతభూపాలుని కాలము. ఈతడు కాకతి ప్రతాపరుద్రుని తరువాత ఓరుగంటిని పాలించిన ముసునూరి కాపయ నాయకునికి రాజ్యప్రతినిధిగానుండి క్రీ. శ. 1347నుండి చోడభక్తిరాజుచే నిహతుడగువరకును రాజమహేంద్రవర ప్రాంతములను పరిపాలించెను. ఈతనికడనే సింగనకవి తండ్రి అయ్యలుమంత్రి — మంత్రిగానున్నట్లు పేర్కొనుట జరిగినది. అనగా అయ్యలుమంత్రి—మంత్రిగా చేరు నాటికి కనీస మాతనికి ముప్పది పైబడి యేబై నా వయసులో నుండవలయును. క్రీ. శ. 1300 ప్రాంతములో ఈ అయ్యలుమంత్రి జన్మించెననుకున్నచో ఈతనికి ముప్పది ఏండ్ల ప్రాయమున అనగా 1330—35 ప్రాంతమున సింగనకవి జన్మించెయుండవచ్చునని తేలుచున్నది. తరువాత గానవచ్చు అంశములన్నియు ఇందుకు బలకరముగా నుండుట చూడవచ్చును. అసలు శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు పై వృత్తములోని కాలమునకు అయ్యలుమంత్రి — మంత్రిత్వము అడ్డముగా నుండుటచే ప్రసిద్ధ వారిత్రక పరిణామముల సహితమెట్లు త్రోసిపుచ్చిరో నెరుగదగుచున్నది. 'సింగన పేర్కొన్న తొయ్యేటి అనపోత నాయకుడు క్రీ. శ. 1347 లో

---

1. 'ఆ కర యుగానల మృగాంక వత్సరములై
పరగు శార్వరిని బుణ్య
ప్రాకటిత మార్గశిర పంచమినిబొల్చు
నుడుపాల సుత వాసరము నందున్,
శ్రీకరముగా మడికి సింగన తెనుంగున
రచించెఁ దగఁ బద్మపురాణం
బాకమలమిత్రశశిరాంశవుగఁ
గంద సచివాగ్రణికి మంగళమహాశ్రీ.'
(పద్మపురాణము)

2. 'అతఁడు తిక్కన సోమయాజుల పౌత్రుఁడై
కొమరారు గుంటూరు కొమ్మ విభుని
పుత్రిఁ జిట్టాంబిక బుధలోక కల్పక
వల్లి వివాహమై వైభవమున.'
పాఠము : పుత్రుఁడై. జ్ఞా. వా. రా. అవ. 29

నున్న వాడనుట కేయాధారము లేదు—ఈ అనపోత నాయకుని శాసనములలో అయ్యలుమంత్రి ప్రస్తావన లేదు. కాబట్టి శాసనోదాహృతుడగు అనపోతనాయకుడు సింగన పేర్కొన్న అనపోతనాయకుడు కాడని నిర్ణయింప వచ్చును.'[3]

చారిత్రముగా క్రీ. శ. 1347 లో ఒకే తొయ్యేటి పేరుగల అనపోత భూపాలుడు గలడు గాని ఆ పేరుతో లేక నామసామ్యముగల వారెవరైనను లేనేలేరు. సింగన స్పష్టముగా ఈతనిని పేర్కొనుటయేగాక ఆతనికి సంబంధించిన శాసనములు లభించుచున్నవి. రాజశాసనములలో మంత్రులపేర్లు ప్రకటించి తీరవలసిన ఆచారము గన్పింపదు. సింగన్న పేర్కొన్నది తొయ్యేటి అనపోతనాయకుడు కాదని వారి కవిశ్వాసము కలిగినపుడు మరొకరిజాడ చూడవలయునుగాని వ్యక్తుల ఉనికినే పరిహరించుట కార్యముగాదు. చరిత్రలో మరి యిద్దరు అనపోతనామధారులు రెడ్డిరాజ్యమునను, రాచకొండలోను వున్నవారైనను వారి పరిపాలనాకాలములు వేరుగా నున్నందున దీనికి సందర్భపడునవిగాదు. మొత్తముపై శ్రీనిడుదవోలువారు సింగన పేర్కొన్న చరిత్ర విషయములను పరిగణనలోకి తీసుకొనజాలక పోయిరి.

మడికిసింగనకవి కాలము నిర్ణయింపబూనిన వారిలో ఇంతవరకు అందరు సింగనకవిని ముప్పభూపాలుని ఆశ్రితుడని వ్రాసెదరేకాని, ఈ ముప్పభూపాలు డేకాలమువాడో, అప్పటి రాజకీయ పరిస్థితు లేమిటో వాటినిగురించి చర్చించినవారు గన్పింపరు. వాస్తవమున ఈ ముప్పభూపతికాలము గనుగొన్నచో సింగనకవికాలము తప్పక తేలునుగదా. రామగిరిని రాజధానిగా జేసుకొని సబ్బిరాష్ట్రమును (కరీంనగరుజిల్లా) పాలించిన ఈ ముప్పభూపతి ముసునూరి కాపయనాయకునికి సామంతుడు. ఈతడు సబ్బిరాష్ట్రమును క్రీ. శ. 1345 నుండి 1370 వరకు పరిపాలించెను. ఆ కాలములో రాచకొండవారికి జల్లిపల్లి క్షత్రియులకు ఒక సంగ్రామము జరుగగా కాపయను సమర్థించు రెడ్డి భూపతులు కొందరు క్షత్రియులకు సహాయము గావించుటకు వెళ్లిరి. ఈ యుద్ధములో రాచకొండ సైన్యముచే విహతులైన వారిలో 'రామగిరి పట్టణాధీశ్వరులైన ద్విశతగిరి దుర్గాధీశులైన పంట ముమ్మడి పంట మైలారు రాజులును, బిరుదునకై విరసించు కమ్మనాయంకులును, మొగులూరు, చెంజెర్ల భూమి ప్రాంతమున సంగరంబుచేయు—ఖండ విఖండ శతఖండ తుండంబులుగా నరక బడినట్లు వెలుగోటి వంశావళి బేర్కొనుచున్నది.[4] ఈ సందర్భములో నిహతులైన రెడ్డినాయకుల పేర్లెన్నియో చెప్పబడినవి కాని అందు రామగిరి పట్టణాధీశ్వరులను మాటదప్ప ముప్పభూపాలుని పేరు గన్పింపదు. అయితే కొలది కాలములోనే జరిగిన రాచకొండ అనపోత భూపాలుని దిగ్విజయయాత్రలలో భీమవరము కడ జరిగిన సంగ్రామములో కాపయనాయకుడు నిహతుడగుటయు, సబ్బిరాష్ట్రముతోపాటు తెలంగాణము యావత్తును ఈతని కైవసమగుటయు వెలుగోటి వంశావళి జెప్పచున్నది. ఈ దిగ్విజయములకు శాసన నిదర్శనముగూడా గలదు.[5] ఈ కథనము ననుసరించి ముప్పభూపాలుని రాజ్యపరిపాలన 1370 కి కొలది ముందుగా అంతమైనదని తెలుచున్నది. పోగా పద్మపురాణములోని పద్యముగాని మరొక పద్యముగాని

---

3. సకలనీతి సమ్మతము—1970. పీఠిక. పుట. 9.

4. వెలుగోటి వంశావళి, పుట. 17.

5. 'నాణెంబుగా సబ్బినాటి రాజ్యంబెల్ల
నద్భుతంబుగఁ జూరలాడినాడు.'

వెలు—వం. పు. 48

ఐనవోలు శాసనము. క్రీ. శ. 1369.
(H. A. S. 19 W. G. IP. 119.)

నమ్మవలెనన్నచో క్రీ. శ. 1432 వరకు ముప్ప భూపాలుడు జీవించి యుండెనని పల్కుటయే. ఇది మిక్కిలి చారిత్రక విరుద్ధము. దీనికన్న ఎవరో ప్రతులు వ్రాసుకొన్న విలేఖరు లిరికించిన పద్యములు పరిహరించుటయే ఉచితముగా నుండును.

సింగనకవి తెలిపిన చారిత్రిక విషయములో కందనామాత్యుని ప్రసక్తి ఇంతవరకు గైకొనబడలేదు. కాలనిర్ణయములో ఈ కందనామాత్యుని వంశవృక్షము మిక్కిలి తోడ్పడునదై యున్నది. వానస వంశమునకు చెందిన ఈ కందనామాత్యుడు ఈతని సోదరుడు కేసనమంత్రి ఇరువురు ముప్పభూపాలుని కడ మంత్రులుగానుండి సత్కార్యములు గావించుచు ప్రసిద్ధి జెందిరి. ఈ కందనమంత్రి పూర్వికులుగూడా కాకతి చక్రవర్తుల కాలములో ప్రఖ్యాతులై యున్నట్లు పద్మపురాణములో సింగనకవి విపులముగా వర్ణించియుండెను. కందనమంత్రి పూర్వికులలో నన్నయమంత్రి అనునతడు గణపతిదేవచక్రవర్తిచే మన్ననలంది విఖ్యాతుడైనట్లు వ్రాయబడియున్నది. తుదకు ఈ ఆధారము ననుసరించి చూచినను గణపతిదేవునికాలము (క్రీ. శ. 1260) లోనున్న గన్నమంత్రికి కందనామాత్యుని కాలమునకు మధ్య నాలుగు తరములు గడచినవి గనుక తరమునకు ముప్పది సంవత్సరములు లెక్కించి చూచినచో కందనామాత్యునికాలము క్రీ. శ. 1380 ప్రాంతమనియే తేలుచున్నది.[6] కందనమంత్రి—మడికిసింగనకవి సమకాలికులుగనుక పైన యుదాహరించినట్లు ఈ కవికాలము క్రీ. శ. 1330—1400 అని సందేహములేక చెప్పవచ్చును.

ప్రస్తుతము ప్రభుత్వమువారి శాసన సర్వే కరీంనగరుజిల్లాలో జరుగుచున్నది కనుక కవికి సంబంధించిన ముప్పభూపాలునివి లేక కందనమంత్రికి సంబంధించిన శాసనము లేవైనా బయల్పడునేమో వేచి చూడవలసియున్నది.

—శ్రీ తేరాల సత్యనారాయణశర్మ.

6. కందనామాత్యుని వంశవృక్షము

రుద్రమంత్రి = అన్నమాంబ

గన్నయ=గాదమ | రుద్రయ | పోతయ | మల్లయ

మల్లన=గౌరమ

గణపతి=గౌరమాంబ | గోపన | రామన | గన్నమంత్రి

మల్లన | అబ్బయ=గౌరమాంబ | మంత్రి

తిమ్మన | కేసన మంత్రి | కందనమంత్రి పద్మపురాణ కృతిపతి | మంత్రి

లేఖలు:

'నేటి భాషావిమర్శలు': సమాధానం

అర్యా!

1970 జూన్‌నెల భారతిలో తెలుగులో బహువచన రూపనిష్పత్తి అనే వ్యాసం ప్రకటించాను. అందులో కొన్నివిషయాలను పరామర్శిస్తూ ఆగస్టునెల భారతి సంచికలో 'సుపాణి'గారొక వ్యాసం రాశారు. ఆ తరవాత అక్టోబరునెల భారతిలో ప్రకటితమైన 'రెండు విమర్శలు: ఒక సమాధానం'అనే వ్యాసంలో సుపాణిగారి సందేహాలకు సమాధానాలు ఇచ్చాను. ఈ వ్యాసాన్ని 'యాదృచ్ఛికంగా' చూసిన శ్రీ వడ్లమూడి గోపాలకృష్ణయ్యగారు 'నేటి భాషావిమర్శలు'అనే లఘువ్యాసం 1971 మేనెల భారతిలో ప్రకటించారు. నా వ్యాసంలో ఒకటిరెండు విషయాలను వారు ప్రస్తావించారు. ఆ విషయాలనుగురించి నా అభిప్రాయా లిక్కడ వివరిస్తాను.

1. 'పేలాలు'అనే శబ్దం నిత్యబహువచనం అని నేనన్నాను. నేనట్లా అనటం 'చాలా ప్రమాదకరమైన తొందరపాటుతో కూడిన నిర్ణయం' అని శ్రీ గోపాలకృష్ణయ్యగా రభిప్రాయపడుతున్నారు. ఒక పదం ఎప్పుడూ బహువచనంలోనే ప్రయుక్తమయితే, దాన్ని నిత్యబహువచనం అంటాం. 'పేలాలు' అట్లాంటి శబ్దమని నా అభిప్రాయం. కాదని శ్రీ గోపాలకృష్ణయ్యగా రభిప్రాయపడుతున్నట్టు వారి వ్యాసం వల్ల తెలుస్తున్నది. 'ఏకవచనంలో' ప్రయోగించి ఒక వాక్యం చూపిస్తే బాగుండేది. వారాపని చెయ్యలేదు. నేటి తెలుగులో 'పేలాలు' నిశ్చయంగా నిత్యబహువచనరూపమే. సమస్తశబ్దాల విషయం వేరు.

ప్రాచీనభాషలో కూడా ఇది నిత్యబహువచనమే అనటానికి ఆధారాలున్నై. ఈ విషయంలో మన నిఘంటువు లేమంటున్నాయో చూద్దాం.

పేలలు. దే. వి. బ. లాజలు (దీనిని ఆవాల వలెనే పేలాలని వాడెదరు. వృత్తియం దేకవచనాంతము, పేలగింజలు ము.)

—శబ్ద రత్నాకరము.

పేలములు. వి. జ. లాజలు. (దీనికి వృత్తిని ము లోపము.)

—సూర్యరాయాంధ్ర నిఘంటువు.

పేలలు. దే. వి. బ. రూ. పేలాలు—ప్రేలలు—ప్రేలాలు.

—ఆంధ్రవాచస్పత్యము.

పై నిఘంటువులు ఈ పదరూపాల్ని బహువచనాంతంగానే ఇయ్యటం గమనించ దగింది. సూర్యరాయాంధ్ర నిఘంటువులో చూపిన ప్రయోగాల్లోకూడా ఏకవచనంలో వాడిన ప్రయోగంలేదు. ఈ బహువచన రూపానికి మూలమైన ఏకవచన రూపం విషయంలో ఈ నిఘంటుకారుల కేకాభిప్రాయం ఉన్నట్టులేదు. 'పేల' అనేది ఏకవచన రూపమని శబ్దరత్నాకరకారు డభిప్రాయ పడితే 'పేలము' అనేది ఏకవచన రూపమని చరిగొండ ధర్మన్న ప్రయోగాన్ని ఆధారం చేసుకొని సూ. రా. నిఘంటుకారు లభిప్రాయపడుతున్నారు. ఆ ప్రయోగ మిది:

మిటమిటఁ గాయు నాతపము
మించఁగ నోర్వక గండశైలముల్
పెటపెట ప్రేలి పేలముల
పెంపు వహించెను.

(చిత్రభారతము 2—9.)

ఆంధ్రభాషార్ణవం కూడా ఈ శబ్దం నిత్యబహువచనాంతమనే నిర్ణయించినట్టు ఈ పద్యం వల్ల తెలుస్తున్నది:

సీ. బోరు లనంగను బొరుగు లనంగను,
ధాన్యసమాఖ్యలై తనరుచుండుఁ

బొరుగులు మొదలుగా బోచిళ్ళ వరకును
బహువచనాలుగాఁ జరగుచుండు

గుగ్గిళ్లనంగను గుల్మాషములు మిఱాలు,
లాజలు దనరుఁ బేలా లనంగ
నటుకు లడుకులు నా నగుఁ బృథుకంబులు,
ప్రాలునా నక్షతలు వఱలుఁ బ్రార్థ
నాక్షతలపేరు పోచిళ్లనాఁగ బియ్యమునగ
జాత్యేకవచనమై యలరు దండు
లము దనరు నార్ద్రతండుల మ్మమరు
నానపాలు నాగను బటనాశపార్వతీశ॥.

(ఆంధ్ర భాషార్ణవము 2—253.)

ఆధునిక భాషలో 'పేలాలు' అనే శబ్దం నిత్యబహువచనం అన్నంతవరకే నా కవసరం. ప్రాచీనభాషలో కాకపోయినా ఆధునికభాషకు అట్లా సూత్రించటానికి అడ్డమేమీ లేదు. అయితే ప్రాచీన భాషలోకూడా ఇది నిత్య బహువచనమేనని పై గ్రంథాల ఆధారంవల్ల చెప్పవచ్చు.

2. 'ఉసిళ్లు' అనే పదంకూడా నిత్య బహువచనమని నేనుచేసిన నిర్ణయం. దీన్ని శ్రీ వడ్లమూడి గోపాలకృష్ణయ్యగారు కాదన్నట్టు లేదు. 'ఉసిడి' అనే ఏకవచన రూపం ఉన్నట్టుమాత్రం చూపించారు. శ. ర; సూ. రా. నిఘంటువు లీ రూపాన్నియ్యలేదు. బ్రౌను నిఘంటువుమాత్రం ఈ రూపాన్ని చూపించింది. ఈ రూపాన్ని నేను విన లేదు. కాని కృష్ణాజిల్లాలో 'ఉసిడి' అనే ఏకవచన రూపం ఉన్నట్టు ఇటీవలే ఎవరో అనగా విన్నాను. అదే నిజమైతే ఈ శబ్దం విషయంలో నా అభిప్రాయాన్ని మార్చుకోవాల్సి ఉంటుంది.

3. ముత్తెము—ముత్తేలు, బల్లెము—బల్లేలు అని గిడుగు రామ్మూర్తిగా రుదాహరించిన రూపాల్ని గురించి శ్రీ గోపాలకృష్ణయ్యగారు విశేషమైన చర్చ చేశారు. ముత్తియము> ముత్త్యము (+లు)> ముత్త్యాలు > ముత్తాలు (ముత్తేలు) అయిందని శ్రీ గోపాలకృష్ణయ్యగారి ఊహ. ఈ చరిత్రతో నాకు నిమిత్తంలేదు. నేను చెప్పదల్చుకున్నది నేటి భాషలో బహువచన నిర్మాణ పద్ధతి. మకారాంత శబ్దాలకు బహువచన ప్రత్యయం పరమైనప్పుడు మకారానికి లోపం, పూర్వంలోఉన్న అ, ఎ వర్ణాలకి దీర్ఘమూ వస్తుందని చెప్పాము. మకారాంతపదాల్లో మకారానికి పూర్వంఉన్న 'ఎ'కి వివృతోచ్చారణ మొదలే ఉందని, అది దీర్ఘమైనప్పుడు ఇంకాస్త వివృతోచ్చారణ వినిపిస్తుందనీ, 'రెండు విమర్శలు : ఒక సమాధానం' (భారతి, అక్టోబరు 1970) అనే వ్యాసంలో వివరించాను. ఆ వ్యాసాన్ని కాస్త ఓపిగ్గా చదివితే సందేహాలు రావటాని కవకాశం ఉండదు. 'విస్పష్టమైన ఎకారం, అ—ఎ రెండు స్వరాల అంశాలు'అనే పదాల్లో శాస్త్రసంక్షిప్తతలేదు. ధ్వనిశాస్త్రపరంగా దీన్ని చెప్పవలసిన పద్ధతి నా 'రెండు విమర్శలు'అనే వ్యాసంలో సూచించాను.

ఒక కాలంలో, భాషను వ్యాకరిస్తూ రచించిన సూత్రాలు భాషాపరిణామ పద్ధతిని సూచించక్కర్లేదని శ్రీ గోపాలకృష్ణయ్యగారు గ్రహించాలి. నిజానికీ విషయం వారికి తెలుసు. అందు కాధారం వారే రచించిన వ్యావహారికభాషావ్యాకరణం (1958) లో ఈ సూత్రం.

'లు, ల, న లు పరమైతే ము వర్ణానికి లోపం, పూర్వ ఎత్వానికి ఏత్వాదేశం విభాషగా వస్తుంది. ఉదా : ముత్తెములు --- ముత్తేలు, పళ్లెములు—పళ్లేలు, పందెములు— పందేలు, జందెములు—జందేలు మొదలైనవి.' శబ్ద -267. (వివృతమైన ఎకారానికి కింద గీతను గుర్తుగా ఉంచాను).

శ్రీ గోపాలకృష్ణయ్యగారు తాము చెప్పదల్చుకున్న విషయాన్నిమించి కొన్నివ్యాఖ్యలు చేశారు. వాటికి సమాధానాలు అనవసరం.

—చేకూరి రామారావు.

కుంతీసుత మధ్యముఁడు—అర్జునుఁడు

ఆర్యా !

ఈ శీర్షికతో ఏప్రిల్‌నెల భారతిలో శ్రీ మాడభూషి వారు చాలాచర్చ చేశారు.మధ్యమ శబ్దాన్ని

గురించి ఈ సందర్భంలో అవసరంలేని అర్థాలన్నీ తీసుకొచ్చారు. శ్రీ వేదం వేంకటరాయశాస్త్రిగారూ, మరి 'ఒకరు' చెప్పిన అర్థాలు డొంక తిరుగుడుగా వున్నాయి.

'కుంతీసుత మధ్యముఁడు' అంటే 'పాండవ మధ్యముఁడు' అని తిక్కన అర్థం. పాండవులు అనే అర్థంలో కుంతీసుతులు అని తిక్కనచెప్పిన సందర్భాలు వున్నాయి.

'ధృతరాష్ట్రుండును బుత్రులున్ వనము
కుంతీనందనుల్ సింహముల్' ఉ—1—358

'ఆ కౌంతేయులతోఁ బోరుచుటుడుగు
ధీరవిచారా' ఉ—3—337

'శాంతిం బొందుట నీకుం గుంతీపుత్రులకు
మేలగున్ దానిక యే నింతయు నాడెదన్'
ఉ—3—370

'కుంతీపుత్రులు' అన్నదానికీ 'కుంతీసుతులు' అన్నదానికీ శ్రీ మాడభూషివారు అనుకున్న తేడా, తిక్కన పాటించలేదని 'ఆ కౌంతేయులతోఁ' అనే ప్రయోగం నిర్ధారణ చేస్తోంది.

ధర్మరాజు విరటుడి కొలువుకి అజ్ఞాత వాసానికి వెళ్లేముందు సహదేవుణ్ణిగురించి—

'అకుటిలుఁ డార్యసమ్మతుఁ డహంకృతి
దూరుఁడు నీతిసర్వలా
త్మకుఁ డనవద్యశీలుఁడు సధర్ముఁడు
దాంతుఁడు గొంతిముద్దుసేయుకొడుకు'

అని చెబుతూ అతణ్ణికూడా కుంతికొడుకుగానే పరిగణించాడు. పాండవు లైదుగుర్నీ కుంతి పోషించటంవల్ల, వారి నందరినీ కుంతీసుతులనీ, కుంతీ పుత్రులనీ, కుంతీనందనులనీ, కౌంతేయులనీ వ్యవహరించటం సమంజసమే అని తిక్కన ప్రయోగాల అర్థం.

— రామానుజాచార్యులు.

నేటి విమర్శలు

ఆర్యా!

మేనెల భారతిలో శ్రీ వడ్లమూడి గోపాలకృష్ణయ్యగారి 'నేటి భాషావిమర్శలు' చదివాక చాలా మథనపడ్డాను. విషయ ప్రధానమైన విమర్శ అయితే అందరూ మెచ్చుకోవచ్చు. 'పేలాలు' అనేది నిత్య బహువచనాంతం కాదన్నారు. ఉదాహరణలు చూపించారు. బాగుంది. కాని ఇంతటితోనే 'మన భాషాశాస్త్ర పరిశోధనా పాటవం' బలపడిందా? 'ఉన్నత విద్యాభ్యాసం చేసినవారు—శాస్త్ర పరిశోధకు లనిపించుకోదలచేవారు'— ఇటువంటి వాగ్వ్యయం తగునా?

ఇదే సంచికలోని 'ఉర్లాంపద్దు—కక్క' అనే శీర్షికలో శ్రీ కాళూరివారు లేనిపోని అపోహల్ని వెలిబుచ్చారు. శ్రీకాకుళం ప్రాంతంలో, అందునా సీతానగరం ప్రాంతంలో 'ఉర్లాంపద్దు' అంటే వేదపండితుడనే వాడుక బాగావుంది. 'వేదపండితుడు అన్న అర్థంలో వాడుకలో లేద'నటం పొరపాటు. ఇట్లాగే 'పినతల్లిని'ని 'కక్కి' అనరని నొక్కి వక్కాణించారు శ్రీ కాళూరివారు. 'అనరు' అనటం పొరపాటు. 'కొన్నిప్రాంతాల్లో అనరు' అనడం సబబుగా వుంటుంది. పినతల్లికి 'అబ్బుచ్చి' అనేపేరు కొన్ని ప్రాంతాల్లో మాత్రమే వుంది.

—ద్వా. నా. శాస్త్రి.

సవరణ

ఆర్యా!

......చిన్నవ్యాసం ప్రకటించినందుకు కృతజ్ఞతలు. ఒక పొరపాటుకూడా దొర్లింది. అది అచ్చుపొరపాటో లేక కాపీ వ్రాయడంలో నా పొరపాటో తెలియదు.

(మే నెల భారతి సంచిక) 79 వ పుటలో రెండవకాలం చివరినుంచి రెండవ పంక్తి—

తప్పు

అనంతరం ము లోపంరాగా యేర్పడ్డరూపం ముత్తాలు—

ఒప్పు

అనంతరం య లోపంరాగా యేర్పడ్డ రూపం ముత్తాలు—

'య లోపం' అనడానికి ము లోపం అని పడింది

— వడ్లమూడి గోపాలకృష్ణయ్య.

గ్రంథ విమర్శలు

ఆలోచనామృతము

వ్యాసముల సంపుటి

(డాక్టర్ బయ్యా వెంకట సూర్యనారాయణ. ప్రకాశకులు: శ్రీ పరమేశ్వర పబ్లికేషన్సు, చిక్కడపల్లి, హైదరాబాదు — 20. పే. 99. వెల రు. 2—50.)

శ్రీ డా. బయ్యా వెంకట సూర్యనారాయణ గారు ఆంధ్ర సంస్కృత హిందీ సాహిత్యములలో ఎమ్. ఏ. పట్టభద్రులు; హిందీలో పి. హెచ్. డి. పట్టభద్రులు; జర్మన్ భాషలోనూ, భాషాశాస్త్రం లోనూ లబ్ధోపాధులు. విస్తృతమూ ప్రగాఢమూ అయిన వారి సాహిత్య పరిశీలన ఫలితమే ఈ 'ఆలోచనామృతము' అన్న అన్వర్థాభిధానంకల వ్యాస సంపుటి.

ఈ సంపుటిలో పది వ్యాసాలున్నాయి. వీటిలో చాలా వ్యాసాలు స్రవంతి, ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక, భారతి పత్రికలలో తొలుత ప్రకటితమైనాయి.

'అభిజ్ఞాన శాకుంతలమున నౌచిత్యపాలనము' అన్న వ్యాసంలో శాకుంతల నాటకంలో వివిధ సన్నివేశాలలోనూ సంభాషణలలోనూ ఔచిత్యాన్ని చర్చించారు. 'ఆంధ్ర కావ్యములలో అవతారికలు' అన్న వ్యాసంలో ఆంధ్రకావ్యాల ఆరంభములలో ఉండే అవతారికల లక్షణాలనూ, వైవిధ్యాన్నీ వివరించారు. 'ప్రాచీనాంధ్ర కావ్యములలో ప్రకృతి వర్ణనలు'అన్న వ్యాసంలో 'నన్నయ తిక్కనాదుల కాలమున పరిమితములుగనుండి శ్రీనాథకృష్ణరాయుల యుగములలో పరాకాష్ఠనందిన ఈ వర్ణనలు క్షీణయుగమున ననుకరణమాత్రములై వెలవెలబోయి నీరసములైనవి'అని సోదాహరణంగా నిరూపించారు.

'కావ్యేషునాటకం రమ్యమ్'అన్న వ్యాసంలో శ్రవ్య కావ్యముకన్నదృశ్యకావ్యము రమ్యతర మవడానికి కారణం అది సకలకళాసమాహారం కావడమేఅని వివరించారు. 'ఆంధ్రులగాథాసప్తశతి' అన్న వ్యాసం 'సప్తశతి' అన్న కావ్య ప్రక్రియకు హిందీ సాహిత్యంలో ఉన్న ఆదరణ తెనుగు సాహిత్యంలో లేకపోయిందని అంత స్సాప ప్రేరితులై రచించారు.

'గద్య పద్యముల స్వరూప ప్రయోజనములు', 'ప్రాచీన సాహిత్యమున గద్య ముపేక్షితమా!', 'సాహిత్యములో గద్య పద్యముల పౌర్వా పర్యములు', 'గద్య శైలీ చతుష్పథము' అన్న నాలుగు వ్యాసాలలోనూ రచయిత గద్యంయొక్క ఉత్పత్తి వికాస వైవిధ్యాలను గురించి సమగ్రము నిశితము అయిన సమాలోచన చేశారు. వీటిలో మొదటివ్యాసంలో పద్యం కావ్య రచనోపయోగి, గద్యం కావ్యశాస్త్రోభయ రచనోపయోగిఅయి ఇరుప్రక్కలపదునుకలఖడ్గముఅనీ; కావ్యగద్యంలో ఛందస్తిరోధానలోపాన్ని పూరించడానికే అది సమాసపూర్ణంగా, ఓజోగుణప్రధానంగా నిర్వహింపబడుతుందనీ వీరు ప్రతిపాదించిన అభిప్రాయం సమంజసంగాఉంది. ప్రాచీన సాహిత్యంలో గద్యం ఉండినా అది విస్తరిల్లకపోవడానికి ముద్రణాది సౌకర్యాభావమే కారణంతప్ప రచనాకౌశలరాహిత్యం కాదని ద్వితీయ వ్యాసంలో సూచించారు. తృతీయ వ్యాసంలో సాహిత్యంలో పద్యమే ముందు ఆవిర్భవించిందనేకన్నా, కావ్యం కాదగిన సంక్షిప్తగద్యమే ఉదయించిందనడం యుక్తియుక్తమన్న అభిప్రాయాన్ని సోపపత్తికంగా ప్రతిపాదించారు. నాల్గవ వ్యాసంలో పందొమ్మిదవ శతాబ్దంలో ఆంధ్రగద్యసాహిత్యం వికసించినప్పటి నాలుగు గద్యశైలులను చక్కగా ప్రదర్శించి వాటి నుండి ఆధునికగద్యశైలి పరిణమించిన జాడలను సూచించారు. ఈ నాలుగు వ్యాసాలూ వస్త్వైక్యం కలిగి ఒక సిద్ధాంతవ్యాస(Thesis) కృతిని కలిగి ఉన్నాయి.

'తెలుగు— హిందీ సాహిత్యములలో ఆధునిక యుగకర్తలు' అన్న చివరివ్యాసంలో వీరేశలింగం

గారితో హిందీ సాహిత్యంలో తాదృశుడైన భారతేందు హరిశ్చంద్రని సరిపోల్చి వారిరువురి వ్యక్తిత్వ సాహిత్యాల సామ్య వైషమ్యాలను ప్రదర్శించారు. ఈ వ్యాసంలో ఉదాహృతములైన హిందీ పద్యాలకు తెనుగులో తాత్పర్యాలువ్రాస్తే పఠితల కవి సుబోధంగా ఉండేవి.

సూర్యనారాయణగారు స్వతంత్రమైన ఆలోచన, ఉపజ్ఞ కల సద్విమర్శకులు. ఈ పుస్తకం సాహితీ ప్రియులకు అవశ్య పఠనీయం.

తెలుగు సాహిత్యం: గాంధీజీ ప్రభావం

(మొదలి నాగభూషణ శర్మ. గాంధీ సాహిత్య ప్రచురణాలయం, హైదరాబాదు—20 పేజీలు 251 వెల: మేలుప్రతి రూ 8/ ; సాదాప్రతి రూ 6-50)

రాముడు, కృష్ణుడు, బుద్ధుడు, గాంధీ—వీరు నలుగురూ మనదేశంలో జన్మించిన మహాపురుషులు. భగవదవతారాలని ప్రజలచే కీర్తింపబడిన వారూను. మన దేశ సాహిత్యంలో అధికభాగం ఈ నలుగురు మహాపురుషులనుగురించే రచితమైంది.

ప్రస్తుత గ్రంథంలో గాంధీజీ ప్రభావంవలన వెలువడిన ఆంధ్ర సాహిత్యాన్నంతటినీ రచయిత పరామర్శించారు కేవలం గాంధీగురించి వ్రాయబడిన సాహిత్యమేకాక, గాంధీజీ సిద్ధాంతాల ప్రభావంచేత వెలువడిన సాహిత్యంకూడా చర్చించబడడం చాలా సముచితంగాఉంది. దీనివలన ఈ పుస్తకం గాంధి గురించి రచితమైన పుస్తకాల కేటలాగువలె తయారుకాకుండా, తత్ప్రభావచర్చాసంయుతమై మంచి సాహిత్యసిద్ధాంత గ్రంథంగా రూపొందింది.

సాహిత్యం—జాతీయత; కావ్యసాహిత్యం; తెలుగులో గాంధిశతకాలు; ఖండకావ్యాలు—ఖండికలు గేయాలు—పాటలు; కీర్తనలు—భజనలు మొదలైనవి; నాటకసాహిత్యం; నవలాసాహిత్యం; జీవిత చరిత్రలు—సిద్ధాంత గ్రంథాలు; సింహావలోకనం—అన్న పది శీర్షికలక్రిందా మొత్తం గాంధి ప్రభావంవలన వచ్చిన ప్రతిసాహిత్యప్రక్రియనూ జల్లెడ పట్టినట్లు రచయిత ఆలోడించి వేశారు. పుస్తకం చివరఇచ్చిన ప్రసక్త గ్రంథాల సూచికలు ఆయా విషయాలు పరిశీలించగోరేవారికి ఉపయుక్తంగా ఉన్నాయి. ఈ రచయితకు ఆధునిక సాహిత్యమంతా కరతలామలకమని ఈ పుస్తకం చెప్పక చెబుతున్నది. సమగ్రమైన పరిశీలన, రచనలో ఒక లక్ష్యం, చిత్తశుద్ధి ఈ పుస్తకం ప్రతి పుటలోనూ కనిపిస్తాయి.

సాహితీపరు లందరకూ ఉపయుక్తమయే చక్కని పరిశోధనాత్మక గ్రంథం ఇది.

కందుకూరి వీరేశలింగం డైరీలు, లేఖలు

(సంకలనకర్త: అక్కిరాజు రమాపతిరావు (మంజుశ్రీ). విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్, ఏలూరు రోడ్డు, విజయవాడ-2. పే. 154. వెల రు 3/-)

ఆంధ్రదేశ సామాజికాభ్యున్నతికి వైజ్ఞానికంగా వ్యక్తిగతంగా ఆర్థికంగా పాటుపడిన మహనీయులు కందుకూరి వీరేశలింగంపంతులుగారు. వీరేశలింగంగారు తెనుగుదేశంలోకాక ఇంకెక్కడైనా జన్మించిఉంటే వారు వ్రాసిన ప్రతిపంక్తి ఎప్పుడో పుస్తకరూపంలో ప్రకటితమయిఉండేది. వారు చేసిన సేవకు తగిన ప్రజాగౌరవాభిమానాలు లభించిఉండేవి. ఆంధ్రజాతి అలసత్వంచేత ప్రస్తుతం వారి పుస్తకాలు కొన్ని దొరకవు. వారికి ఆ కాలంలో మహామహులు వ్రాసిన లేఖలు గంగపాలయాయి.

అక్కిరాజు రమాపతిరావుగారు వీరేశలింగంగారిపై సిద్ధాంతవ్యాసంవ్రాసి డాక్టరేటు పట్టంపొంది ఉన్నారు. ఆ కార్యక్రమంలో వారు ఎంతో శ్రమించి వీరేశలింగంగారి డైరీలు, లేఖలు పరిశీలించి, వాటి నకళ్లు తీసుకొని, అస్తవ్యస్తంగా ఉన్నవాటి నన్నిటినీ క్రమబద్ధం చేశారు.

వీరేశలింగంగారు ఆరోగ్యవంతులుకారు. ధన

పంతులుగారు. అయినప్పటికీ 'తన దేహము, తన గేహము, తన కాలము, తన ధనమ్ము, తన విద్య, జగజ్జనులకు వినియోగించిన ఘనుడే వీరేశలింగ కవి జనులారా' అన్న పొగడ్తను పొందారు. చచ్చిపోవటానికి కూడా తీరికలేక ఆయన అస్తమించారని బతికారని కృష్ణశాస్త్రిగారు చమత్కరించారు.

ఈ సంపుటిలో 1890 నుండి 1915 వరకు డైరీలో లభించిన కొన్ని పుటలు, 1872 నుండి 1917 వరకు వారు తెనుగులోనూ ఆంగ్లంలోనూ వ్రాసిన కొన్నిలేఖలూ సంకలనం చేయబడినాయి. ఈ డైరీలవలనా లేఖలవలనా పంతులుగారి నిరంతర కార్యవ్యగ్రత, సాహిత్యవ్యాసంగం, చిత్తశుద్ధి, భగవంతునియెడల వారికికల ప్రగాఢ విశ్వాసం వ్యక్తమవుతున్నాయి.

పంతులుగారు తమ సంఘసేవా నిర్వహణలో అనేక కష్టాలకూ ప్రతీప శక్తులకూ నిందలకూ గురి అయినా నిశ్చలంగా తమ కార్యక్రమాల్ని కొనసాగించారు. ఆ నిశ్చలత్వం ఈ పుటలలో గోచరిస్తుంది. డైరీలలో ఖర్చువెచ్చాలు, లేఖలలో కార్యక్రమాలు మాత్రమే మనకి కనిపిస్తాయి తప్ప తన మనస్సులోని అలజడినీ ఆందోళననీ ఆయన కాగితంమీద పెట్టి వెళ్ళబోసుకోవడం కనిపించదు. అందుచేత ఈ డైరీలకూ లేఖలకూ సాహిత్యాత్మకమైన విలువ కొరవడుతున్నా పంతులుగారినిగురించి వివరాలుతెలుసుకొందుకి ఉపకరిస్తాయి.

కవిరాజ జీవితము — సాహిత్యము

(గొర్రెపాటి వేంకటసుబ్బయ్య; ప్రతులకు—దేశి కవితామండలి, అరండల్‌పేట, కూర్మయ్యవీధి, విజయవాడ—2. పే. 318. వెల రూ 6/-).

ఈ పుస్తకం రెండు భాగాలు. మొదటి భాగంలో కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరిగారి కార్యదీక్ష, తనకు యుక్తమనితోచిన అభిప్రాయాన్ని ధైర్యంగా ప్రకటించే లక్షణం, ప్రతి విషయాన్ని ఇతరులు చెప్పినట్లుకాక స్వబుద్ధితో హేతువాదయుక్తంగా ఆలోచించడం—ఈ మొదలైన గుణాలను సూచించే వారి జీవిత విశేషాలు వివరింపబడినాయి. రెండవభాగంలో ఏవంగుణవిశిష్టుడైన కవిరాజు ప్రాచీన పురాణేతిహాస కథలను వినూత్న దృష్టితో సమీక్షించి రచించిన సాహిత్యం చర్చితమైంది.

ఆంధ్రసాహిత్యంలో రామస్వామి చౌదరిగారికొక ప్రత్యేకస్థానం ఉంది. వారి జీవిత సాహిత్య పరిశీలనాత్మకమైన ఈ పుస్తకం తెలుగుసాహిత్యంలో జీవిత చరిత్రలు తగినన్ని లేని లోటును కొంతవరకు తీర్చుతున్నది.

ఈ యుగారంభంలో ఆంగ్లవిద్యా ప్రభావం వలన విద్యావివేకసంపన్నులైన పలువురు మన వేద పురాణాలను గ్రుడ్డిగా నమ్మక అందలి విషయాలను గురించి స్వతంత్రబుద్ధితో ఆలోచించారు. ముఖ్యంగా రామాయణ భారతాలలో కొన్ని కొన్నిటి గురించి సందేహనిమగ్నులయారు. కొందరంతటితో ఆగక ప్రజలలో బహుకాలంగా పాతుకుపోయి ఉన్న విశ్వాసాలను ఎదిర్చి రాముడే చెడ్డవాడు, రావణుడే మంచివాడు; కౌరవులే సజ్జనులు, పాండవులే దుర్జనులు—ఈ తీరున అభిప్రాయపడ్డారు. ఇలా అభిప్రాయపడినవారిలో ముఖ్యులు పెండ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రిగారు, త్రిపురనేని రామస్వామిచౌదరిగారూను. ఉభయులూ తమ అభిప్రాయాలను ప్రతిపాదిస్తూ సాహిత్యం రచించారు. ప్రాచీనులు చెప్పిందల్లా ప్రమాణంగా తలవాల్చమని ఎవరూ అనరు. కాని మూలాన్ని

సరిగా పరిశీలించి, పక్షపాతంలేకుండా నిర్ణయించడం ఆవశ్యకం.

కవిరాజుగారు 'కురుక్షేత్రం' నాటకంలో రాజ్యాధికారం కౌరవులదని వ్రాశారు. కాని మూలంలో స్పష్టంగా ధృతరాష్ట్రుడు అంధుడగుటచేత రాజు కాలేదనీ, పాండురాజు రాజయాడనీ ఉంది. కాని పాండురాజు జ్యేష్ఠభ్రాతృగౌరవంచేత అతనికి పెద్దరికం ఇవ్వడంచేతనూ, తాను నిరంతరం దిగ్విజయాలలో రాజధానిలో లేకపోవడంచేతనూ, చివరికి సన్యసించి అడవిలో మరణించడంచేతనూ ధృతరాష్ట్రుడు స్థానబలిమిచేతవచ్చిన అధికారాన్ని నిలుపుకొని ధర్మరాజుకి పూర్తిరాజ్యం ఇవ్వవలసిఉండగా కొంతరాజ్యం మాత్రంఇచ్చి దుర్యోధనుడికి ప్రధానమైన హస్తినాపురం సంక్రమించేటట్లు ఏర్పాటుచేశాడు. కనుక కౌరవులది అన్యాయం, పాండవులదే న్యాయం.

కవిరాజుగారు రామాయణంలో ఆర్య—ద్రావిడ సంఘర్షణ ఉందన్నారు. రాక్షసులు ద్రావిడు లనడానికి ఆధారాలు లేవు. ఆర్యులు భారతదేశం వారేనా లేక ఎక్కడనుంచయినా వచ్చారా అన్నది ఇంకా తేలలేదు. ద్రావిడులుకూడా ఇక్కడివారు కారనీ, వేరొక దేశంనుంచి ఇక్కడికి వచ్చినవారేనని కొందరంటున్నారు. ఆర్యులూ ద్రావిడులూ రెండు విభిన్నజాతులవారు కారనీ రెండుభాషలు మాటాడే ఒకే జాతివారనీ ఇటీవల కొందరు చారిత్రికులు అభిప్రాయ పడుతున్నారు, కనుక జన్మతః దాక్షిణాత్యులు ద్రావిడులు, వారిని విదేశీయులైన ఆర్యులు ఆక్రమించారన్న కవిరాజుగారి ఊహ సరైనదికాదు. కవిరాజుగారు రాక్షసులను మంచివారుగానూ రాముణ్ణి దుర్మార్గుడిగానూ చిత్రించారు. రాముని చర్యలలో కొన్ని ఈనాడు మనకి అర్థం కాకపోవచ్చును, కాని అంతమాత్రాన రాక్షసులు మంచివాలెలా అవుతారు? ఆర్యుల సంస్కృతి, విజ్ఞానం మొదలైనవి మనకి తెలుసును. రాక్షసుల మంచితనంగురించి ఏమీ తెలియదు. అట్టిస్థితిలో ఇందుకు విరుద్ధంగా చిత్రించడం అనుచితం.

రామాయణ సంఘటనలను అప్పటి దేశకాల పరిస్థితులనుబట్టి అర్థం చేసుకోవాలి. ఉదాహరణకు ఇటీవల ఒకాయన లక్ష్మణుడు శూర్పణఖ ముక్కు చెవులు కొయ్యడాన్ని, ఆర్యులు అహంకారులై అనార్య స్త్రీల ముక్కులూ చెవులూ కోశారని ఉత్ప్రేక్షించారు. కామన్యాపారదోషం చేసినవారికి ముక్కూ చెవులూ కొయ్యడం ఆనాడు విధింపబడుతున్న శిక్ష. ఆనాడు శిక్షాస్మృతి చాలా కఠినంగా ఉండేది. దొంగకి చేతులు తెగ్గొట్టేవారు. మనకీ శిక్ష దారుణమని తోచవచ్చును. కాని ఆనాటి పద్ధతులవి.

మన పురాణాదులలోనూ, మతంలోనూ మనకు నచ్చని కొన్నివిషయా లుండవచ్చును. అంతమాత్రాన అదంతా చెత్త అని అనడం తగదు. ఇవి పనికిమాలినవయితే నిలిచేవికావు. ఏవో కొన్ని మనకు నచ్చనివి ఉన్నాయని సాంప్రదాయికపు విలువలను పూర్తిగా తిరస్కరించకూడదు. అమెరికా ఆస్ట్రేలియాదేశాలను జయించిన యూరోపుదేశీయులు అక్కడి ఆదిమజాతులను నాశనం చేశారు. ఆర్యులు అట్లాకాక భారతదేశంలోని సర్వజాతులనూ, వారి మతసంస్కృతులతోసహా తమలో విలీనం చేసుకొని దేశానికంతటికీ ఏకసంస్కృతిని ఏర్పరచారు. గత చరిత్రను ఋజుదృష్టితో సమీక్షించాలితప్ప తద్విరుద్ధ దృష్టితోకాదు.

తాంబూలం—నైవేద్యం

వ్యాస సంపుటి.

(లింగం వీరభద్రయ్య చౌదరి. పేజీలు 148 ప్రాప్తిస్థానము. వెల—లేవు)

ఈ పుస్తకంలో పదిహేను వ్యాసాలున్నాయి. దాదాపు అన్నీ సామాజికవ్యాసాలు. రచయిత ఉన్నత విద్యావంతుడు. సామాజిక వ్యవస్థలను గురించి నిశిత పరిశీలనము, విస్పష్టాభిప్రాయములు కలవారు. తన అనుభవాన్నీ ఆలోచననూ పురస్కరించుకొని ఈ వ్యాసాలు రచించారు. ఈ వ్యాసాలలో కొన్ని 1928 సం॥ లో రచింపబడి భారతి, సమదర్శిని పత్రికలలో ప్రచురితమైనట్టివి. తక్కినవి ఇటీవల రచించినవి.

ఈ సంపుటిలో మొదటి ఐదువ్యాసాలూ సమాజంలో స్త్రీల పరిస్థితిని, వివాహాన్ని తద్వి

చేసేదాన్ని; గార్హస్థ్య జీవితాన్ని చర్చించినట్టివి. తక్కినవాటిలో ఆచార్యరంగా, కవిరాజు త్రిపురనేని రామస్వామిచౌదరి, నార్ల ప్రభృతులనుగురించి వ్రాసినవి. ఒక వ్యాసం తన మిత్రునిగురించి వ్రాసినది. చివరి వ్యాసం తన్నుదుఃఖసముద్రంలో ముంచి మరణించిన పుత్రుని గుణములను స్మరిస్తూ వ్రాసినది.

ఈ పుస్తకంలో సామాజికవ్యాసాలు సలభై సంవత్సరాల క్రితం వ్రాసినవి. ఇప్పుడవి కొంతవరకు అప్రస్తుత మవుతున్నాయి. తక్కిన వ్యాసాలు కొందరి వ్యక్తులగురించీ, వారితో తన పరిచయంగురించీ వివరణలు మాత్రమే.

1928 సం॥లో వ్రాసిన 'పాశ్చాత్యస్త్రీలు' అన్న వ్యాసంలో ఆ స్త్రీల గుణగణాలను చాలా గొప్పగా వర్ణించారు. కాని ఆ వ్యాసం కింద వ్రాసిన ఫుట్‌నోట్‌లో అప్పటికీ ఇప్పటికి పరిస్థితులు చాలా మారిపోయాయని, పాశ్చాత్య స్త్రీలు నైతికంగా చాలా దిగజారి పోయారనీ వ్రాశారు. అంతే తప్ప ఇప్పటివారి నైతిక పతనానికి బీజాలు తాను గొప్పగా ఉందని అభివర్ణించిన వారి గత సామాజిక వ్యవస్థలోనే ఉందనీ, పాశ్చాత్యస్త్రీలకు గతమైనది భారతీయ స్త్రీలకు వర్తమానమవుతున్నదనీ వారు ఊహించలేదు.

'నే నెరిగిన కవిరాజు' అన్న వ్యాసంలో త్రిపురనేని రామస్వామి చౌదరిగారికీ తనకీగల సంబంధాన్నీ, వారి సాహిత్యాన్నీ పరిచయం చేశారు.

మొత్తంమీద ఈ వ్యాసాలన్నిటా రచయిత ప్రాచ్య పాశ్చాత్య సంస్కృతులను ఆకళించుకొని స్వకీయాభిప్రాయాలను విస్పష్టభాషలో వ్యక్తపరచారు.

— 'పావని'

మలుపు — మెరుపు

(గ్రంథకర్త: ఎమ్వీయల్; ప్రచురణ: యం. శేషాచలం అండ్ కో. మచిలీపట్నం, మద్రాసు, సికింద్రాబాద్. పే. 180. వెల రు. 2/—)

రెండు నవలికలు. ధనికులు డబ్బును కూడబెట్టుకోవటంలోనే జీవితాన్ని వ్యయం చేస్తారు. ప్రేమానురాగాలకు వారి హృదయాల్లో స్థానంలేదు. నేలబారుమనుషులు. లక్ష్మీపతి అట్టివాడు. దోపిడీ వ్యవస్థకు ప్రతినిధి. రాంబాబు మావయ్య జగన్నాథం లక్ష్మీపతికి కుడిభుజం. రాంబాబు మధ్యతరగతిలోని నీతి నిజాయితీకి ప్రతినిధి. సుందరం ధనికుడైనా ధార్మికుడు. ఉదారహృదయుడు. రాంబాబు ఆప్తమిత్రుడు. పత్రికాసంపాదకుడుగా రాంబాబు లక్ష్మీపతి మోసాలను రచ్చ కీడ్చాడు. ఎవ్వరు చెప్పినా ఖాతరు చేయలేదు. నిర్భీకతతో తన విధిని నిర్వర్తించాడు. శత్రువులకంటె అనుచరులవల్ల ఎక్కువ ప్రమాదమని రుజువుచేసాడు, పత్రికలో పనిచేసే వెంకట్రావు. లక్ష్మీపతితో చేతులు కలిపి సంపాదకుడు చంద్రాన్ని కొట్టిస్తాడు. ఈ సంఘటనతో జగన్నాథం మారతాడు. లక్ష్మీపతి పశ్చాత్తాప పడతాడు. మెలకువా నిద్రాకాని సమాధిస్థితిలో కాంతిలోకాన్ని చూడగలిగాడు. పశ్చాత్తాపమే విముక్తి; డబ్బుకన్నా ప్రేమానురాగాలు, నీతి నిజాయితీలు మనిషికి ముఖ్యమని చెపుతుంది మలుపు.

మాటల్లో సంస్కరణ—ఆచరణలో సంప్రదాయం. చదువుకుంటూ అమ్మాయిని ప్రేమిస్తారు. పెళ్లి ప్రసక్తివచ్చేప్పటికి జారుకుంటారు. పెద్దవాళ్లంటే భయం. ఈ బలహీనత మనిషిని ముందుకు తీసుకుపోవటంలేదు. మగవాళ్లకన్నా ఆడవాళ్లలోనే సంస్కారదృష్టి ఎక్కువని వరలక్ష్మి రుజువు పరుస్తుంది. మూర్తి ప్రేమించి పెళ్లిచేసుకుందామనుకున్నాక, కరుడుగట్టిన సంప్రదాయవాది అనుకున్న తండ్రి కరగక తప్పలేదు. పిరికివాళ్లు మాటలు చెపుతారు. సాహసంతులు ముందడుగువేస్తే సమాజం వారి వెంటరాక తప్పదు.

మలుపుకథ బాగుంది. కృషిచేస్తే మంచి నవలలు రాయగలరు.

పైపాటు

(గ్రంథకర్త: 'కృష్ణ' ప్రచురణ: యం. శేషాచలం అండ్ కో—మచిలీపట్నం, మద్రాసు, సికింద్రాబాద్ పే: 172. వెల రు. 2/—)

గ్రామసీమలు ప్రశాంతజీవన ప్రతిబింబాలుగా వుండేవి. రాజకీయాలు ప్రవేశించి గ్రామీణ జీవితాన్ని కలుషితం చేసాయి. కక్షలు, హత్యలు, గృహదహనాలు పెచ్చరిల్లిపోతున్నాయి. ఈ మార్పును సునిశితంగా చూపుతున్న దీ నవల. పంచాయితీబోర్డు ప్రెసిడెంటు పదవికోసం చౌడయ్యపడిన పాట్లూ, కరిచిన గడ్డీ, డబ్బు కక్కుర్తితో యాదయ్యచేసిన పనులు (భార్య అన్నమాటలు), గజ్జెలు మంచితనం పెనవేసుకున్న అమాయికత వాస్తవికంగా వర్ణించారు. మువ్వలూ, గజ్జెలూ ముచ్చటైన జంట. తల్లి మంకుపట్టువల్ల, గజ్జెల్ని చేసుకోలేక పోయింది మువ్వ. తండ్రికి యిష్టంలేకపోయినా ఎదిరించలేడు. గ్రామీణుల జీవితంతో సంఘర్షణ ఏర్పడినపుడు పోరాడరు. రాజీపడతారు. అందుకే సమస్యలు సులభంగా పరిష్కార మవుతాయి. చౌడయ్య ఎదురుదీ సుబ్బయ్య. రమేషు చౌడయ్యకొడుకు. సుబ్బయ్య కూతురు లక్ష్మి. ఇద్దరూ ప్రేమించుకుని పెళ్లిచేసుకుని ఎదురుద్దీలను వియ్యంకుల్ని చేస్తారు. ఆ గ్రామంలో నాగరికతకు నాంది ఈ సంఘటన. యాదయ్య తనకుతానే మనసు మార్చుకోగల్గడం విశేషం.

వాస్తవిక గ్రామీణ జీవితచిత్రణ ప్రతిబింబితమయింది. సజీవములైన పాత్రలు. తెలంగాణా ప్రాంతపు అందమైనభాష. మాండలికపదాలకు అర్థాలు కూడా యివ్వబడినాయి. ఆలోచనను రేకెత్తించక పోయినా అనుభూతిని కలిగిస్తుంది.

—శివకుమార్.

Printed and Published For Nageswara Rao Estates (Private) Ltd., by S. Nageswara Rao at the Andhra Patrika Press, 6 & 7 Thambu chetty Street, Madras-1, Editor : S. Sambhu Prasad.

భారతి

ప్రకటన రేట్లు

కవరు పేజీలు		కాజువల్ రేట్లు	కాంట్రాక్టు రేట్లు
4 వ కవరు పేజి	...	రు. 175/-	రు. 150/-
2 లేక 3 వ కవరు పేజి	...		
ఒకే (నలుపు) రంగు	...	రు. 150/-	రు. 125/-
లోపలి పేజీలు			
పూర్తి పేజి	...	రు. 125/-	రు. 100/-
అర పేజి	...	రు. 65/-	రు. 55/-
పావు పేజి	...	రు. 40/-	రు. 35/-

ప్రత్యేక స్థానములకు 25% అదనం.

సం॥నకు వరుసగా 6 ప్రకటనలు చేయువారికి కాంట్రాక్టు రేట్లు వర్తించును.

చందా వివరములు

సంవత్సర చందా	...	రు. 12—00
6 మాసముల చందా	...	రు. 6—00
విడి ప్రతి	...	రు. 1—00

మేనేజరు, భారతి.

మద్రాసు—1.